డిసెంబర్
2015

116

సంపుటి : 10 సంచిక : 7

వెల రు. 10 /-

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

స్త్రీయ మానసిక ధోరణిపై పోరాడుదాం
పెట్టుబడిదారీ విలువలు
వైద్యరంగంలో ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు
భారత ఆర్థిక వ్యవస్థలో ఆవు పాత్ర
రిజర్వేషన్ల అమలులో మొండిచేయి
మోడీ సిలికాన్ పర్యటన.. డిజిటల్ ఇండియా
అంటరానితనం : వివక్ష -దోపిడీ
మతోన్మాద నియంతృత్వ పోకడలకు ప్రతిఘటన
ప్రత్యామ్నాయ విధానాలను బలపరిచేవారికిఎల్‌డిఎఫ్‌లో స్థానముంటుంది
జైత్రయాత్ర దళ సారథి కొమ్మిడి కోదండ రామిరెడ్డి

స్ఫూర్తి

జైత్రయాత్ర దళ సారథి

# కొమ్మిడి కోదండ రామిరెడ్డి

**జి. రఘుపాల్, భూపతి వెంకటేశ్వర్లు**



శిక్షణ పొందుతున్న తెలంగాణ సాయుధ పోరాట గెరిల్లా దళాలు

తెలంగాణ మాగాణంలో మణిపూస కొమ్మిడి కోదండ రామిరెడ్డి. అలుపెరుగని పోరాట స్ఫూర్తి, జాతీయ భావాలు కలిగిన గీతాలతో వందలాది మంది యువకులను పోరాటంవైపు నడిపిన యోధుడు కొమ్మిడి. దోపిడీ, దౌర్జన్యాలు, బానిస జీవితం పోవాలని నైజాం ముష్కర పాలన అంతం కావాలని, అందరికీ సుఖ సంతోషాలిచ్చే నూతన సమాజ ఆవిర్భావం జరగాలని సంకల్పించి నిజాం రాజు పాలనపై ధ్వజమెత్తాడు.

ప్రజా పీడకులపై ఆగ్రహం పెంచుకొని పోరు సల్పిన కోదండ రామిరెడ్డి 1922 సంవత్సరంలో నల్గొండజిల్లా బీబీనగర్‌మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో కొమ్మిడి రామచంద్రా రెడ్డి, రాములమ్మ దంపతులకు జన్మించారు. కోదండ రామిరెడ్డి పురిటిలోనే తల్లిని పోగొట్టుకోవడంతో పిన్నమ్మలు లక్ష్మమ్మ, రుక్కమ్మలు తల్లిలేని లోటును తీర్చారు. రామిరెడ్డి ప్రాథమిక విద్య ప్రయివేటుగా జరిగింది. అదే సమయంలో రామిరెడ్డి ఆర్య సమాజం భావా లతో ప్రభావితమయ్యాడు. ప్రాథమిక విద్య అనంతరం భువనగిరిలోని మిడిల్ స్కూల్‌లో చేరాడు. ఆనాడు తాలూకాలో ఆ స్కూల్ ఒక్కటే ఉండేది. ఆనాడే జాతీయ భావాలు బలపడి యున్న రామిరెడ్డి నైజాం బానిస పాలనపై ఆగ్రహం పెంచుకున్నాడు. సురవరం ప్రతాప రెడ్డి, మందముల నర్సింగరావు సంపాదకత్వా లలో వెలువడే గోలుకొండ, రయ్యత్ పత్రికలను ఆంధ్ర రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ రహస్యంగా నడుపుతున్న స్వతంత్ర భారత్ పత్రికను రామిరెడ్డి తెప్పించుకొని చదివేవారు. ఈ కాలంలోనే భువనగిరిలో ఆరుట్ల లక్ష్మీనర్సింహరెడ్డి ఆధ్వర్యం లోని మిత్ర మండలి పనితీరుకు ఆకర్షితుడైన కోదండ రామిరెడ్డి దాని విస్తరణకు అహో రాత్రులు శ్రమించారు. 1941నాటికే ఆంధ్ర మహాసభలో చేరి కమ్యూనిస్టు పార్టీతో సంబంధం ఏర్పరుచుకున్నారు. నల్లగొండజిల్లా చిలుకూరులో జరిగిన 8వ ఆంధ్ర మహాసభ సన్నాహాల్లో పాల్గొన్నారు. ఈ సభకు రావి నారాయణరెడ్డి అధ్యక్షత వహించగా ఎక్కువ సంఖ్యలో ప్రతినిధులు హాజరై జాతీయ గీతాలు, రైతు గేయాలు పాడి ఉత్తేజపరిచారు. వారితో సమానంగా కోదండ రామిరెడ్డి పాటలు పాడి జనంచే చప్పట్లు కొట్టించుకున్నాడు. సభ నిర్ణయానుసారం జట్లు జట్లుగా వెళ్ళి యువజను లను సంఘటితపరిచి దేశభక్తిని ప్రబోధించారు. రామిరెడ్డి, మాటూరి కృష్టయ్య, గులాం ఆలీ, మహ్మద్ జహంగీర్ మంచాల శంకరయ్యల సహకారంతో హుజూర్‌నగర్, మిర్యాలగూడెం కార్యకర్తలతో సంబంధాలు ఏర్పరుచుకున్నారు.

తెలంగాణ సాయుధ పోరాటం 1944 నుంచి 1947 నాటికి తీవ్రరూపం దాల్చింది. 1946 నాటికి రజాకార్ల హత్యలు, గృహదహనాలు, మహిళలపై మానభంగాలు ప్రారంభమయ్యాయి. వీరి భీభత్సకాండను ఎదిరిస్తూ దాడులు చేసినప్పుడు అందుబాటులో ఉన్న ఆయుధాలతో తిరగబడాలని రామిరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. 80 మందితో ఉన్న కోదండ రామిరెడ్డి జైత్రయాత్ర దళాన్ని పిల్లాయిపల్లి, ఎంకిర్యాల, జూలూరు, పెద్దగూడెం, నారాయణగిరి, పోచంపల్లి, జలాల్‌పురం, తుర్కపల్లి, బామనపల్లి, జిలుకపల్లి, పెద్దకొండూరు, నాగారం, తాళ్ళసింగారం, ఎల్లంకి, కేసారం, మందోల్లగూడెం, ఇందిర్యాల, పెద్దరావులపల్లి బొల్లేపల్లితో సహా మొత్తం 70 గ్రామాలలో ఏకబిగిన దళం జైత్రయాత్రను జరిపి, గ్రామ సభలు నిర్వహించింది. రజాకారుల క్యాంపుల పై కోదండ రామిరెడ్డి దళం జరిపిన దాడులలో ఒకటి ఎంకిర్యాల గ్రామంలో ఘటన. దళ సభ్యులను పట్టి పోలీసులకు అప్పగించినందుకు మహమ్మద్ ఖాజీ అతని అల్లునిపై రామిరెడ్డి దళం దాడిచేసి కాల్చిచంపింది. రెండు సుంకనపల్లికి రామిరెడ్డి దళం వెళుతున్నట్లు రజాకార్లకు కబురు అందేటట్లు చేయగా, రజాకార్లు 60 మంది రామిరెడ్డి దళంపై దాడిచేసేందుకు రాగానే మాటువేసి వారిపై తుపాకులతో, తల్వారులతో దాడికి దిగి గుక్క తిప్పుకోనివ్వలేదు. మూడు గోకారంలో షేక్ ఆలీ అనే రజాకారు నాయకుడు కిరాయి బంటును రహస్య వార్తాహరునిగా నియమించుకొని దళాల ఉనికి తెలుసుకుంటుంటే అతన్ని పట్టుకొని కాల్చిచంపటం ముఖ్యమైనవి. కుర్రంల గ్రామంలో ఒక రైఫిల్, రెండు ట్వల్‌బోర్ తుపాకులను రామిరెడ్డి హస్తగతం చేసుకున్నాడు. రామిరెడ్డి దళం దాడులకు తట్టుకోలేక ఎంకిర్యాల నుంచి రజాకార్లు క్యాంపును ఎత్తివేసి బీబీ నగర్ చేరుకున్నారు.

రజాకార్ల ఎత్తుగడలను తిప్పికొట్టేందుకు కోదండ రామిరెడ్డి జైత్రయాత్ర దళాన్ని నాలుగు గెరిల్లా దళాలుగా విభజించారు. ఒక్కో దళంలో 20 మంది సభ్యులు ఉండేటట్లు నాలుగు దళాలను ఏర్పాటు చేసినారు. 1 పిల్లాయిపల్లి, 2 తాళ్ళ సింగారం, 3 రాఘువారెడ్డి దళం 4 రుద్రవెల్లి పాండురంగం దళంగా ఏర్పాటు చేశారు. భువనగిరి మండలం కిష్టాపురంలో రామిరెడ్డి బహిరంగసభలో ప్రసంగిస్తుండగా పసిగట్టి గుండ్రాంపల్లి క్యాంపు నుంచి సయ్యద్ మక్బుల్ నాయకత్వాన 60 మంది రజాకారులు అకస్మాత్తుగా రామిరెడ్డి దళంపై దాడికి దిగాయి. రాంరెడ్డి ఎదురు కాల్పులకు దిగడంతో రజాకార్లు తోకముడుచుకొని చనిపోయిన వారి శవాలను వెంట తెచ్చుకున్న ట్రక్కులో తీసుకొని వెళ్ళారు. గుండ్రాంపల్లి క్యాంపును ఎత్తివేయడానికి గురునాథరెడ్డి దళం దాడిచేసింది. అయినా అది ఫలించకపోవడంతో కోదండరామిరెడ్డి పథకం వేసుకొని జరిపిన దాడిలో 10 మంది రజాకారులు చనిపోయారు. 25 మంది రజాకార్లు సైదాబాద్ బోళ్ళలో కాల్చి వేయబడ్డారు. గుండ్రాం

(మిగతా 35వ పేజీలో)

# ఈ సంచికలో...


1. జైత్రయాత్ర దళ సారథి కొమ్మిడి కోదండ రామిరెడ్డి
జి. రఘుపాల్, భూపతి వెంకటేశ్వర్లు . 2

2. స్వీయ మానసిక ధోరణిపై పోరాడుదాం
సీతారాం ఏచూరి ...... 4

3. పెట్టుబడిదారీ విలువలు
ఎస్. వీరయ్య ......... 10

4. జాతీయ ఆరోగ్య విధానం ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు
సామాజిక ఆరోగ్య అధ్యయన కేంద్రం, జె.ఎన్.యు ..... 13

5. భారత ఆర్థిక వ్యవస్థలో ఆవు పాత్ర
ప్రబీర్ పురకాయస్థ, ఇంద్రజిత్ సింగ్ 17

6. రిజర్వేషన్ల అమలులో మొండిచేయి
కంచల జయరాజ్ ..... 21

7. మోడీ సిలికాన్ పర్యటన..డిజిటల్ ఇండియా
డిబెన్ దాస్ ............ 23

8. అంటరానితనం : వివక్ష-దోపిడీ
ఎ. కోటిరెడ్డి ............ 26

9. మతోన్మాద నియంతృత్వ పోకడలకు ప్రతిఘటన
నాగరాజు .................. 30

9. ప్రత్యామ్నాయ విధానాలను బలపరిచేవారికి ఎల్‌డిఎఫ్‌లో స్థానముంటుంది
బి.వి. రాఘవులు ........ 33



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరఫున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
**ఫోన్: ఎడిటోరియల్ 0866-2573822**
**మేనేజర్: 040-27673787**
EMail: svenkatarao_1958@yahoo.com
visit cpi(m) site at : cpim.org


# పార్టీ ప్లీనం

**భా**రత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తన నిర్మాణాన్ని మరింత పటిష్ట పరుచుకుని రానున్న పోరాటాలకు సిద్ధమయ్యేందుకు ఈ నెల 27 నుండి 31 వరకు కొల్‌కతాలో ప్రత్యేక నిర్మాణ ప్లీనం జరుపుతున్నది. ప్రస్తుత దేశ రాజకీయ, ఆర్థిక పరిస్థితులు, అంతర్జాతీయంగా పెట్టుబడిదారీ వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభం నేపథ్యంలో ఈ ప్లీనం సమావేశాలకు చాలా ప్రాముఖ్యత ఉంది.

ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభం సుదీర్ఘంగా సాగుతోంది. 2008లో అమెరికాలో ప్రారంభమైన సంక్షోభం క్రమంగా భూగోళమంతా వ్యాపిస్తోంది. అన్ని ఖండాలనూ, అన్ని దేశాలనూ సంక్షోభంలోకి లాగుతోంది. భారత దేశం కూడా దీనికి అతీతం కాదు. కాకపోతే ఈ ప్రపంచ సంక్షోభాన్ని ఉపయోగించుకుని తాము సంక్షోభం నుండి బయటపడాలని మన దేశ పాలక వర్గాలు ప్రయత్నిస్తున్నాయి. విదేశీ పెట్టుబడులకు ఎర్రతీవాచీ పరవడం, మేక్ ఇన్ ఇండియా పేరుతో దేశంలోని వనరులను పళ్లెంలో పెట్టి విదేశీ, స్వదేశీ కార్పొరేట్లకు అప్పగించడానికి ప్రయత్నించడం.. ఇవన్నీ ఈ ప్రయత్నాల్లో భాగమే. ఈ చర్యల వల్ల దేశంలోని కార్మికవర్గం, శ్రామిక ప్రజానీకం మీద విపరీతమైన దాడులు జరుగుతున్నాయి. ధరలు, నిరుద్యోగం, దారిద్ర్యం పెరుగుతున్నాయి. అసమానతలు తీవ్రమవుతున్నాయి. ప్రజల్లో అసంతృప్తి రాజుకుంటోంది. ఒకవైపు ప్రజలపై దాడులు చేస్తూ, మరోవైపు అసంతృప్తిని దారిమళ్లించేందుకు పాలక వర్గాలకు నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపీ ప్రభుత్వం చక్కగా ఉపయోగపడుతోంది. పక్కా నయా-ఉదారవాదం, పచ్చి మతోన్మాదం కలగలిసిన కాక్‌టైల్ లాంటి మోడీ ప్రభుత్వ విధానాలు శ్రామిక వర్గానికి తీవ్ర హానికరంగా మారాయి.

ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడే పరిస్థితిలో నేడు దేశంలోని బూర్జువా ప్రతిపక్షాలు లేవు. ఎందుకంటే అధికారంలో ఉన్నప్పుడు అవి కూడా ఇవే విధానాలను అవలంభిస్తున్నాయి. అవకాశం వస్తే అవి కూడా మతతత్వ పార్టీలతో జతకలుస్తున్నాయి. అందువల్ల దేశంలో మోడీ విధానాలను ఎదుర్కోగలవి వామపక్షాలు మాత్రమే. కానీ గత ఎన్నికల తరువాత వామపక్షాలు బలహీనపడ్డాయి. నిజానికి గత కొంత కాలంగా వామపక్షాల, ముఖ్యంగా సిపిఐ(ఎం) ప్రజాపునాది బలహీనపడుతూ వస్తోంది. శ్రామిక వర్గ పార్టీ బలహీనపడడం అంటే ప్రజల పోరాట శక్తి బలహీనపడడమే. ప్రజా ఉద్యమాలు బలహీనపడడమే. అందువల్ల వామపక్షాలు బలపడితేనే ప్రజా ఉద్యమాలు బలపడతాయి. కానీ వామపక్షాలు బలపడాలంటే ప్రజా ఉద్యమాలు బలపడాలి. ఉద్యమాలు బలపడాలంటే వామపక్ష పార్టీలు ముఖ్యంగా సిపిఐ(ఎం) వ్యవస్థాగత లోపాలను సరిదిద్దుకుని ఉద్యమాలకు సిద్ధం కావాలి.

ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకునే 2014 ఎన్నికల సమీక్ష సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ నాలుగు కర్తవ్యాలను పార్టీ ముందుంచింది. వాటిలో మొదటిది పార్టీ ఎన్నికల విధానాన్ని సమీక్షించడం. ఆ పని విశాఖపట్నంలో జరిగిన 21వ మహాసభలో జరిగింది. రెండవది, పార్టీ నిర్మాణాన్ని సమీక్షించి ప్రజల్లో పనికి దాన్ని సంసిద్ధం చేయడం. మూడవది, ప్రజాసంఘాల పనిని సమీక్షించి దిశానిర్దేశం చేయడం. నాల్గవది, వివిధ తరగతుల ప్రజలపై సరళీకరణ విధానాల ప్రభావం గురించి జరిగిన అధ్యయనం ఆదారంగా సరైన నినాదాలు రూపొందిండం. ఈ కర్తవ్యాల గురించి నిర్మాణ ప్లీనంలో చర్చించనున్నారు. రానున్న పోరాటాలకు పార్టీని సిద్ధం చేయడానికి కీలకమైన నిర్ణయాలు తీసుకోనున్నారు. అందువల్ల ప్రతి పార్టీ సభ్యుడు ప్లీనం తీసుకునే నిర్ణయాలను అధ్యయనం చేయాలి, అమలు పరచాలి. పార్టీని, ప్రజా సంఘాలను రానున్న పోరాటాలకు సిద్ధం చేయాలి.


**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

<u>చిరునామా</u>

**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**ఈ మాసం ముఖ్యాంశం**

# స్వీయ మానసిక ధోరణిపై పోరాడుదాం

**సీతారాం ఏచూరి**



రచయిత సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి

**క**మ్యూనిస్టు పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయటం అన్న ప్రశ్న ప్రతి విప్లవ కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పరిశీలించాల్సిన సమస్య. ఏ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణమైనా నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అధ్యయనం చేశాక రూపొందించుకున్న రాజకీయ ఎత్తుగడల పంథా మేరకు తీసుకునే లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లే విధానాలకు లోబడి ఉంటుంది. కార్మిక వర్గ నాయకత్వంలోని విప్లవ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి అవసరమైన మౌలిక సూత్రాలకు లోబడి పని చేసే కమ్యూనిస్టు పార్టీ యావత్తు పార్టీ శ్రేణులను ఉత్సాహపర్చి పార్టీ ఇచ్చిన వర్తమాన కర్తవ్యాలను పూర్తి చేయగల క్రియాశీలురుగా తయారు చేయాలి. అందువల్ల కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం క్రియాశీలమైనది.

నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషించటమే గతితర్కిక సూత్రాల సారాంశమన్న లెనిన్ సూత్రీకరణను దశాబ్దాలుగా పదే పదే పునరుచ్ఛరణ చేస్తున్నాము. ఈ సూత్రీకరణలో అనేక పార్శ్వాలు ఉన్నాయి. మొదటిది నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా గుర్తించటం, దాని ఆధారంగా ఆయా నిర్దిష్ట పరిస్థితులు విప్లవపోరాటాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాలపై ఏ విధమైన ప్రభావాన్ని చూపుతున్నాయి, విప్లవోద్యమంపై వాటి ప్రభావం ఏమిటి అన్నవి ఈ పార్శ్వాలు. నిర్దిష్టపరిస్థితులను నిర్దిష్టంగా అధ్యయనం చేయటానికి మార్క్సిస్టు ప్రమాణాలు శాస్త్రీయంగా వర్తింపచేయాలని ప్రత్యేకంగా చెపాల్సిన అవసరం లేదు. రెండు అంశాలు – నిర్దిష్ట పరిస్థితులు నిర్దిష్టంగా పరిశీలించటం, వాటి పర్యవసానాలను సరిగ్గా అంచనావేయటం – నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అధ్యయనం చేయ టంలో భాగమే. నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అంచనా వేయటంలో పొరపాటు జరిగితే వాటి పర్యవసానాల గురించిన అంచనాలు కూడా పొరపాటు అంచనాలుగానే ఉంటాయి. అందువల్లనే ఇటువంటి నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అంచనా వేసేటపుడు నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అధ్యయనం చేయాలన్న లెనినిస్టు సూత్రాన్ని సర్వదా గమనంలోకి తీసుకోవాలి.

20వ శతాబ్దంలో విజయవంతమైన విప్లవాల చరిత్రను గమనిస్తే ఆయా విప్లవాలకు విజయవంతంగా నాయకత్వం వహించిన కమ్యూనిస్టు పార్టీలన్నీ స్వీయ మానసిక ధోరణిపై అలుపెరగని పోరాటం సాగించాయన్న వాస్తవాన్ని మన దృష్టికి తెస్తాయి. కమ్యూనిస్టు పార్టీల్లో ఇది నిరంతర పోరాటం. ప్రతి కమ్యూ నిస్టు సర్వదా మనసులో పెట్టుకోవాల్సిన అంశం. ఈ పోరాటమే కమ్యూనిస్టు పార్టీ నిర్మా ణాన్ని ఇతరుల కంటే ఉన్నతస్థానంలో నిలుపుతుంది.

నిర్దిష్ట పరిస్థితులపట్ల అవాస్తవిక అంచనాలకు వస్తే దానిపై ఆధారపడ్డ రాజకీయవైఖరి, ఎత్తుగడల వైఖరి తప్పుడు ధోరణులకు దారి తీస్తుందన్నది నిర్వివాదాంశం. రాజకీయ ఎత్తుగడలపంథా శాస్త్రీయ విశ్లేషణ ప్రాతిపదికన రూపొందించేదే అయినప్పటికీ దాన్ని ఆచరణ సాధ్యం చేయటం అన్నది పార్టీ నిర్మాణ సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. స్టాలిన్ ఒక సందర్భంలో చెప్పినట్లుగా రాజకీయ ఎత్తుగడల పంథా నూటికి నూరుపాళ్లు సరైనదే అయిఉండవచ్చు. కానీ అటువంటి సరైన ఎత్తుగడల పంథాను ప్రజలదగ్గరకు చేరవేయగల శక్తివంతమైన పార్టీ నిర్మాణం లేనంతవరకు ఈ ఎత్తుగడల పంథా ఉపయోగపడదు. ప్రజల చైతన్యాన్ని పెంపొందించటంలోనూ, విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో వారిని భాగస్వాములను చేయటంలోనూ పార్టీ నిర్మాణం కీలక పాత్ర పోషిస్తుంది. పార్టీ నిర్మాణపు వివిధ పార్శ్వాల్లో ఒక ముఖ్యమైన పార్శ్వం స్వీయ మానసిక ధోరణిపై నిరంతరం సాగే పోరాటం. నిర్దిష్టపరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషించేక్రమంలో పొడచూపే స్వీయమానసిక ధోరణిపై సాగే పోరాటం కీలకమైనది. అంతేకాదు. అటువంటి నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట విశ్లేషణ ఆధారంగావర్గ పోరాటాలకు పదును పెట్టడం, విస్తృత జన బాహుళ్యాన్ని పోరాటరంగంలో తీసుకురావటంలో ఈ స్వీయమానసిక ధోరణి అపుడపుడూ వ్యక్తమవుతుంది.

క్లుప్తంగా చెప్పాలంటే నిర్దిష్ట పరిస్థితిని సరిగ్గా అర్థం చేసుకోవటానికి, వర్గ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లగలిగే విధంగా సరైన రాజకీయ ఎత్తుగడల పంథాను రూపొందించుకోవటానికి, ఈ లక్ష్య సాధనకు అవసరమైన సరైన నిర్మాణ పద్ధతిని రూపొందించుకోవటానికి స్వీయమానసిక ధోరణిపై పోరాటం అనివార్యం. ఏ స్థాయిలోనైనా కనిపించే స్వీయమానసిక ధోరణి విప్లవోద్యమాన్ని కుంటుపర్చగలదు.

**స్వీయమానసిక ధోరణి**
**అసమగ్రమైన అధ్యయన పద్ధతి**

చైనా విప్లవ పోరాటం సాగుతున్న కాలంలో చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ నిర్వహించిన రాజకీయ పాఠశాల ప్రారంభిస్తూ మావో " స్వీయమానసిక ధోరణి అసమగ్రమైన అధ్యయన పద్ధతి. మార్క్సిజం–లెనినిజానికి భిన్నమైనపద్ధతి. చైనా కమ్యూనిస్టుపార్టీ ప్రమాణాలకు, పద్ధతులకు పొసగని పద్ధతి. మనకు కావల్సింది మార్క్సిస్టు లెనినిస్టు అధ్యయన పద్ధతి. మనం చెప్పుకునే అధ్యయనపద్ధతి కేవలం అధ్యయన పద్ధతి యావత్తు పార్టీలో కొనసాగుతున్న అధ్యయనపద్ధతి గురించి ప్రస్తావిస్తున్నాను. స్థానిక బాధ్యతల్లో నాయకత్వ స్థానాల్లో ఉన్న కామ్రేడ్స్ ఆలోచనా ధోరణికి సంబంధించిన సమస్య ఇది. పార్టీలోని శ్రేణులన్నీ అనుసరిస్తున్న ఆలోచనా ధోరణి. మార్క్సిజం–లెనినిజం పట్ల కార్యకర్తలు, పార్టీ శ్రేణుల అవగాహనకు సంబంధించినది మరియు కేటాయించిన పనిపట్ల కార్యకర్తలకు ఉన్న దృక్పథం గురించిన సమస్య." అని ఎత్తి చూపారు.

"ఈ పాఠశాలకు హాజరైన కామ్రేడ్స్ మార్క్సిజాన్ని జీవం లేని ముడి సిద్ధాంతంగా చూడకూడదు. మార్క్సిస్టు సిద్ధాంతాన్ని అర్థం

చేసుకోవటం,దాన్నివర్తింపచేయటం జరగకుండా మనకు కేటాయించిన పనిలో విజయం సాధించలేము. ఒకటి రెండు ఆచరణాత్మక సమస్యలకు సంబంధించిన మార్క్సిస్టు – లెనినిస్టు సూత్రాలు సమగ్రంగా సమర్ధవంతంగా వర్తింపచేస్తే మనం సాధించే ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయి. ఆ పాఠశాలకు హాజరైన కార్యకర్తలు కూడా పాఠశాలలో మార్క్సిస్టు లెనినిస్టు సూత్రాలు అర్థం చేసుకున్న తర్వాత చైనా ఎదుర్కొంటున్న సమస్యలను ఎలా చూడగలుగుతున్నారు, అసలు వారి దృష్టికి సమస్యలువస్తున్నాయా లేదా అన్న విషయాన్ని ఆధారం చేసుకుని కార్యకర్తలందరూ ఏ శ్రేణికి చెందినవారు అన్నది నిర్ధారించటానికి మార్కులు వేయాలి.” (మావో సంకలిత రచనలు, సంపుటి 3, పేజిలు 36–38)

నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అధ్యయనం చేయటం గురించిన లెనిన్ ప్రాపంచి దృక్పథం, మార్క్సిస్టు అవగాహనకు సంబంధించిన వ్యాఖ్యానం నుండి మావో అనుభవాలు నేర్చుకున్నాడు. కార్మికోద్యంలో చొరబడిన అన్ని రకాల మార్క్సిస్టు వ్యాఖ్యానాలు, మార్క్సేతర పద్ధతుల పట్ల లెనిన్ అవిరళ పోరాటం సాగించారు.

సైద్ధాంతికంగా చూసినపుడు జర్మన్ తత్వవేత్త కాంట్ సూత్రీకరణల గురించి చర్చిస్తూ లెనిన్ తన హెగెల్ తర్కశాస్త్రం – దాని పరిధి అన్న రచనలో అందుబాటులో ఉన్న సమాచారాన్ని ఒకే కోణం నుండి చూసే స్వీయమానసిక ధోరణికి వ్యతిరేకంగా పోరాడాలని ప్రతిపాదిస్తాడు. లెనిన్ తన వాదనను మరింత విపులీకరం చేస్తూ “విలువైన అనుభవాన్ని సంపూర్ణంగా పరిశీలించటానికి బదులుగా పాక్షికంగా పరిశీలిస్తే, ఉదాహరణకి, సిద్ధాంతానికి, అంచనాలకు అనుగుణంగా ఉన్నంత మేరకే పరిశీలించటం జరుగుతుంది. ఆ విధంగా నిర్దిష్ట అనుభవాన్ని ముందస్తు నిర్ణయాలతో ముడి పెట్టినిర్దారణకు రావటానికి ప్రయత్నం జరుగుతుంది. దాంతో సిద్ధాంతం ప్రాతిపదికే మారిపోతుంది. మొత్తం కళ్లముందున్న వాస్తవంలో ప్రతిపాదిత సిద్ధాంతానికి అనుగుణంగా ఉన్న భాగాన్ని మాత్రమే సూత్రీకరించటం జరుగుతుంద.” అన్నారు. (వి.ఐ.లెనిన్ సంకలిత రచనలు, సంపుటి 38, తత్వశాస్త్రంపై నోట్సు, పేజీ 210)

**సిపిఐ(ఎం) ఏర్పాటు : భారత దేశ పరిస్థితులను నిర్దిష్టంగా అంచనా వేయటం**


భారతదేశపు నిర్దిష్ట పరిస్థితులను మార్క్సిజం–లెనినిజంను నిర్దిష్టంగా, శాస్త్రీయంగా వర్తింపచేయటం ద్వారానే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆవిర్భవించింది.

> **“భారతదేశంలో సాధించాల్సిన విప్లవం, దాని దశ, దిశలకు సంబంధించి, భారత పాలక వర్గాల స్వభావానికి సంబంధిం చిన సరైన అంచనా ప్రాతిపదికగా పార్టీలో అంతర్గతంగా సాగిన సుదీర్ఘ సైద్ధాంతిక పోరా టంలో మితిమీరిన రివిజనిస్టు పోకడలనుండి భారత కమ్యూనిస్టు ఉద్యమం తెగతెంపులు చేసుకున్నది.”**

20వ మహాసభలో పార్టీ ఆమోదించిన “కొన్ని సైద్ధాంతిక సమస్యలపై తీర్మానం”లో “అవిభక్త కమ్యూనిస్టు పార్టీలో చోటుచేసుకున్న తీవ్రమైన రివిజనిస్టు ధోరణులు నాడు మొత్తంగా దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్నే పట్టాలు తప్పించే స్థాయికి చేరింది. దాంతో భారతదేశాన్నిదోపిడీ పాలన నుండి విముక్తి చేయాలన్న ప్రయత్నాలకే విఘాతం కలిగే పరిస్థితి ఏర్పడింది. దీనికి వ్యతిరేకంగా సాగిన తీవ్రమైన పోరాటం పర్యవసానంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆవిర్భవించింది. భారతదేశంలో సాధించాల్సిన విప్లవం, దాని దశ, దిశలకు సంబంధించి, భారత పాలక వర్గాల స్వభావానికి సంబంధించిన సరైన అంచనా ప్రాతిపదికగా పార్టీలో అంతర్గతంగా సాగిన సుదీర్ఘ సైద్ధాంతిక పోరాటంలో మితిమీరిన రివిజనిస్టు పోకడలనుండి భారత కమ్యూనిస్టు ఉద్యమం తెగతెంపులు చేసుకున్నది. ఈవిధంగా మార్క్సిజం–లెనినిజపు విప్లవ సిద్ధాంతపు మౌలిక సూత్రాలను భారత దేశపు నిర్దిష్ట పరిస్థితులకు వర్తింపచేసే క్రమంలో సిపిఐ(ఎం) ఆవిర్భవించింది.

ఏర్పడిన అనతికాలంలోనే సిపిఐ(ఎం) వామపక్ష అతివాద దుందుడుకువాదానికి గురైంది. భారత కమ్యూనిస్టు ఉద్యమాన్ని మరోమారు కకావికలు చేసిన ధోరణులపై సైద్ధాంతిక పోరాటానికి తలపడాల్సి వచ్చింది. ఈ పోరాటాన్ని సాగించే క్రమంలో వామపక్ష అతివాద దుందుడుకువాదులు పలువురు కామ్రేడ్లపై భౌతికదాడులకు దిగటంతో ఎంతో మంది తమ ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది.

ఈ పెడధోరణులకు వ్యతిరేకంగా సాగిన పోరాటం, భారత ప్రజానీకం సాగించిన పలు సమరశీల పోరాటాల వారసత్వం కొనసాగింపు నేపథ్యంలో భారతకమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) భారత కమ్యూనిస్టు ఉద్యమంలో బలమైన శక్తిగా ఆవిర్భవించింది. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో సాగిన సైద్ధాంతిక పోరాటాల్లో సిపిఐ(ఎం) అనుసరించిన వైఖరి సమంజసత్వాన్ని, వాస్తవికతను ఈ పరిణామాలు రుజువు చేశాయి.



మార్క్సిస్టు సిద్ధాంత రూపకర్తలు
మార్క్స్, ఏంగెల్స్

సైద్ధాంతిక వక్రీకరణలు, ఉల్లంఘనలకు వ్యతిరేకంగా మార్క్సిజం–లెనినిజం మౌలిక సూత్రాల విప్లవాత్మక స్వభావాన్ని కొనసాగించటానికీ, కార్మికవర్గ అంతర్జాతీయతను కొనసాగించటానికీ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆయా సందర్భాల్లో జాతీయ అంతర్జాతీయ వేదికల్లో నిరంతర పోరాటం సాగించింది. ఈ క్రమంలో కొన్ని కొన్ని సందర్భాల్లో ప్రపంచంలో రెండు అతి పెద్ద కమ్యూనిస్టు పార్టీలైన చైనా కమ్యూనిస్టు పార్టీ, రష్యా కమ్యూనిస్టు పార్టీలతో సైతం సైద్ధాంతికంగా విభేదించటానికికూడా సిపిఐ(ఎం) వెనుకంజ వేయలేదు. సిపిఐ(ఎం) సాగించిన నిరంతర సైద్ధాంతిక పోరాటం కేవలం వామపక్ష శక్తుల్లో పార్టీని అగ్రగామిగా నిలపటమే కాక జాతీయ రాజకీయాలపై తనదైన ప్రభావాన్ని కలగచేసేందుకు కూడా దోహదం చేశాయి. (కోజికోడ్‌లో జరిగిన 20వ మహాసభ ఆమోదించిన కొన్ని సైద్ధాంతిక సమస్యలపై తీర్మానం, 1.5 నుండి 1.8 పేరాలు)

అనేక ఇతర కారణాలతో పాటు దేశంలో వామపక్ష ఉద్యమం చీలికకు దారితీసిన కారణాల్లో జాతీయ విప్లవ దశ, స్వాతంత్ర్యానంతర పాలక వర్గాల స్వభావం, ప్రత్యామ్నాయ పాలక వర్గాల పొందికల గురించిన అంచనాల్లో స్వీయ మానసిక ధోరణితో కూడిన అంచనాలు ఒక

**“ వ్యూహాత్మక ఒప్పందంలో భాగంగా అణు ఇంధన ఒప్పందానికి భారత పాలక వర్గాలు, అమెరికా సామ్రాజ్యవాదం ఇస్తున్న ప్రాధాన్యత పార్టీ పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ తక్కువ అంచనా వేశాయి. పరిణామాలను ప్రభావితం చేయటంలో మన పార్టీ శక్తి సామర్థ్యాలను కూడా మనం ఎక్కువగా అంచనా వేసుకున్నాము. ”**

కారణం. సమకాలీన భారతదేశ నిర్దిష్ట పరిస్థితులతో నిమిత్తం లేకుండా కొన్ని అంచనాలకు రావటం జరిగింది. ఈ అంచనాల పట్ల వ్యక్తమైన విబేధాలే చివరకు భారత కమ్యూనిస్టు ఉద్యమంలో చీలికకు దారితీశాయి.

### రష్యా అనుభవాలు

రష్యా విప్లవ కాలంలో కూడా లెనిన్ ఇటువంటి పెడ ధోరణులను ఎదుర్కోవాల్సి వచ్చింది. కార్మికవర్గ ఉద్యమంలో వివిధ ధోరణు*లు వాటి బలాబలాలకు సంబంధించిన వస్తుగత* సమాచారం అన్న తన వ్యాసంలో ట్రాట్స్కీ, ప్లెఖనోవ్‌ల స్వీయమానసిక ధోరణితో కూడిన విశ్లేషణలను తిరస్కరిస్తూ లెనిన్, “ప్రతి దశలోనూ వాళ్లు తమ అభిప్రాయాలను, కోరికలను, పరిస్థితికి సంబంధించిన తమ అంచనాలను, తమ ప్రణాళికలను కార్మికుల అభిప్రాయంగా రుద్దబూనుకున్నారు. అవే కార్మికోద్యమ అవసరాలుగా నిరూపించబూనుకున్నారు.” (లెనిన్ సంకలిత రచనలు, సంపుటి 20, డిశంబరు 1913–ఆగస్టు 1914, పేజి 382)

నిజానికి లెనిన్ ప్రతిపాదించిన విప్లవ సాధనలో వివిధ దశలు అన్న సూత్రీరణే నిర్దిష్ట పరిస్థితిని నిర్దిష్టంగా విశ్లేషించే క్రమంలోవెలుగులోకి వచ్చిన సూత్రీకరణ. రష్యా విప్లవోద్యమంలో చోటుచేసుకుంటున్న పెడధోరణులను విమర్శిస్తూ రాసిన ఎత్తుగడలపై లేఖ అన్న వ్యాఖ్యానంలో లెనిన్ “ మనం స్వీయమానసిక ధోరణికి లోనయ్యే ప్రమాదం కనిపించటం లేదా? బూర్జువా ప్రజాతంత్ర విప్లవ దశను బైపాస్ చేసి సోషలిజాన్ని సాధించాలని కోరుకోవటం లేదా? బూర్జువాప్రజాతంత్ర విప్లవ దశ నేటికీ పరిపూర్తి కాలేదు. దేశంలో రైతాంగ ఉద్యమం పతాక స్థాయికి చేరలేదు.” అన్నారు. (సంకలిత రచనలు, సంపుటి 24, పేజి 48)

పైన ఉదహరించిన లెనిన్ విశ్లేషణను నిర్దిష్ట పరిస్థితిని నిర్దిష్టంగా విశ్లేషించే క్రమంలో మనం చేసిన ప్రయత్నాలకు వర్తింప చేసి చూసుకుందాం. స్వీయమానసిక ధోరణిపై పోరాటం నిరంతరం సాగే పోరాటం. కొన్ని కొన్ని సందర్భాల్లో వాస్తవిక పరిస్థితిని నిర్థిష్టంగా అంచనా వేయకుండా ముందుగా నిర్ధారించుకున్న సైద్ధాంతిక చట్రంలో బంధించటానికి మనం ప్రయత్నం చేశాము. ఈ ప్రయత్నం అపుడపుడు పొరపాటు నిర్ధారణలకు దారితీసింది.

### స్వీయ మానసికధోరణి : కొన్ని మన అనుభవాలు

అటువంటి పొరపాట్లకు సంబంధించి మన అనుభవాలు కూడా కొన్ని ఉన్నాయి. ముందుగా 2008లో అమెరికా భారత్ అణు ఇంధన ఒప్పందం నేపథ్యంలో యుపిఎ ప్రభుత్వానికి పార్టీ మద్దతు ఉపసంహారణ, 2009 పార్లమెంట్ ఎన్నికల్లో ప్రత్యామ్నాయ ప్రభుత్వ నినాదం ఇచ్చిన ఎన్నికల ఎత్తుగడల గురించి పరిశీలిద్దాం. ఏప్రిల్ 2012లో జరిగిన పార్టీ 20వ మహాసభ ఆమోదించిన రాజకీయ నిర్మాణ నివేదిక, 2009 పార్లమెంట్ ఎన్నికల అనంతరం జరిగిన కేంద్ర కమిటీ విశ్లేషణను సమర్థిస్తూ “ప్రభుత్వం అంతర్జాతీయ అణు ఇంధన సంస్థతో చర్చలకు వెళ్లిన 2007 అక్టోబరు– నవంబరులోనే ప్రభుత్వానికి మద్దతు ఉపసంహారించుకోవాల్సింది. అణు ఇంధన ఒప్పందాన్ని నిలువరించటానికి అవకాశం ఉన్న సమయం అదే. ఆ సమయంలో మద్దతు ఉపసంహారణ నిర్ణయం తీసుకోకపోవటం పొరపాటు. భారత్ అమెరికా అణు ఇంధన ఒప్పందం పట్ల ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌కు, కాంగ్రెస్ నాయకత్వానికి ఉన్న ప్రగాఢమైన ఆసక్తి, నిబద్ధత కారణంగా, అమెరికాతో వ్యూహాత్మక సంబంధాల పట్ల వారికున్న నిబద్ధత కారణంగా అణు ఇంధన ఒప్పందాన్ని సందిగ్ధంలో పడేయటానికి బదులు వామపక్షాలతో తెగతెంపులు చేసుకోవటానికే సిద్ధపడ్డారు. వ్యూహాత్మక ఒప్పందంలో భాగంగా అణు ఇంధన ఒప్పందానికి భారత పాలక వర్గాలు, అమెరికా సామ్రాజ్యవాదం ఇస్తున్న ప్రాధాన్యత పార్టీ పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ తక్కువ అంచనా వేశాయి. పరిణామాలను ప్రభావితం చేయటంలో మన పార్టీ శక్తి సామర్థ్యాలను కూడా మనం ఎక్కువగా అంచనా వేసుకున్నాము. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థతో చర్చలకు వెళ్లటానికి అంగీకరించటం, మనకిచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని కార్యరూపం దాల్చనీయకుండా ఉంటుందని నమ్మటం పొరపాటు.” (20వ మహాసభ రాజకీయ నిర్మాణ నివేదిక, ఏప్రిల్ 2012, కోజికోడ్)

అదేవిధంగా ఆ సమయంలో అనుసరించిన ఎన్నికల ఎత్తుగడలు, ఎన్నికల ఎత్తుగడల విధానం గురించి కూడా పార్టీ 20వ మహాసభ రాజకీయ నిర్మాణ నివేదిక, పార్టీ కేంద్ర కమిటీ సాగించిన ఎన్నికల సమీక్ష ఆధారంగా “ సమీక్ష రెండు ముఖ్య కారణాలు గుర్తించింది. మొదటిది, మూడు నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెసేతర లౌకిక పార్టీలతో కుదుర్చుకున్న పొత్తుల ఆధారంగా జాతీయ స్థాయిలో ఎన్నికల ప్రత్యామ్నాయం సాధించటానికి ప్రాతిపదిక అవుతుందని ఆశించటం తప్పు. రెండోది, ప్రత్యామ్నాయలౌకిక ప్రభుత్వం ఏర్పాటుకు పిలుపునిచ్చి ఉండాల్సింది కాదు. దానికి బదులుగా కాంగ్రెసేతర, బిజెపియేతర లౌకిక ప్రత్యామ్నాయాన్ని బలపర్చండి అన్న పిలుపు వరకు పరిమితి అయి ఉండాల్సింది.” ( 20వ మహాసభ రాజకీయ నిర్మాణ నివేదిక, ఏప్రిల్ 2012, కోజికోడ్)

మరో ఉదాహరణ కూడా పరిశీలిద్దాం. పశ్చిమబెంగాల్‌లో సింగూర్‌లో మోటార్ కార్ ప్రాజెక్టుకు భూములు సేకరించే విషయంలో, నందిగ్రామ్‌లో రసాయనిక పరిశ్రమల నిమిత్తం భూములు సేకరించే విషయంలోనూ జరిగిన పొరపాట్లను పార్టీ మహాసభ, కేంద్ర కమిటీలు ఆత్మవిమర్శనా పూర్వకంగా అంగీకరించాయి. పశ్చిమబెంగాల్‌లో జరిగిన భూసేకరణల్లో ఇవే మొదటివి కాదు. ఇవే ఆఖరికి కూడా కాదు. సిపిఐ(ఎం), వామపక్షాలు సాధారణంగా నిర్వహించే కసరత్తు పూర్తి చేసి, సేకరించాల్సిన భూమికి సంబంధించిన యజమానులందరితోనూ సంప్రదించి, వారితో నష్టపరిహారానికి సంబంధించిన విషయాలన్నీ సంబంధిత కుటుంబాలతో ఖరారు చేసుకున్న తర్వాత పునరావాస పథకానికి ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల ఆమోదం పొందిన తర్వాత భూ సేకరణ జరుపుతాయి. కానీ ఈ రెండు సందర్భాల్లోనూ ఈ పద్ధతులను పాటించలేదు. ఇలా జరగటానికి ఒక కారణం 2006లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో 294 శాసనసభా స్థానాలకు గాను

235 స్థానాలును వామపక్షాలు గెల్చుకున్నాయి. ఆ ఎన్నికల్లో వామపక్షాలకు 50.18 శాతం ఓట్లు వచ్చాయి. పశ్చిమ బెంగాల్ పారిశ్రామికీకరణ కీలకమైన ఏజెండాగా 2006 అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అటువంటి హెూరా హెూరీ ఎన్నికలో పోరాటంలో స్పష్టమైన విజయం సాధించిన వామపక్షాలు తాము చేపట్టే పారిశ్రామికీకరణ పథకాలకు ప్రజలు సంపూర్ణ మద్దతు ఉందని అభిప్రాయపడ్డాయి. దాంతో సింగూర్ ప్రాజెక్టు కోసం భూములు సేకరించాల్సి వచ్చినపుడు వాపమక్షాలు సాధారణంగా తీసుకునే జాగ్రత్తలు కూడా పాటించలేదు. కానీ లెనిన్ చెప్పిన విధంగా మనం నాణేనికి ఒకవైపే చూశాము. మరోవైపున 2004 పార్లమెంట్ ఎన్నికల్లోసిపిఐ(ఎం)కు ఓట్లు 38.57 శాతం వస్తే 2006 శాసనసభ ఎన్ని కల్లో 37.13 శాతానికి పడిపోయింది. సీట్ల రూపంలో చూసుకున్నపుడు వామపక్షాలకు నాలుగింట మూడు శాతం సీట్లు దక్కినప్పటికీ ఓట్లశాతంలో చూసుకున్నపుడు కొద్దిగా తగ్గు ముఖం పట్టాయి. ఈ విషయాన్ని సమగ్రంగా అవగాహన చేసుకుని ఉంటే సింగూర్ వంటి ప్రాజెక్టులు ప్రారంభించేటప్పుడు తగిన రీతిలో కసరత్తు చేసి ఉండేవాళ్లం. కానీ దురదృష్టవ శాత్తూ ఈ విషయాన్ని గమనించటంలో విఫలమ య్యాము. వాస్తవాన్ని సంపూర్ణంగా పరిశీలించక పోవటంతో పాటు ప్రజలనుండి వేరుపడటం కూడా నేటి పరిణామాలకు మరో కారణం.

ఇతర కారణలతో పాటు జాతీయ స్థాయి లోనూ, ప్రాంతీయ స్థాయిలోనూ జరిగిన పరిణామాలు సిపిఐ(ఎం) మరియు వామపక్ష సంఘటన ఒంటరిపాటు కావటానికి దారి తీశాయి. తదనంతర కాలంలో ప్రతిపక్షాలన్నీ తమ రాజకీయాలు వదిలి సిపిఐ(ఎం), వామపక్షాలకు వ్యతిరేకంగా కూటమి కట్టాయి. ఈ కూటమిలో మతోన్మాద శక్తుల మొదలు నక్సలైట్ల వరకు నానాజాతికి చెందినవారూ ఉన్నారు. వీటికితోడు ఈ కూటమి హింసాత్మక రాజకీయాలకు పాల్పడింది. దాంతో 2009లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ, అనంతరం 2011లో జరిగిన శాసనసభ ఎన్నికల్లోనూ పార్టీ ఘోర పరాజయం పాలైంది. 2006లో వామపక్షాలకు, మిగిలిన అన్ని ప్రతిపక్షాలకు మధ్య దాదాపు సమానంగా ఉన్న ఓట్లు 2011 నాటికి కూడా కొనసాగినప్పటికీ ప్రాతినిధ్య ప్రజాస్వామ్య ఎన్నికల వ్యవస్థలో తక్కువ సీట్లకు పరిమితంఅయ్యింది.

ఈ విధంగా పార్టీ ఆత్మ విమర్శనా పూర్వకంగా అంగీకరించిన విధంగా భూ సమస్య పట్ల అనుసరించిన పొరపాటు వైఖరితో పాటు వాస్తవాన్ని ఒక వైపు నుండే చూడటానికి పరిమితం కావటం, తదనుగుణంగా జరిగిన పొరపాటు నిర్ధారణలు,పద్ధతులు కూడా పార్టీ ప్రస్తుత పరిస్థితికి దోహదం చేశాయి.

“ఈ విధంగా పార్టీ ఆత్మ విమర్శనా పూర్వకంగా అంగీకరించిన విధంగా భూ సమస్య పట్ల అనుసరించిన పొరపాటు వైఖరితో పాటు వాస్తవాన్ని ఒక వైపు నుండే చూడటానికి పరిమితం కావటం, తదనుగుణంగా జరిగిన పొరపాటు నిర్ధారణలు,పద్ధతులు కూడా పార్టీ ప్రస్తుత పరిస్థితికి దోహదం చేశాయి.”



మార్క్సిజం-లెనినిజాన్ని భారతదేశానికి వర్తింపజేసిన సిపిఐ(ఎం)మొదటి పొలిట్‌బ్యూరో సభ్యులు

ముందస్తు నిర్ధారణలు, ధృఢ అభిప్రాయాలతో వాస్తవాలను చూడటానికి బదులుగా నిర్దిష్ట వాస్తవికత ఆధారంగా పరిస్థితులను వస్తుగత పద్ధతుల్లో అంచనా వేయటం ప్రస్తుతం పార్టీ ముందున్న కర్తవ్యాలను నెరవేర్చేరీతిలో పార్టీ నిర్మాణ సామర్థ్యాన్ని పెంపొందించటానికి ఉపయోగపడతాయి.

**చైనా కమ్యూనిస్టు పార్టీ అనుభవాలు**

పరిస్థితులు, సందర్భంతో పొసగక పోయినా చైనా విప్లవోద్యమ అనుభవాలు కొన్ని మనకు అవసరమైన గుణపాఠాలు నేర్చుకోవటానికి ఉపయోగపడతాయి. పీపుల్స్ ప్రచురణాలయం సంపాదకవర్గం మావో సంకలిత రచనలు ప్రచురించే క్రమంలో ఆచరణపై అన్న మావో లేఖను ప్రచురిస్తూ ఈ విధంగా వ్యాఖ్యానించారు :

“పార్టీలో చాలామంది పిడివాదులు ఉన్నారు. చైనా విప్లవోద్యమ అనుభవాలను తిరస్కరించిన వారూ ఉన్నారు. మార్క్సిజం పిడివాదం కాదు. ఆచరణకు మార్గదర్శి అన్న సూత్రాన్ని నిరాకరించి వారూ ఉన్నారు. సందర్భరహితంగా మార్క్స్ రచనల నుండి పుంఖాను పుంఖాలు వల్లిస్తూ శ్రోతల చేతో నోళ్లు ఔరా ఏమి పాండిత్యం అనిపించుకున్న వారూ ఉన్నారు. మరోవైపున పార్టీలో ఆచరణాత్మక వాదులూ ఉన్నారు. దీర్ఘకాలంపాటు తాము సాధించిన పాక్షికమైన అనుభవాలకే పరిమిత మైన వారు, విప్లవ కార్యాచరణకు సిద్ధాంతం అవసరాన్ని గుర్తించనివారు, విప్లవాన్ని ఒక సమగ్రమైన పరిణామంగా చూడని వారూ, గుడ్డిగా కఠోర శ్రమ చేసిన వారూ ఉన్నారు. ఈ రెండు రకాల కామ్రేడ్స్‌కు కలిగిన తప్పుడు అవగాహన, ప్రత్యేకించి పిడివాదుల తప్పుడు అవగాహన వల్ల 1931-34 మధ్య కాలంలో చైనా విప్లవోద్యమం పెద్దఎత్తున నష్టపోయింది. అయినా పిడివాదులు పడికట్టు మార్క్సిస్టు

> **"పార్టీ ఇచ్చిన బాధ్యతలు నెరవేర్చే క్రమంలో కార్యకర్తలు కొన్ని పొరపాట్లు చేస్తారు. పొరపాట్లు చేయటం పొర పాటు కాదు. కానీ పొరపాట్ల నుండి నేర్చుకోక పోవటం పొరపాటు. సదరు పొరపాట్లు ఎందుకు జరిగాయి అన్నది అర్థం చేసుకోక పోవటం పొరపాటు."**

పదజాలం మాటున కామ్రేడ్స్‌ను గందరగోళ పరుస్తూనే ఉన్నారు. పార్టీలో కొనసాగుతున్న పిడివాదం, ఆచరణాత్మకవాదాల స్వీయమానసిక ధోరణి గురించి తేటతెల్లం చేయటానికి చేసిన రచనే 'ఆచరణ గురించి'. ప్రత్యేకించి మార్క్సిస్టు విజ్ఞానం కోణం నుండి పిడివాద ధోరణిలో ఉన్న తప్పులను ఎత్తి చూపటానికే ఈ రచన ఉద్దేశించబడింది. దీనికి ఆచరణ గురించి అన్న శీర్షికను నిర్ణయించారు. ఎందుకంటే ఈ రచన పిడివాదం ముసుగులో ఉన్న స్వీయమానసిక ధోరణి గుట్టు బయట పెడుతుంది. ఈ పిడివాద ధోరణి ఆచరణకు అవరోధంగా మారింది. యేనాన్‌లో జరిగిన జపాన్ వ్యతిరేక సైనిక రాజకీయ పాఠశాలలో మావో ఈ ఉపన్యాసం ఇచ్చారు." అని ప్రస్తావించింది.

ఈ ఉపన్యాసంలో పార్టీ కార్యకర్తలు స్వీయమానసిక ధోరణి బారిన పడకుండా ఎలా తమను తాము కాపాడుకోవాలో చెప్పారు. "ఒకరు తమకు కేటాయించిన పనిలో విజయం సాధించాలంటే, ఆశించిన ఫలితాలు సాధించాలంటే, తన ఆలోచనలను భౌతిక వాస్తవాలను నియంత్రిస్తున్న సూత్రాలతో భేటి వేయించాలి. ఈ ఆలోచనలు, ప్రాపంచిక వాస్తవం మధ్య పొంతన కుదరకపోతే ఆచరణలో ఆ వ్యక్తి పరాజయం పాలవుతాడు. ఒకసారి పరాజయం పాలైన తర్వాత గుణపాఠాలు నేర్చుకుంటాడు. తన ఆలోచనలను మార్చుకుంటాడు. ప్రాపంచిక వాస్తవాలకు తగ్గట్టుగా మార్చుకుంటాడు. తద్వారా వైఫల్యాన్ని విజయంగా మార్చుకుంటాడు. ఈ అర్థంలోనే 'వైఫల్యం విజయానికి తల్లివంటిది' అన్న సూక్తిని అర్థం చేసుకోవాలి. అదేవిధంగా పడ్డవాడు ఎప్పుడూ చెడ్డవాడు కాదు అన్న సూక్తిని కూడా ఈ విధంగానే అర్థం చేసుకోవాలి." అన్నారు మావో. (మావో సేటుంగ్, సంకలిత రచనలు, సంపుటం 1, పేజీలు 296-297)

ఇక్కడ మావో మరో ముఖ్యమైన విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. పార్టీ ఇచ్చిన బాధ్యతలు నెరవేర్చే క్రమంలో కార్యకర్తలు కొన్ని పొరపాట్లు చేస్తారు. పొరపాట్లు చేయటం పొర పాటు కాదు. కానీ పొరపాట్ల నుండి నేర్చుకోక పోవటం పొరపాటు. సదరు పొరపాట్లు ఎందుకు జరిగాయి అన్నది అర్థం చేసుకోక పోవటం పొరపాటు. తద్వారా మరో సారి పొరపాటు జరక్కుండా జాగ్రత్త పడకపోవటం పొరపాటు. చివరిగా పొరపాట్లను సరిచేసుకోక పోవటం, తప్పుడు అవగాహనతో ముందు కెళ్లటం పొరపాటు. అందుకే స్టాలిన్ అసలు పని చేయకుండా ఉన్న వాళ్లే పొరపాట్లు చేయరు అని వ్యాఖ్యానించారు. తమ కర్తవ్యనిర్వ హణలో కమ్యూనిస్టులు పొరపాట్లు చేస్తారు. కానీ వాటిని గుర్తించి సరి చేసుకుని మళ్లీపునరా వృతం కాకుండా చూడటమే ముఖ్యమైనది.

ఈ వివరణ ఒక విషయాన్ని స్పష్టం చేస్తుంది. పార్టీ కార్యకర్తలు పార్టీ కేటాయించిన పని చేయటానికి సంపూర్ణంగా సిద్ధపడాలి. అదే సందర్భంలో మావో, "ఈ కర్తవ్యాన్ని నెరవేర్చగలనన్న నమ్మకం నాకు కలగటం లేదు అనటం వింటుంటాము. పార్టీ ఇచ్చిన కర్తవ్యాన్ని స్వీకరించటానికి తటపటాయించే వారి నుండి ఇటువంటి మాటలు వింటాము. తనగురించి తనకు ఎందుకు స్పష్టత లేదు? ఎందుకంటే ఏ పరిస్థితుల్లో ఎటువంటి బాధ్యత తనకు అప్పగిస్తున్నారో అన్న విషయం పట్ల ఆయనకు స్పష్టత లేదు. అటువంటి పని గురించి ఆయనకు ఏ మాత్రం పరిచయంలేదు. అందువల్ల ఆయా పనికి సంబంధించిన విధి విధానాలు, సూత్రాలు తన పరిధిలో లేవని భావిస్తాడు. ఒకసారి ఇచ్చిన పనిని, సదరు పని ఇచ్చిన సందర్భాన్ని సంపూర్ణంగా విశ్లేషించుకున్న తర్వాత తనపట్ల తనకునమ్మకం కలుగుతుంది. పార్టీ ఇచ్చిన పనిని పూర్తి చేయటానికి సిద్ధపడతాడు. ఒకసారి పని ప్రారంభించి కొంత సమయం ఆ పనికోసం వెచ్చించి ఈ క్రమంలో కొన్ని కొత్త విషయాలు నేర్చుకున్నతర్వాత, సదరు కార్యకర్త తన ముందున్న విషయాలను ఎటువంటి పరిమితులు, ముందస్తు అభిప్రాయలు లేకుండా చూడగలుగుతాడో అటువంటి వాళ్లే ఇచ్చిన పనిని ధైర్యంగా ముందుకు తీసుకెళ్ల గలుగుతారు. ఎవరైతే స్వీయమానసిక ధోరణికి లోనవుతారో, పాక్షిక పరిశీలనకే పరిమితం అవుతారో, సమస్య లోతుల్లోకి వెళ్లకుండా పైపై విషయాలకేపరిమితమౌతారో, సదరు ప్రదేశానికి వచ్చిన వెంటనే వాస్తవికత ఏమిటి అన్నది పరిశీలించకుండా ఆదేశాలు ఇవ్వటానికి అలవాటు పడతారో, సారాంశం గ్రహించకుండా ఆదేశాలు ఇస్తారో అటువంటి వ్యక్తులు అనివార్యంగా విఫలమవుతారు." ( మావో సంకలిత రచనలు, సంపుటి 1, పేజి 302)

వీటన్నింటి నుండీ ఒక విషయం స్పష్టమవుతోంది. నిర్దిష్ట పరిస్థితిని నిర్దిష్టంగా అధ్యయనం చేయటం అనేది అనివార్యంగా ఆయా కార్యకర్తల శక్తి సామర్థ్యాలపైనా ఆధారపడి ఉంటుంది. అదేవిధంగా కార్యకర్తలు పార్టీ రాజకీయ శిక్షణా కార్యక్రమాల్లో ఇచ్చే విజ్ఞానంతో పాటు నిరంతరం తమ స్వతంత్ర అధ్యయనాన్ని కొనసాగించటంపై ఆధారపడి ఉంటుంది. ఇది కార్యకర్తలు జీవితాంతం అనుసరించాల్సిన పని. ఇది లేకుండా అప్పగించిన పనులను జయప్రదంగా పూర్తి చేయటం సాధ్యం కాదు.

### ప్రజల నుండి నేర్చుకుందాం

లీ షావ్ చి పార్టీ రాజ్యాంగాన్ని తాజాపర్చటంపై ఇచ్చిన నివేదికను 'పార్టీ గురించి' అన్న శీర్షికన చిన్న పుస్తకంగా ప్రచురించారు. ఈ చిన్న పుస్తకంలో ఆయన " ప్రజలు తమ చరిత్రను తామే నిర్మించుకుంటారు. ప్రజల విముక్తి వారి చైతన్య యుతమైన అంగీకారంతోనే జరుగుతుంది. తమ నాయకులను తామే ఎన్నుకుంటారు. వారే ఎంపిక చేసుకున్న నాయకత్వం కింద సమీకృతులవుతారు. తమ విముక్తికై పోరాడుతారు. తమ పోరాట ఫలితాలు సాధించి భద్రపర్చుకోవటానికి ఇదొక్కటే మార్గం. ప్రజల శత్రువులను ప్రజలే కూలదోయాలి. మరో మార్గంలో దీన్ని సాధించటానికి అవకాశం లేదు. ప్రజల న్యాయమైన చైతన్యవంతమైన సమీకరణ లేకుండా కేవలం నాయకత్వం మాత్రమే పోరాడి ప్రజలను విముక్తి చేయజాలదు. లేదా మరో పురోగతి సాధించటమో, మరో లక్ష్యాన్ని నెరవేర్చుకోవటమో చేయజాలదు. చివరికి ప్రజల తక్షణ డిమాండ్లయిన కౌలు తగ్గింపు, వడ్డీ తగ్గింపు, బదుళ్లకు శ్రమ చేసే బృందాలను ఏర్పాటు చేసుకోవటం, సహకార సంస్థలను ఏర్పాటు చేసుకోవటం, ఉత్పత్తి

రాయితీలే. మేడిపండు వంటి రాయితీలు. ఇటువంటి తక్షణ ఫలితాలుసాధించే ప్రయత్నమైనా నాయకత్వం ప్రజల తరపున పని చేయకుండా ప్రజల ద్వారానే ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యం ద్వారానే చేయించాలి.” అన్నారు.

కమ్యూనిస్టుల లక్ష్యం ప్రజల లక్ష్యమే. మన కార్యక్రమం, విధానాలు ఎంత ఖచ్చితమైన వైనా కావచ్చు. ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యం, మద్దతు నిరంతర పోరాటం లేకుండా ఆచరణకు నోచుకోవు. మనకు సంబంధించి నంత వరకు ప్రతిదీ ప్రజల చైతన్యవంతమైన అంగీకారంతో ముడిపడి ఉన్నదే. ప్రజల చైతన్యవంతమైన అంగీకారం, భాగస్వామ్యమే మిగిలిన వాటిని నిర్ధారిస్తుంది. నిర్ణయిస్తుంది. అది లేకుండా మనం సాధించగలిగేది ఏమీ లేదు. మన ప్రయత్నాలన్నీ వృధా అవుతాయి. రాజకీయంగా చైతన్యవంతులయి, కార్యోన్ముఖు లవుతున్న ప్రజలపై మనం ఆధారపడటం, వారి వాస్తవిక చైతన్యం, సమీకరణ, పార్టీ యొక్క ఖచ్చితమైన నాయకత్వ పాత్రతోనే మనం అన్ని విధాలా అంతిమ విజయం సాధించగలుగు తాము. పార్టీని లక్ష్యాన్ని చేరుకోగలుగుతాము. అందువల్ల ప్రజల సంపూర్ణంగా చైతన్యవంతులు కానంతవరకు వారికి నాయకత్వం వహించాల్సిన కమ్యూనిస్టు పార్టీ పాత్ర ఏమిటంటే తగినంతగా అవసరమైన స్థితికి ప్రజల చైతన్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయటమే. అందుకవసరమైన పద్ధతులు అనుసరించటమే. మనపనిలో ఇది మొదటి మెట్టు. ఎంత సమయం పట్టినా, ఎంత కష్టమైనా ఈ మొదటి మెట్టును పకడ్బందీగా నిర్మించాలి. ఈ మొదటి మెట్టు నిర్మించిన తర్వాతనే రెండో మెట్టు నిర్మాణం ప్రారంభించాలి. ( లి షావోచి ఏరిన రచనలు, సంపుటి 1, పేజి 347)

“ఒకవేళ ప్రజల నుండి నేర్చుకోవటానికి బదులుగా మనం తెలివిగా వ్యవహరించి ప్రజలను చైతన్యవంతులను చేయటానికి మన ఆలోచనలకు తగ్గట్లుగానో లేదా చారిత్రక అనుభవాల ఆధారంగానో, విదేశీ అనుభవాల ఆధారంగానో కొన్ని పథకాలు, వ్యూహాలు రచించి ప్రయత్నం చేస్తే మనం విఫలం కాక తప్పదు. ప్రజల నుండి నేర్చుకునే క్రమాన్ని నిరంతరం కొనసాగించటానికి గాను మనం నిమిషమాత్రమైనా ప్రజల నుండి వేరుపడ కూడదు. ఒకసారి ప్రజల నుండి మనం వేరుపడితే మన పరిజ్ఞానం నామమాత్రమై పోతుంది. మనం తెలివిలేని వారం అవుతాం. సరైన సమాచారం లేని వారం అవుతాము.

> **“ ఒకసారి ప్రజల నుండి మనం వేరుపడితే మన పరిజ్ఞానం నామమాత్రమై పోతుంది. మనం తెలివిలేని వారం అవుతాం. సరైన సమాచారం లేని వారం అవుతాము. ప్రజలకు నాయకత్వం వహించలేని వారమవు తాము.”**

ప్రజలకు నాయకత్వం వహించలేని వారమవు తాము.” ( లి షావ్‌చి ఏరిన రచనలు, సంపుటి 1, పేజి 349)

**ఆచరణను సరిదిద్దుకుందాం**

నిర్మాణపరమైన నిర్ణయాలు తీసుకోవటంలో స్వీయమానసిక ధోరణి అనేకరకాలుగా ప్రభావం చూపుతుంది. కార్యకర్తల శక్తి సామర్ధ్యాలు, బలహీనతలు పట్ల తప్పుడు అంచనాలు కలిగి ఉంటే అటువంటి వాళ్లకు పని కేటాయించేటపుడు పొరపాట్లు జరిగేందుకు అవకాశం ఉంటుంది. అటువంటి అంచనాలు లేకపోతే స్వీయ మానసిక ధోరణితో కూడిన అభిప్రాయాలు కార్యకర్తల పట్ల విచక్షణతో కూడిన ఇష్టాయిష్టాలకు దారితీస్తాయి. అటువంటి విచక్షణ పూరితమైన అభిప్రాయాలు కార్యకర్తలను అంచనా వేసేటపుడు పార్టీ నిర్మాణానికి విఘాతం కూడా కలిగించే దశకు చేరతాయి. ఒకానొక సందర్భంలో “మంచి నిర్మాణదక్షుని లక్షణమేమిటంటే సరైన కార్య కర్తకు సరైన పని అప్పగించటం” అని స్టాలిన్ వ్యాఖ్యానించటాన్ని మనం గుర్తు చేసుకోవాలి. స్వీయమానసిక ధోరణి ఈ దక్షతకు ఆటంకం కలిగిస్తుంది. పార్టీ నిర్మాణానికి ఎనలేని లోటు తెస్తుంది.

పార్టీ నాయకులకు ఒకరంటే ఇష్టం ఉండటం మరొకరంటే అయిష్టత ఉండటం వంటి పరిణామాలు అనివార్యంగా స్వామిభక్తికి, నాయకత్వం మెప్పు పొందేందుకు కార్యకర్తలు పని చేసే లక్షణాలకు దారితీస్తాయి. ఈ ధోరణి దిగువ స్థాయి నుండి నివేదికలు ఇచ్చేటప్పుడు వాస్తవిక పరిస్థితిని వివరించటానికి బదులుగా నాయకత్వం వినదల్చుకున్న విషయాలను మాత్రమే చెప్పే సాంప్రదాయానికి దారితీస్తుంది.

గత దశాబ్దకాలంలో మన పార్టీ పోగేసుకున్న అనుభవాల నుండే చూసుకుందాం. దిగువ స్థాయినుండి నాయకత్వం కోరుకున్న పద్ధతుల్లో వచ్చిన నివేదికలు మన శక్తిసామర్ధ్యాలను మనం అతిగా అంచనా వేసుకోవటానికి దారితీసిన అనుభవం మనకుంది. చివరకు ఎన్నికల ఫలితాలకు సంబంధించి కేరళ, బెంగాల్ కమిటీలు ఇచ్చిన నివేదికల్లో కూడా ఇది ప్రతిఫలిస్తోంది. పోలింగ్ పూర్తి అయ్యాక కూడా మన బూత్ కమిటీలు పంపిన నివేదికల ఆధారంగా ఎన్నికల్లో మన జయాపజయాల గురించిన అంచనాను రాష్ట్ర కమిటీలు పార్టీ కేంద్రానికి తెలియచేశాయి. కానీ అసలు ఫలితాలు మన అంచనాలకు అందనంత దూరంగా ఉన్నాయి. దీనికి రెండు కారణాలు ఉండవచ్చు. మొదటి స్వీయమానసిక ధోరణితో కూడిన అతి అంచనాలు ఒక కారణం కావచ్చు. కాగా నాయకత్వం మెచ్చేట్లుగా చెప్పటమే లక్ష్యంగా దిగువ కమిటీలు ఇచ్చిన వాస్తవ విరుద్ధమైన నివేదికలు రెండో కారణం కావచ్చు. ఈ రెండో కారణం మరింత ప్రమాదకరమైనది. మన అంచనాలు దిగువకమిటీల నుండి వచ్చిన స్వీయమానసిక ధోరణితో కూడిన అంచనాలు ఆధారంగా ఏర్పరుచుకున్నవన్నది స్పష్టం. అదేసమయంలో దిగువ కమిటీలు,కార్యకర్తలకు ప్రజలకు సంబంధాలు బలహీనపడ్డాయన్న విషయాన్ని మనం వారిచ్చిన అంచనాలను పరిశీలించేటపుడు గమనంలోకి తీసుకోలేదు. ఇటువంటి పొరపాటు అంచనాలు రావటం కూడా పార్టీ శ్రేణులకు ప్రజలకు మధ్య ఉన్న అంతరాన్ని, దూరాన్ని తెలియచేసే అంశాల్లో ఒకటి. దిగువ నుండి వచ్చిన నివేదికలు మన

(మిగతా 32వ పేజీలో)



రష్యా, చైనాలలో విప్లవాలను జయప్రదం చేసిన లెనిన్, మావో

# పెట్టుబడిదారీ విలువలు

ఎస్. వీరయ్య



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు

"విలువలు దిగజారుతున్నాయండీ" ఇది నిత్యం వినబడుతున్న మాటే. ఎందుకు దిగజారుతున్నాయన్నదే అసలు ప్రశ్న. అందరూ గౌరవించే విలువలే ఆచరణలో అమలు కావు. ఎందువల్ల? ఇందుకు మూలాలు వెతకకుండా పరిష్కారం చూడకుండా ఆవేదన చెందడం వల్ల ప్రయోజనం లేదు. ప్రజలు ఆవేదన చెందుతుంటారు. పార్టీ కార్యకర్తలు వాటికి పరిష్కారం చూపాలి. ప్రజలను కదిలించాలి.

అబద్ధం ఆడరాదు. పరుల సొమ్ముఆశించరాదు. దొంగతనం చేయరాదు. అందరూ బాగుండాలి. పెద్దలను గౌరవించాలి. స్త్రీలను గౌరవించాలి.ఇవన్నీ విలువలే. ఇలాంటివే చాలా ఉన్నాయి. కానీ ఆచరణ భిన్నంగా ఉన్నది.

జీవిత చరమాంకంలో ఉన్న తల్లిదండ్రుల బాధ్యత ఎవరిది? కన్న బిడ్డలదే అంటుంది సమాజం. కొడుకులు కూడా అదే నమ్మారు చాలాకాలం. ఉమ్మడి కుటుంబాల్లో ఇది నడిచింది. కాలక్రమంలో సమాజం అభివృద్ధి చెందింది. శరీరంలో శక్తి ఉన్నంతకాలం సమాజం కోసం సేవలు అందించిన పౌరుల బాధ్యతను ఆ తరువాత ప్రభుత్వమే తీసుకోవాలన్న సూత్రం వచ్చింది. ఉద్యోగుల వరకు ఇది పెన్షన్ రూపంలో అమలైంది. మంచిదే. సమాజంలో కొంతమందికైనా గ్యారెంటీ ఏర్పడింది. మరి వ్యవసాయదారులు, వృత్తిదారుల బాధ్యత ఎవరు చూడాలి? ప్రైవేటు రంగంలో కార్మికుల బాధ్యత ఎవరు చూడాలి? దీనికి సమాధానం వెతక్కుండానే "అభివృద్ధి" మరో అడుగు ముందుకేసింది. సమాజాభివృద్ధికి పొదుపు చర్యలు అవసరమని ప్రపంచ బ్యాంకు చెప్పింది. అనుత్పాదక ఖర్చును విడనాడాలన్నది. బ్యాంకు దృష్టిలో అది దుబారా. ప్రభుత్వాలు పాటించడం మొదలుపెట్టాయి. ఉద్యోగం ఉండగానే పెన్షన్ కొనుక్కోవాలంటున్నాయి. బాధ్యత కన్నబిడ్డలదీ కాదు, ప్రభుత్వానిదీ కాదు. ఎందుకంటే కాటికి కాలుచాచిన వృద్ధుల మీద ఖర్చు అనుత్పాదకం. వృధా ఖర్చు. వీరు సామాజిక ఉత్పత్తిలో భాగస్వాములు కాలేరు. పైగా వయసుడిగి, ఆరోగ్యాలు దెబ్బతిని ఖర్చులు మాత్రం పెరుగుతాయి. ఈ ఖర్చు ప్రభుత్వానికి భారమట. వృద్ధుల మీద పెట్టే ఖర్చు వృధా అని ప్రపంచ బ్యాంకు, ప్రభుత్వాలు చెప్పిన తరువాత కన్నబిడ్డలు మాత్రం అంతకన్నా భిన్నంగా ఆలోచిస్తారా? వారూ భారమనే అంటున్నారు. "విద్య, వైద్యం వ్యాపారమయమైనాయి. ఆదాయంలో సగానికి మించి వీటికే ఖర్చు చేయవలసి వస్తున్నది. ఎక్కువ భాగం గృహవసతికే పోతున్నది. మిగిలిన దాంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాము. ఈ ఖర్చులే భరించలేకపోతున్నాము.ఇంకా ఈ ముసలివారికి ఎక్కడినుంచి తెచ్చి పెట్టాలి?" ఇది వారసుల వాదన. తన బాధ్యత లేదని చేతులు దులుపుకున్న ప్రభుత్వం తల్లిదండ్రులని చూసుకోవలసిన బాధ్యత పిల్లలదే అని చట్టం చేస్తానని వృద్ధులకు భరోసా ఇస్తున్నది. చేతిలో డబ్బే లేనప్పుడు పిల్లలు ఏం చేయగలరు? అనే ప్రశ్నకు ప్రభుత్వం దగ్గర సమాధానం లేదు. విద్యా వైద్య రంగాలు వ్యాపారమయం కావడానికి పాలకుల విధానాలే కారణం కదా! ఒక తరం మాత్రం సతమతమవుతున్నది. నువ్వంటే నువ్వు చూసుకోవాలని పోటీ పడుతున్న పిల్లలు, దేశానికి భారమంటున్న పాలకుల మధ్య చావలేక బతుకుతున్నదీ తరం. ఏ విలువల ప్రకారం జరుగుతన్నది ఇది?

ఎంత సంపాదిస్తేనేం? పదిమందిలో మాట నిలబడాలి. గౌరవం మిగలాలి. ఆస్తిపాస్తులు పోయేటప్పుడు మూటకట్టుకు పోతామా? ఇది నిన్నటి మాట. సంపాదించు, అనుభవించు, ఆనందించు. ఇది నేటి మాట. ఆధునిక మాట. "అభివృద్ధి" ఫలితం. ఎట్లా సంపాదించావన్నది కాదు, ఎంత సంపాదించావన్నదే ముఖ్యం. విలువలు కాదు.... విలువైన వస్తువులను ఉపయోగిస్తున్నావా లేదా అన్నదే ముఖ్యం. అందరూ బాగుండాలి. ఇది తాతలనాటి మాట. నేను బాగుండాలి ఇదే నేటి మాట. సమిష్టి ప్రయోజనం స్థానంలో వ్యక్తిగత ప్రయోజనం చేరింది. అమ్మా నాన్న, అత్త మామ, కుటుంబం, భార్య భర్త, పిల్లలు, బంధువులు ఇవన్నీ అంతరిస్తున్న సంబంధాలు. కుటుంబం, జాతి, దేశం ఇవన్నీ నిన్నటి భావాలు. "నేనే" నేటి మాట. ఎవరి బాగు వారు చూసుకుంటే దేశమంతా బాగుపడుతుంది. ఇదీ సిద్ధాంతం. డబ్బు దాచుకో, అవసరాలకు పనికొస్తుంది. నిన్నటి తరం సూచన ఇది. సంపాదించు... ఖర్చుపెట్టు....మళ్ళీ సంపాదించు...మళ్ళీ మళ్ళీ ఇదే తంతు. మార్కెట్ చురుకుగా నడవాలి కదా. సరుకులు అమ్ముడు పోతూ ఉండాలి కదా. లాభం రావాలి కదా. ఇదే ఈనాటి నీతి. ఆధునిక విలువ. పిల్లల కోసం దాచకపోతే ఎట్లా? ఎందుకు? అమెరికా చూడండి. 10వ తరగతి పాసవగానే పక్షుల్లా ఎగిరిపోతారు పిల్లలు. తల్లిదండ్రులతో ఇంకేమాత్రం ఉండరు. ఎవరి బతుకు వారిదే. నిజమే. తల్లిదండ్రులు కొంతకాలానికి విడిపోతారు. ఇద్దరూ మళ్ళీ పెళ్ళిళ్ళు చేసుకుంటారు. భర్త చనిపోయినప్పుడు ఎక్కడో ఉన్న కొడుకు, నీ భర్త చనిపోయినందుకు విచారిస్తున్నానని సెల్‌ఫోన్‌లో మెసేజ్ చేస్తాడు. ఇది ఆధునిక నీతి. అభివృద్ధి. అవును. తండ్రి చనిపోయినా రాలేదు. ఆయన ఇప్పుడు సాఫ్ట్‌వేర్ బందీ. వస్తే యాజమాన్యం అప్పగించిన ప్రాజెక్టు వర్క్ ఆగిపోతుంది. వారి లాభం తగ్గిపోతుంది. లాభం ముందు మానవీయ విలువలకు విలువ లేదు. ఇదీ నేటి విలువ.

పిల్లలను కాన్వెంట్ స్కూల్‌లో చేర్పించాలి. తల్లిదండ్రులను యాజమాన్యం ఇంటర్వ్యూ చేస్తుంది. మీరు ఎంతవరకు చదువుకున్నారు? ఇంట్లో పిల్లలకు సమయం కేటాయించగలరా? హోమ్‌వర్క్ చేసేలా చూడగలరా? వీటికి సరైన సమాధానాలు ఉన్నప్పుడే పాఠశాలలో ప్రవేశం. ఇంతకూ చదువులు పిల్లలకా తల్లిదండ్రులకా? పిల్లలకు చదువు అబ్బకపోతే బాధ్యత పాఠశాల యాజమాన్యానిదా? తల్లిదండ్రులదా? విద్యా

బుద్ధులు నేర్పించే బాధ్యత ఉపాధ్యాయులదని గత నమ్మకం. ప్రభుత్వానిదని తరువాత భావించారు. మరిప్పుడు? ప్రైవేటు యాజమాన్యానిదా, తల్లిదండ్రులదా? ఇది భేతాళ ప్రశ్నే? అంతేకాదు. పిల్లలకు ర్యాంకులు రావాలి. నిద్ర లేచింది మొదలు నిద్ర పోయేవరకు చదువుతూనే ఉండాలి. అవును. మంచి ర్యాంకులు వస్తే ఆ పాఠశాలకు మంచి పేరు వస్తుంది. రాబోయే విద్యా సంవత్సరం ఉన్నత శ్రేణి విద్యార్థినీ విద్యార్థులందరూ తమ సంస్థలోనే చేరతారు. ఎంత డొనేషన్ కట్టడానికైనా సిద్ధపడతారు. లాభం గ్యారెంటీ. తమ పిల్లలకు మంచి ర్యాంకులు రావాలని తల్లిదండ్రులూ కోరుకుంటున్నారు. విజ్ఞానం కోసం చదవాలా, ర్యాంకుల కోసమా? విజ్ఞానం విద్యార్థి భవిష్యత్తుకు ఉపయోగం. ర్యాంకులు ప్రైవేటు యాజమాన్యానికి లాభం. బాల్యం కోల్పోయిన బాలబాలికల కాలం ఇది. బాల్యం మీద ప్రైవేటు వేటు పడింది. ర్యాంకుల పరుగుపందెంలో తల్లిదండ్రులూ చెమటలు కక్కుతూ పరిగెడుతూనే ఉన్నారు. ర్యాంకుల కోసం తల్లిదండ్రులు, లాభం కోసం యాజమాన్యాలు.... ఇదీ ఈనాటి విలువ.

వైద్యుడు సేవకుడు. ప్రచారం కూడా చేసుకోవద్దు. ఇది వైద్య శాస్త్ర నైతిక విలువ. ప్రకటనలు చేయకపోతే రోగులు ఎట్లా వస్తారు? అదేమిటి? వ్యాధిగ్రస్తుడు వైద్యుడిని వెతుక్కుంటూ వస్తాడు కదా! నిజమే. ఏ వైద్యుడి దగ్గరికో వెళితే నాకేంటి లాభం? నా ఆస్పత్రికే రావాలి కదా! అవసరం లేకున్నా పరీక్షలు. మందుల చిట్టాలు. ఆసుపత్రిలో అడ్మిషన్లు. స్టార్ హోటల్ సౌకర్యాలు. స్టార్ స్థాయిలోనే ఫీజులు. లాభం సంపాదించాలి కదా. ఇది నేటి విలువల్లో భాగం. జనరిక్ మందులు చౌక. బ్రాండెడ్ మందుల ధర ఎక్కువ. అయినా వైద్యులు బ్రాండెడ్ మందులే రాస్తారు. జనరిక్ మందులు రాస్తే రోగికి ప్రయోజనం. డాక్టర్‌కేమొస్తుంది? బ్రాండెడ్ మందులు రాస్తే దేశ విదేశీ ప్రయాణ ఖర్చులు, విందులు వినోదాల ఖర్చులు మందుల కంపెనీలు భరిస్తాయి. అది వారికి కూడా లాభం. వైద్య కళాశాలలో యాజమాన్యం సీట్లు అమ్ముకోవాలి. లాభం సంపాదించాలి. చదువు కోసం తాను పెట్టిన ఖర్చును డాక్టర్ సంపాదించాలి. ఆపైన లాభం సంపాదించాలి. శారీరక రోగంతో వైద్యశాలకు చేరిన వ్యక్తిని ఇక్కడ "లాభం" రోగం పీడిస్తున్నది.

రాజధాని నుండి మారుమూల గ్రామం వరకు మహిళలపై లైంగిక దాడులు పెరిగాయి. స్త్రీలను గౌరవించాలన్నది నిన్నటి మాట.

"వైద్యుడు సేవకుడు. ప్రచారం కూడా చేసుకోవద్దు. ఇది వైద్య శాస్త్ర నైతిక విలువ. ప్రకటనలు చేయకపోతే రోగులు ఎట్లా వస్తారు? అదేమిటి? వ్యాధిగ్రస్తుడు వైద్యుడిని వెతుక్కుంటూ వస్తాడు కదా! నిజమే. ఏ వైద్యుడి దగ్గరికో వెళితే నాకేంటి లాభం? నా ఆస్పత్రికే రావాలి కదా! అవసరం లేకున్నా పరీక్షలు. మందుల చిట్టాలు. ఆసుపత్రిలో అడ్మిషన్లు. స్టార్ హోటల్ సౌకర్యాలు."




ఆదిత్య, బిర్లా మెమోరియల్ ఆసుపత్రి

వాడుకోవాలన్నది ఈనాటి వేట. అలాంటి దుస్తులు ధరిస్తే రెచ్చగొట్టడమే కదా! చీకటిపడక ముందే ఇంటికి చేరుకోవచ్చు కదా! ఇది కొందరి మాట. "అన్నా" అని ఉంటే నిర్భయపైన అత్యాచారం జరిగి ఉండేది కాదంటాడు ఒక ప్రబుద్ధుడు, ఒక బాబా! అవునా! పసిపిల్లలమీద అత్యాచారాలు ఎందుకు జరుగుతున్నట్టు? వయస్సు మళ్ళినవారినీ వదలటంలేదెందుకు? వైకంలో వావివరసలూ మరచిపోతున్నారెందుకు? అందం వ్యాపారసరుకైంది. వ్యాపార ప్రకటనల సాధనమైంది. అవును ఇది ఇప్పుడే జరిగింది. ఆధునిక సమాజంలోనే జరిగింది. అభివృద్ధి ముసుగులోనే జరిగింది. లాభంకోసమే జరిగింది. వినోదం వికటించింది. ఇది పెట్టుబడిదారీ నీతి. వలువలూడిన విలువ. పురుషాధిక్యతకు లాభ తృష్ణ తోడయ్యింది. ఇదే మహిళను వేటాడుతున్నది. వాడుకోవాలంటున్నది. వేశ్యావృత్తిని అంతం చేయాలా, పెంచిపోషించాలా? సమస్య మూలాలను పరిష్కరించాలా లేక లైసెన్స్‌డ్ వ్యాపారంగా మార్చాలా? లైసెన్సులివ్వాలనే అంటుంది ఈ సమాజం. వ్యభిచారం లేని పెట్టుబడిదారీ వ్యవస్థ సాధ్యమా! నిరుద్యోగం, అవినీతి లేని పెట్టుబడిదారీ వ్యవస్థ లేనట్టే వ్యభిచారం లేని పెట్టుబడిదారీ వ్యవస్థ కూడా సాధ్యం కాదు. లంచం పెట్టకుండా, తార్చకుండా యజమాని వ్యాపారం సాగదు. లాభార్జన నడవదు. లాభమే సర్వస్వం. లాభం కోసం ఏమైనా చేస్తారు. లాభం తెచ్చేవన్నీ మంచివే. నష్టం తెచ్చేవన్నీ చెడ్డవే. ఇది వ్యాపార నీతి. పెట్టుబడిదారీ విలువ.

కార్మికుడు అవివాహితుడైతే బాదరబందీ ఉండదు. తక్కువ ఖర్చు. ఇంటి అద్దె తక్కువే. అవసరమైతే డబుల్ డ్యూటీలు చేస్తాడు. పెళ్ళైతే ఖర్చులు పెరుగుతాయి. ఇంటి అద్దె పెరుగుతుంది. ఆరోగ్య ఖర్చులు అదనం. డబుల్ డ్యూటీలకు వెనుకాడతాడు. పైగా పిల్లలు పుడితే ఎవరు చూసుకోవాలి? తాతమ్మలు నానమ్మలు చూసుకోవడం గతం. ఇప్పుడు అది లేదుకదా. క్రెచ్ ఖర్చులు భరించాలి. అంటే వేతనాలు పెంచాలని కోరతాడు కార్మికుడు. పెళ్ళికి కనీస వయస్సు

**"సాక్షాత్తూ నరేంద్రమోడీ మంత్రివర్గంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, హత్యాప్రయత్నాలు, దోపిడీ కేసులను ఎదుర్కొంటున్న వారున్నారు. ఒక మంత్రి తన మిత్రబృందంతో కలిసి తప్పతాగి తనను సామూహికంగా అత్యా చారం చేశారని ఆయన భార్య చేసిన ఆరోపణను ఎదుర్కొంటున్నాడు."**

నిర్ణయించింది పెట్టుబడిదారీ వ్యవస్థ. బాల్య వివాహాలను నిషేధించింది. ఇది పెట్టుబడి దారులకే కాదు, ప్రజలకు కూడా మంచిదే. ప్రజల ఆరోగ్యానికి మేలు. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందుతున్నది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, మంచి వేతనాలు వచ్చాయి. 8 గంటల డ్యూటీ సాధ్యం కాదు. ఇంటికి వచ్చేస్తే ప్రాజెక్టు వర్క్ ఆగిపోతుంది. ఒప్పుకున్న తేదీలోగా పని పూర్తి కాకపోతే మరో ప్రాజెక్టు రాదు. మంచి వేతనం స్థానంలో నిరుద్యోగం చేరుతుంది. అలసిపోయేంతవరకూ పనిలో ఉండవలసిందే. ఇంటి కొచ్చిన మరుక్షణం నిద్రకు ఉపక్రమించవలసిందే. అప్పుడే పెళ్ళయితే ఇబ్బందే కదా! పెళ్ళికి తొందర లేదు. డేటింగ్‌లు తప్పుకాదు. ఇది పెట్టుబడిదారీ నీతి. పెళ్ళైన తరువాత కూడా ఇదే ఉద్యోగం. భార్యకూ ఇలాంటి ఉద్యోగమే. చెరో షిఫ్టులో ఉద్యోగం అనివార్యం. వీకెండ్ తప్ప కలిసి ఉండే రోజు లేదు. వారాంతపు సెలవు రోజే కుటుంబ జీవితం. మిగతా కాలం ఒంటరి జీవితం. ఎవరి సౌఖ్యం వారిది. పరస్పరం అర్థం చేసుకునే... సర్దుబాటు! ఇది అభివృద్ధి ఫలితం. పెట్టుబడిదారీ నీతి.

బతుకుమీద ఆశలు సడలిన రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. బతికిన రైతులు మోసపోతూనే ఉన్నారు. రైతు అమ్మకానికి పెట్టిన పత్తిని రిమోట్‌తో వ్యాపారి దండికొడుతూనే ఉంటాడు. పత్తి కొనుగోలు చేయవలసిన కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు తేమ శాతం ఎక్కువ ఉన్నదనే సాకు చూపి తిరస్కరిస్తూనే ఉంటారు. కారుచౌకగా వ్యాపా రులు కొనుగోలు చేస్తారు. అదే పత్తిని వ్యాపారుల నుండి సిసిఐ అధికారులు నాణ్యమైన పత్తిగానే కొనుగోలు చేస్తారు. రైతు మరోసారి దగా పడతాడు. ఒకవైపు రైతులు చనిపోతూ ఉన్నా బతికున్న రైతులను పీడిస్తూనే ఉంటారు. చావు దరికి చేరుస్తూనే ఉంటారు. లాభం రావాలి కదా!

పార్టీ ఫిరాయింపులు ఒకప్పుడు అవమానకరం. ఇప్పుడు అవి రాజకీయ పునరేకీకరణ. అంబానీలకు ఢిల్లీలో మోడీ గెలవాలి. అందుకు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు రావాలి. వీరు గెలవాలంటే జనం మీద పట్టుఉన్నవారు ఏ పార్టీలో ఉన్నా ఈ పార్టీల వైపు చూడాలి. అందుకే ఫిరాయింపు ఇప్పుడు పునరేకీకరణగా మారింది. కార్పొరేట్ మీడియా కార్పొరేట్ ప్రయోజనాలకు అనుగుణంగానే అడుగులు వేసింది. అవమానకరమైన ఫిరాయింపుకు గౌరవప్రదమైన రాజకీయ పునరేకీకరణగా నామకరణం చేసింది. తెలంగాణలోనూ ఇదే తంతు. ఫిరాయింపులను ఒకప్పుడు రాజకీయ వ్యభిచారంగా అభివర్ణించిన కార్పొరేట్ మీడియా ఇప్పుడు ప్లేటు ఫిరాయించింది. కార్పొరేట్ పట్టు అంత! అంబానీలు, ఆదానీలు కోరుకున్నవారు అధికారంలో ఉంటేనే కదా వారికి లాభం. అన్నీ లాభం మహిమలే!

అవినీతి అవమానకరం. అది నిన్నటి మాట. నీతి అవినీతిల మధ్య గీటురాయి నిధుల దుర్వినియోగమేనట! డబ్బు ప్రస్తావన లేనివన్నీ నీతిగానే పరిగణించాలట! నేరం చేసిన లలిత్ మోడీ దేశంలో విచారణను ఎదుర్కోకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. బ్రిటన్‌లో తలదాచుకున్నాడు. దేశానికి రప్పించి న్యాయస్థానం ముందు నిలబెట్టవలసిన విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ మాత్రం ఆ నేరస్థుడు అక్కడినుండి ఇతర దేశాలకు వెళ్ళడానికి కూడా సహాయం చేశారు. మానవతా దృక్పథంతో సహాయపడ్డారట! దేశంలోని కారాగారాల్లో ఉన్న నేరస్థులందరికీ మానవతా దృక్పథంతో సహాయం చేస్తారా? లలిత్‌మోడీకి సుష్మా స్వరాజ్‌కు మధ్య ఆర్థిక లావాదేవీలేమీ జరగలేదట. అందుకే నేరస్థుడికి సహాయపడినా అది నీతి! సాక్షాత్తూ నరేంద్రమోడీ మంత్రివర్గంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, హత్యాప్రయత్నాలు, దోపిడీ కేసులను ఎదుర్కొంటున్న వారున్నారు. ఒక మంత్రి తన మిత్రబృందంతో కలిసి తప్పతాగి తనను సామూహికంగా అత్యాచారం చేశారని ఆయన భార్య చేసిన ఆరోపణను ఎదుర్కొంటున్నాడు. అయినా ఇదేమీ అవినీతి కాదు. ఇక్కడ ఆర్థిక లావాదేవీలేమీ లేవుకదా! ఇది దేశభక్తుల నీతి. బిజెపి నిఘంటువులో ఇవన్నీ ఆధునిక విలువలన్నమాట! ఇది పెట్టుబడిదారీ నీతి.

విలువలు పడిపోతున్నాయని ఆందోళనలు చెందడం వల్ల ప్రయోజనం లేదు. లాభంకోసం ఏమైనా చేయటమే పెట్టుబడిదారీ లక్షణం. లాభం తెచ్చేది ఏదైనా నీతి. ఇది పెట్టుబడిదారీ విలువ. విలువల దిగుజారుడికి మూలమైన పెట్టుబడిదారీ వ్యవస్థనే ప్రశ్నించాలి. దాని పునాదులను పెకిలించాలి. అందుకు ప్రజలు సన్నద్ధం కావాలి. ❋

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,**
**ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2**

## జాతీయ ఆరోగ్య విధానం ముసాయిదా 2015

# ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు

మోహన్‌రావు, ప్రాచీన్ గొడాజ్‌కర్, రమాబారు, రమీలాబిష్ట్,
రితుప్రియ మెహరోత్ర, రాజీబ్ దాస్ గుప్త, సునీతారెడ్డి, వికాస్ బాజ్‌పాయ్
(సామాజిక ఆరోగ్య అధ్యయన కేంద్రం, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ)

కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ 2015 జాతీయ ఆరోగ్య విధానం ముసాయిదా పత్రాన్ని సూచనలు, చర్చకోసం విడుదల చేసింది. ముసాయిదాపై విమర్శనాత్మక చర్చకు ఈ వ్యాసం ఉద్దేశించబడింది.

**1. ఆర్థిక, రాజకీయ, చారిత్రక నేపథ్యం**

1990 నుండి దేశాన్ని పాలించిన వివిధ ప్రభుత్వాలు నయా ఉదారవాద విధానాలను అమలు చేశాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ముసాయిదా పత్రం మన ముందుకొచ్చింది. నయా ఉదారవాద విధానాల పట్ల పాలకవర్గాలు ఏకీభావంతో ఉన్నప్పటికీ, ఆ విధానాల వల్ల వచ్చే ప్రతికూల ఫలితాల పట్ల వ్యవహరించే విషయంలో తేడాలున్నాయి. 2005లో యుపిఎ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌ను ప్రారంభించింది. గ్రామీణ భారతంలో ఆరోగ్య రక్షణను అభివృద్ధి చేయడం దీని ఉద్దేశ్యం. ఈ కార్యక్రమంలో ఉన్న ప్రజానుకూల దృష్టి ప్రస్తుత ముసాయిదాలో లేదు. జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ విస్తృత చర్చల ద్వారా రూపొందింది.

ప్రస్తుత ముసాయిదాని పరిశీలిస్తే నయా ఉదారవాద పంథా అభివృద్ధిని వేగవంతం చేసే సూచనలు కనిపిస్తున్నాయి. వాస్తవానికి ఈ ధోరణి 2000 సం॥ నుండి క్రమేణా పెరుగుతూ వస్తున్నది. 2005 మే నెలలో సెజ్‌ల చట్టాన్ని పార్లమెంట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. అప్పటి నుండి నయా ఉదారవాద విధానాల అమలుకు అనుకూలించే చట్టాల రూపకల్పనలో పార్లమెంటు అపురూపమైన సమైక్యతను ప్రదర్శించింది. కార్మికచట్టాల సవరణబిల్లు, అప్రెంటీస్‌ల బిల్లు పార్లమెంటులో మూజువాణీ ఓటుతో నెగ్గాయి. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం వల్ల దేశంలోను, ప్రపంచవ్యాప్తంగాను ఆర్థికాభివృద్ధి పడిపోయింది. ఈ నేపథ్యంలో ఆరోగ్య పరిశ్రమ కున్న లాభార్జనావకాశాలను గుర్తించారు. ముసాయిదా పత్రంలో ఇలా చెబుతున్నారు.

"మన ఆరోగ్య పరిశ్రమ 15 శాతం వార్షికాభివృద్ధి రేటుతో ఉన్నది. మిగతా సర్వీసుల అభివృద్ధి కంటే ఇది రెట్టింపు. మొత్తం జాతీయాభివృద్ధి రేటుకంటే మూడింతలు. 2012–13లో ప్రైవేటు ఆరోగ్య పరిశ్రమ 200 కోట్ల డాలర్ల విదేశీ పెట్టుబడిని ఆకర్షించింది" ముసాయిదా పత్రం ఆరోగ్యరంగాన్ని ఆర్థిక కార్యక్రమంలో ఒక భాగంగా చూస్తున్నది. ప్రజారోగ్య రక్షణ ప్రాధాన్యతను పక్కన పెడుతున్నారు.

**2. స్థూల నేపథ్యం:**

ఈ విధానపత్రం రూపకల్పన వెనుక రెండు ప్రధానమైన అవగాహనలున్నాయి.

1) 2002 జాతీయ ఆరోగ్య విధానానికనుగుణంగా తీసుకున్న చర్యలు మంచి ఫలితాలనిచ్చాయి. పాత కార్యక్రమాన్ని బలోపేతం చేయటం, నూతన కార్యక్రమాలను ప్రవేశపెట్టడం ద్వారా ఆరోగ్య సేవలను మరింత ముందుకు తీసుకెళ్ళవచ్చు.

2) ప్రభుత్వ, ప్రైవేటు ఆరోగ్యవ్యవస్థల మధ్య పరస్పర సహకార వాతావరణం ఉంది. అందువల్ల ప్రజారోగ్య లక్ష్యాలను సాధించడంలో ప్రైవేటురంగం పాల్గొంటుంది.

ముసాయిదా పత్రం ఇలా చెబుతున్నది. "ఆరోగ్యానికి సంబంధించి నూతన లక్ష్యాల సాధనలో దాదాపు పూర్తి విజయాన్ని సాధించాము. క్రిందిస్థాయి ఆరోగ్య సేవలలో సిబ్బందిని గణనీయంగా పెంచాము. ప్రత్యేకించి ఆశా వర్కర్ల సంఖ్యను బాగా పెంచాము. వీరిద్వారా హాస్పటల్ ప్రసవాల సంఖ్యను పెంచాము"

ప్రజాధనంతో నడుస్తున్న ఆరోగ్య బీమా పథకాల గురించి ముసాయిదా పత్రం ఇలా చెబుతున్నది.

2003–2004లో ఈ పథకాలు 5.5 కోట్ల ప్రజలకు అందుబాటులో ఉండగా, 2014కు 37 కోట్ల మంది (మొత్తం జనాభాలో నాలుగోవంతుకుపైగా) ఈ పథకాల పరిధిలోకి వచ్చారు. ఈ పథకాల అమలును పరిశీలిస్తేఆసుపత్రుల సేవల వినియోగం బాగా పెరిగి నట్లు తెలుస్తున్నది. ప్రైవేటు ఆరోగ్య కేంద్రాల ద్వారా అట్టడుగు 20 శాతం పేద కుటుంబాలకు, ఎస్.సి., ఎస్.టి. కుటుంబాలకు సేవలందాయి"

ముసాయిదా పత్రం గతకాలపు ఆరోగ్య కార్యక్రమాలలోని కొన్ని లోపాలను పేర్కొన్నది. జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ గురించి ఈ విధంగా చెప్పింది.

"సేవల పెరుగుదల చాలా వరకు ప్రసూతి, శిశుసంరక్షణకు, జాతీయ ఆరోగ్య పథకాలకు పరిమితమైంది. కాని విస్తృతమైన వైద్య, ఆరోగ్య సేవల విషయంలో తగినంత పురోగతి లేదు. కార్యక్రమ పరిధిని పరిమితం చేయడం వల్ల కొన్ని ఆరోగ్య సూచికలలో మాత్రమే అభివృద్ధి జరిగింది. ఇది లోపభూయిష్టమైన వ్యూహం"

ముసాయిదా విధాన పత్రం తన లక్ష్యాలను ఈ కింది విధంగా పేర్కొన్నది.

1) వైద్య ఖర్చుల చెల్లింపు కోసం జనం జేబులు ఖాళీచేసుకునే పరిస్థితి లేకుండా చూడాలి.
2) ప్రసూతి, శిశుసంరక్షణ సేవలతోపాటు అంటువ్యాధులకు, ఇతర జబ్బులకు ఉచిత, సమగ్ర, సార్వత్రిక సేవలు అందుబాటులోకి తీసుకురావాలి.
3) అత్యవసర మందులు, రోగ నిర్ధారణ పరీక్షలు, అంబులెన్సు సదుపాయం, అత్యవసర వైద్య సేవలు అందరికీ అందుబాటులోకి రావాలి.
4) ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా అందే మాధ్యమిక, ఉన్నత స్థాయి వైద్య సేవలను మెరుగుపరచాలి. ప్రైవేటు ఆస్పత్రుల నుంచి వ్యూహాత్మకంగా సేవల కొనుగోలు జరగాలి.
5) ఒక సమర్థవంతమైన, హేతుబద్ధమైన, క్షేమకరమైన, నైతికపరమైన ఆరోగ్యసేవా వ్యవస్థను అభివృద్ధి చేయాలి. ప్రజారోగ్య లక్ష్యాలకు ప్రైవేటు ఆరోగ్య పరిశ్రమను అనుసంధానం చేయడం ద్వారా మంచి ఫలితాలను పొందుతాము.

ముసాయిదా పత్రం మనకు చూపుతున్న దృశ్యం ఇది : "ఒక వైపు ప్రాథమిక ఆరోగ్య సేవలను విస్తృత పరుస్తూ, మరోవైపు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల నుంచి వైద్య సేవల కొనుగోలు ద్వారా ప్రజల వైద్య ఖర్చులను తగ్గించవచ్చు. ఈ విధంగా సార్వత్రిక ఆరోగ్య లక్ష్యాన్ని మనం సాధిస్తాం."

**3. ముఖ్య ప్రతిపాదనలు**

ముసాయిదా పత్రం తన ప్రధాన లక్ష్యాన్ని ఈ విధంగా చెప్తోంది. "అన్ని అభివృద్ధి కార్యక్రమాలలోను రోగ నివారణను, ఆరోగ్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకోవాలి. అత్యున్నత స్థాయి వైద్య

**"ప్రైవేటురంగ లక్ష్యాలకు, ప్రభుత్వరంగ లక్ష్యాలకు మధ్య ఖచ్చితమైన వైరుధ్యం ఉన్నది. నిరంతర లాభాపేక్ష ప్రైవేటురంగం లక్ష్యం. బాధ్యత, సేవ ప్రభుత్వ రంగ లక్షణం. రెండింటికీ సహజీవనం పొసగదు. ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ ప్రజాధనం తోను, ప్రభుత్వ మద్దత్తుతోను నడవాలి. ప్రభుత్వం ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించే పరి స్థితులలో ప్రైవేటు రంగం ప్రభుత్వ రంగపు రక్తం పీల్చుకొని పెరుగుతుంది."**

సేవలు ప్రజలందరికి అందుబాటులోకి తేవాలి. వైద్యఖర్చుల కోసం ఎవ్వరూ ఆర్థిక ఇబ్బందులలో పడకూడదు."

**ముసాయిదా పత్రం ప్రతిపాదిస్తున్న సేవలు**

**3.1 ప్రాథమిక ఆరోగ్య సేవలు:**

ఆరోగ్య సహాయ కేంద్రాల స్థాయిని పెంచాలి. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, సమగ్రమైన రోగనివారణ కార్యక్రమాలు, ఆరోగ్య అభివృద్ధి కార్యక్రమాలు, చికిత్స, పునరావాస కార్యక్రమాలు నిర్వహించే స్థాయికి చేరేలా అభివృద్ధి చేయాలి. సమగ్రమైన ప్రాథమిక ఆరోగ్య సేవలను ఒక హక్కుగా నిలబెట్టాలి. ప్రతి కుటుంబానికి ఒక ఆరోగ్య కార్డు ఉండాలి. ఈ కార్డు ద్వారా అన్ని సేవలకు అర్హులవుతారు.

ఈ సేవలన్నీ శిక్షణ పొందిన నర్సులు, ఇతర ఆరోగ్య సేవకుల ద్వారా అందుతాయి. దీర్ఘకాలిక వ్యాధులకు పెద్ద ఆసుపత్రుల్లో డాక్టర్లు వైద్యాన్ని ప్రారంభిస్తారు. ఆ వైద్యం కొనసాగింపు స్థానికంగా ప్రాథమిక సేవా బృందం చూస్తుంది. ప్రాథమిక సేవలకు, ప్రజలకు మధ్య వారధిగా పనిచేసేవారికి పారితోషికాలు ఇవ్వాలి.

**3.2 మాధ్యమిక, ఉన్నత స్థాయి వైద్య సేవలు:**

ఈ రెండు సేవలను ప్రభుత్వరంగం నుండి, ప్రైవేటురంగం నుండి ప్రజాధనంతో కొనుగోలు చేయాలి. ఇది ప్రభుత్వ ఖర్చు రూపం లో ఉండవచ్చు. ఇన్సూరెన్సు కంపెనీలు, ట్రస్టులు కూడా ఈ ఖర్చులకు బాధ్యత వహించవచ్చు. వ్యూహాత్మక కొనుగోలు అనేది ముసాయిదా పత్రం తెచ్చిన కొత్త ప్రతిపాదన. దీని ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు రంగాల నుండి సేవల కొను గోలు జరుగుతుంది. ప్రభుత్వం చెల్లింపుదారుగా ఉంటుంది.

ప్రభుత్వరంగ ఆసుపత్రుల మౌలిక సదుపా యాలు, మానవవనరులు, సామాగ్రికయ్యే ఖర్చు బడ్జెట్ కేటాయింపుల ద్వారా జరగాలి. అయితే కేటాయింపులలో ప్రధానభాగం సేవల పరిమా ణానికి, నాణ్యతకు అనుగుణంగా ఉండాలి.

**3.3 మౌలిక సదుపాయాల అభివృద్ధి :**

ఈ విషయంలో ఇప్పటి వరకు అవలంభి స్తున్న సాధారణ విధానాల స్థానంలో నిర్దిష్ట లక్ష్యాలతో విధానాలను చేపట్టాలి. వెనుకబడిన ప్రాంతాలకు ప్రాధాన్యమివ్వాలి. ప్రభుత్వ ఆసు పత్రుల సేవల నాణ్యతను నిర్ధారించే కమిటీలు ఏర్పడతాయి. మెరుగైన సేవలకు పారితోషకం ఉంటుంది.

**3.4 ఆరోగ్యరంగంలో మానవ వనరులు :**

ప్రభుత్వం నడుపుతున్న 58 వైద్య కళా శాలలను అభివృద్ధి చేస్తుంది. మరో 58 జిల్లాలలో జిల్లా ఆసుపత్రులను వైద్య కళాశాలల స్థాయికి పెంచుతారు. అఖిల భారత వైద్య శాస్త్రాల సంస్థ (ఎఐఐయంఎస్) లాంటి సంస్థ లను దేశవ్యాప్తంగా 9 నుండి 15కు పెంచాలి. వైద్య విద్యావిధానంలో ఉన్న అవకతవకలను సరిదిద్దాలి. వైద్య కళాశాలల ఏర్పాటుకు సంబం ధించిన నియమ నిబంధనలను తయారు చేయాలి.

బోధనా సిబ్బందికి ఆకర్షణీయమైన జీత భత్యాలు, మెరుగైన పని పరిస్థితులు కల్పించా లని, వెనుకబడ్డ ప్రాంతాల నుండి వైద్య విద్యార్థు లు వచ్చేలా చూడాలని ముసాయిదా పత్రం సూచిస్తున్నది. వైద్య కళాశాలలను ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని, ఆ విధంగా వెనుక బడిన తరగతులకు వైద్య సేవలు లభిస్తాయని పత్రం సూచిస్తోంది.

**4. విమర్శ**

**ఈ విధానాలు ఏమి సాధిస్తాయి?**

ఒక సమాజంలోని ఆరోగ్య స్థాయి అక్కడి సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితు లపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి ముసాయిదా పత్రం సిఫార్సులను విశ్లేషించడానికి ప్రస్తుత సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను పరిశీలించడం అవసరం.

మన దేశంలో వైద్య , ఆరోగ్య సేవా రంగంలో వస్తున్న మార్పులను, తద్వారా ప్రజా రోగ్యంలో వస్తున్న ఫలితాలను గమనిస్తే రెండు పెద్ద వైరుధ్యాలు కన్పిస్తున్నాయి.

**ఒకటి :** ప్రైవేటురంగంలో ఉన్న ఆరోగ్య వ్యవస్థకు, ప్రభుత్వఆరోగ్య వ్యవస్థకు మధ్య ఉన్న వైరుధ్యం.

**రెండు :** ఉన్నత వర్గాల ఆరోగ్య అవసరాలకి, సామాన్య ప్రజల ఆరోగ్య అవసరాలకు మధ్య వైరుధ్యం. ఆరోగ్య రంగంలో వర్గ ప్రయోజనాల పాత్ర స్పష్టమవుతున్నది.

**పై వైరుధ్యాలతో అనుబంధంగా ఉన్న ఇతర వైరుధ్యాలు :**

వ్యాధి నివారణ, చికిత్స కార్యక్రమాలకు మధ్య వైరుధ్యం, గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు మధ్య వైరుధ్యం, సాధారణ, ఉన్నత స్థాయి వైద్య సేవలకు మధ్య వైరుధ్యం, వైద్య శాస్త్రంలోవివిధ విభాగాల మధ్య వైరుధ్యాలు ఉన్నాయి. విధాన రూపకర్తలు ఈ వైరుధ్యాలను గుర్తించడానికి సిద్ధంగా లేరు. వారి వాదన ఇలా ఉంది:

"1. మన దేశ ప్రజారోగ్య అవసరాలను తీర్చడంలో ప్రభుత్వరంగాన్ని, ప్రైవేటు రంగాన్ని సమన్వయం చేయవచ్చు.

2. ధనికుల ఆరోగ్య అవసరాలు, పేదల ఆరోగ్య అవసరాలు తీర్చే విషయంలో ఎటువంటి వైరుధ్యాలు లేవు."

**ఈ వాదనలను జాగ్రత్తగా పరిశీలించుదాం :**

**ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు :**

ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం సర్వరోగ నివారిణి అని ప్రచారం చేస్తున్నారు. 20సం॥ల కిందట ఈ గోల మొదలైంది. ప్రైవేటీకరణ కార్యక్రమంలో ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారంగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం అనే ఉపాయాన్ని కనిపెట్టారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి 2004 మార్చిలో విడుదల చేసిన పత్రంలో ఇలా చెప్పింది. "1990ల చివరికొచ్చే సరికి ప్రైవేటీకరణ వేగం తగ్గింది. ఈ సంద ర్భంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాలు పరి స్థితిని సరిదిద్దేందుకు ముందుకొచ్చాయి."

ప్రైవేటురంగ లక్ష్యాలకు, ప్రభుత్వరంగ లక్ష్యాలకు మధ్య ఖచ్చితమైన వైరుధ్యం ఉన్నది. నిరంతర లాభాపేక్ష ప్రైవేటురంగం లక్ష్యం. బాధ్యత, సేవ ప్రభుత్వ రంగ లక్షణం. రెండింటికీ సహజీవనం పొసగదు. ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ ప్రజాధనంతోను, ప్రభుత్వ మద్దత్తుతోను నడవాలి. ప్రభుత్వం ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించే పరి స్థితులలో ప్రైవేటు రంగం ప్రభుత్వ రంగపు రక్తం పీల్చుకొని పెరుగుతుంది. ప్రైవేటు రంగం పెరుగుదల ప్రభుత్వ రంగం నీరసించడానికి కారణమవుతుంది.

ఈ నేపధ్యంలో ప్రభుత్వ రంగాన్ని బలో పేతం చేస్తాం అనే ప్రకటనలు గాలి కబుర్లు మాత్రమే.

ప్రభుత్వం గత 25 సంవత్సరాలుగా ఆరోగ్య పరిశ్రమకు ఒక చక్కటి అనుకూలమైన వాతావరణాన్ని ఏర్పాటు చేస్తూ వచ్చింది. ప్రత్యక్ష పన్నులు తగ్గించటం, ఆదాయపు పన్నుల మినహాయింపు, దిగుమతి చేసుకున్న వైద్య పరికరాలపై కస్టమ్స్ పన్ను మినహాయింపు, ఆరోగ్య బీమా పై ఆదాయపు పన్ను మినహాయింపు, ఆరోగ్యబీమాకు ప్రభుత్వరంగం ద్వారా ఆర్థిక మద్దత్తు, భూములప్పగింత తదితర విధాలుగా ప్రైవేటు రంగానికి మద్దత్తునిస్తూ వచ్చారు. వైద్యరంగంలో నర్సింగ్, పారామెడికల్, ప్రభుత్వ సంస్థలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. తద్వారా ప్రైవేటు రంగానికి విధేయతతో కూడినటువంటి సహాయాన్ని అందించింది. వీరందరిలో ఎక్కువమంది ప్రవేటు రంగంలో పనిచేసేవాళ్ళే.

జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ గురించి ఈవిధంగా చెప్పారు. జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ అనేది జాతీయ ఆరోగ్య పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య సంస్థలను కూడా బలోపేతం చేయడానికి ఉద్దేశించబడింది. కాని ఆచరణలో ఎక్కువ భాగం జాతీయ పథకాల అమలుకే పరిమితమైంది. సమగ్రమైన ఆరోగ్య సేవలందించడానికి, ఆరోగ్య వ్యవస్థ శక్తిని పెంచడానికి పెద్ద స్థాయిలో పెట్టుబడులు, మానవ వనరులు అవసరం కాగా ఈ విషయంలో తీవ్రమైన లోటు జరిగింది. అవసరమైన మొత్తంలో 40 శాతం కేటాయింపు మాత్రమే జరిగింది."

జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ కార్యక్రమాల అమలులో ప్రభుత్వ రంగం గ్రామీణ ఆరోగ్య సేవల్ని బలోపేతం చేయటానికి బదులుగా ప్రైవేటు రంగానికి పెద్ద పీట వేసిన ఉదంతాలున్నాయి. 1992 లో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మెర్రీగోల్డ్ పథకం పేరుతో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య పథకాన్ని ప్రారంభించింది. దీని ముఖ్య ఉద్దేశ్యం ఎంపిక చేసిన వైద్య సేవలను నాణ్యత, సరసమైన ధరలతో ప్రజలకందించి, ఆ విధంగా ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ పని భారాన్ని తగ్గించటం అని చెప్పారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాలలో పాల్గొనే ప్రైవేటు ఆసుపత్రులను ఎంపిక చేయటం, ఎంపిక చేసిన ప్రైవేటు ఆసుపత్రులతో ఆశావర్కర్లను అనుసంధానం చేయటం, ఆశా వర్కర్ల ద్వారా రోగులను ప్రైవేటు ఆసుపత్రుల వైపు నడిపించటంగా జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ పాత్రను మార్పు చేశారు. ఈ విధంగా శక్తివంతమైన ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ ద్వారా ప్రజల కందాల్సిన

> **❝ కార్పొరేట్ ఆసుపత్రులు పెద్ద ఎత్తున సబ్సిడీలు పొందినందుకు ప్రతిఫలంగా పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించాలనే నైతిక బాధ్యతను తుంగలో తొక్కాయి. ప్రజా ప్రయోజనాలను నిర్లక్ష్యం చేసి, ప్రైవేటు లాభాలకు ప్రభుత్వం ఉత్సాహంగా బాటలు వేస్తోందన టానికి ఈ ఉదాహరణను చూస్తే అర్థమవుతుంది.❞**



కనీస సదుపాయాలు లేని ప్రభుత్వాసుపత్రి

సేవలను ప్రైవేటు రంగానికి అప్పచెప్పి, ప్రజాధనాన్ని వారికి ధారపోస్తూ ప్రైవేటు ఆరోగ్య పరిశ్రమ పుంజుకోవటానికి అవకాశాలు ఇచ్చారు. సామాజిక ఆరోగ్య కార్యకర్తలుగా ఉన్న ఆశాలను ప్రైవేటు రంగానికి ఏజంట్లుగా మార్చారు. 2013 లో ఉత్తరాఖండ్ ప్రభుత్వం రాష్ట్రంలోని అత్యున్నతంగా పనిచేస్తున్న16 ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్ని పూర్తిగా ప్రైవేటు పరం చేసింది. వీటిని నడిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 15 శాతం లాభాన్ని గ్యారంటీ ఇచ్చింది. నిర్వాహకులు చికిత్సా సేవలు మాత్రం అందిస్తే చాలు. వ్యాధినివారణ, ఆరోగ్య అభివృద్ధి కార్యక్రమాలు వాళ్ళ బాధ్యత కాదు.

కార్పొరేట్ ఆసుపత్రులు పెద్ద ఎత్తున సబ్సిడీలు పొందినందుకు ప్రతిఫలంగా పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించాలనే నైతిక బాధ్యతను తుంగలో తొక్కాయి. ప్రజా ప్రయోజనాలను నిర్లక్ష్యం చేసి, ప్రైవేటు లాభాలకు ప్రభుత్వం ఉత్సాహంగా బాటలు వేస్తోందనటానికి ఈ ఉదాహరణను చూస్తే అర్థమవుతుంది. "ప్రైవేట్ రంగం మార్కెట్ సూత్రాలకు అనుగుణంగా పనిచేస్తున్నది. అభివృద్ధి రేటు పెరుగుదలలో కీలక పాత్ర పోషిస్తున్నది. మెడికల్ టూరిజం ద్వారా జాతికి ఆదాయాన్ని తెస్తున్నది. ఐతే ప్రైవేట్ రంగం నుండి ప్రజారోగ్య రక్షణపై ప్రతికూల ప్రభావాలు పడకుండాచూడాలి," అని చెప్పారు. ప్రజారోగ్య రక్షణ విధానంపై ప్రైవేటు రంగ ప్రతికూల ప్రభావం పడలేదా ? ఇది కీలకమైన ప్రశ్న.

ఈ రోజు అత్యున్నత స్థాయి వైద్య సేవా రంగంలో ప్రైవేటురంగానిదే పై చేయి. ఇటీవలి వరకూ ఈ స్థానం ప్రభుత్వ బోధనాసు పత్రులది. వైద్య వృత్తి అంటే సేవ చేస్తూ సౌక ర్యంగా బతకవచ్చు అన్నది నిన్నటి మాట. జబ్బుల వల్ల కలిగే మానవవేదన నుండి అత్యధిక లాభాలు గుంజుకోవచ్చు అన్నది నేటి విధానం. ఈ ధోరణి సమాజసేవ అనే నైతిక బాధ్యతను వైద్యవృత్తి విరమించేలా చేసింది. లాభార్జన ధోరణి సాధించిన ఫలితాలివి. ఒకటి రోగ నివారణ, ఆరోగ్య అభివృద్ధి కంటే వైద్య చికిత్సకు ప్రాధాన్యం ఏర్పడింది. దీనివల్ల ఆరోగ్యం పట్ల ఉండాల్సిన సామాజిక దృష్టి క్షీణించింది. రెండు – వైద్య చికిత్సలో తక్కువ ఖర్చుతో నయం చేసే చికిత్సా పద్ధతుల స్థానంలో ఆధునిక సాంకేతికత పేరుతో భారీ ఖర్చుతో కూడుకున్న సంక్లిష్టమైన చికిత్సా పద్ధతులు అమలులోకి వచ్చాయి. ఈ ప్రాధాన్యతలు ధనికుల ఆరోగ్య అవసరాలు తీర్చడానికి ఉద్దేశించబడ్డాయి తప్ప పేదల కోసం కాదు. వైద్య విద్యా బోధన కూడా ఈ ధోరణికి అనువుగా మారుతున్నది. వైద్య విద్యార్థుల ఆలోచనపై దీని ప్రభావాలు పడుతు న్నాయి. వారు ఆధునిక పరికరాలు ఉన్న ఉన్నత స్థాయి ఆసుపత్రులలో పని చేయడానికి ఉత్సాహ పడుతున్నారు. గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలలోనూ పని చేయడానికి వారు సిద్ధంగా లేరు.

ప్రతి వైద్యుడూ స్పెషలిస్టు, సూపర్ స్పెషలిస్టు కావాలని తహతహలాడుతున్నాడు. సామాజిక వైద్యం అనేది పాతచింతకాయ అయిపోయింది. వైద్య, ఆరోగ్య వ్యవస్థను ధనిక వర్గాల అవసరాలకు అనుగుణంగా రూపొందిం

> ❝ ప్రజారోగ్య సదుపాయాలకు నిధులు తగ్గించటం, వైద్య సిబ్బంది నియామకాలు ఆపివేయటం, కాంట్రాక్టు పద్ధతిలో నియామకాలు, జీతాలు, పరికరాలు, సామాగ్రి విషయాలలో లోపాలు, వీటన్నిటి ద్వారా ప్రభుత్వరంగ వైద్య సిబ్బందిని నిరుత్సాహపర్చటం, సేవలను నిర్వీర్య పర్చటం జరుగుతోంది. ప్రభుత్వ ఆరోగ్య సదుపాయాలను వ్యాపారీకరించే ధోరణి మొదలైంది.❞

చడం, వైద్యులలో ధనార్జన లక్ష్యాలు పెరగడం పరస్పర ప్రోత్సాహకరంగా ఉన్నాయి. ప్రైవేటు వైద్యకళాశాలలు విపరీతంగా పెరిగిపోవడం దీనికి సూచన. బడుగు, బలహీన తరగతుల నుండి, వెనుక బడ్డ ప్రాంతాల నుండి కొద్ది సంఖ్యలో వైద్య విద్యకు అవకాశం పొందిన విద్యార్థులు కూడా తిరిగి తమ ప్రాంతాలలో గాని, బలహీన వర్గాలకు గాని సేవ చేయడానికి సిద్ధపడే వాతావరణంలేదు. వారు కూడా మార్కెట్‌లో భాగమై పోవడానికే ఇష్ట పడుతున్నారు.

మనదేశ ఆరోగ్య వ్యవస్థను మార్కెట్ విధానం శాసించే పరిస్థితి ఏర్పడింది. పెద్ద నగరాల్లో ఉన్న బడా కార్పొరేట్ ఆస్పత్రులకు బస్తీలు, చిన్న పట్టణాలలో ఉన్న నర్సింగ్ హోంలతోను, డాక్టర్‌లతోను, ఆర్.యం.పి.లతోను, ప్రభుత్వ, ప్రైవేటు ఆరోగ్య కార్యకర్తలతోను సంబంధాలేర్పడ్డాయి. కమీషన్లు, బ్రోకరేజి విధానం ఏర్పడింది.

సజీవంగా, ఆరోగ్యంగా ఉన్న ప్రభుత్వ రంగం ప్రైవేటురంగం ఎదుగుదలకు ఆటంకంగా ఉంటుంది. అందువల్ల ప్రభుత్వ ఆరోగ్య సేవలను బలహీన పర్చడం ప్రైవేటీకరణ వాదులకు తక్షణ అవసరంగా తయారైంది. ప్రజారోగ్య సదుపాయాలకు నిధులు తగ్గించటం, వైద్యసిబ్బంది నియామకాలు ఆపివేయటం, కాంట్రాక్టు పద్ధతిలో నియామకాలు, జీతాలు, పరికరాలు, సామాగ్రి విషయాలలో లోపాలు, వీటన్నిటి ద్వారా ప్రభుత్వరంగ వైద్య సిబ్బందిని నిరుత్సాహపర్చటం, సేవలను నిర్వీర్య పర్చటం జరుగుతోంది. ప్రభుత్వ ఆరోగ్య సదుపాయాలను వ్యాపారీకరించే ధోరణి మొదలైంది. ఈ సందర్భంగా ప్రజారోగ్య లక్ష్యాలను సాధించటానికి ప్రైవేటురంగాన్ని ఉపయోగించటం ఏమాత్రం వీలుకాదని మేం చెప్పటం లేదు. ఇంగ్లాండులో జాతీయ ఆరోగ్య విభాగము అనేకమంది ప్రైవేటు వైద్యుల సేవలను జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో వినియోగించుకుంటోంది. తద్వారా ప్రజల ప్రాథమిక ఆరోగ్య సేవల కర్తవ్యాన్ని నెరవేర్చుతున్నది. అత్యున్నత వైద్య ప్రమాణాలతో కూడిన ప్రభుత్వవైద్య రంగం, నిబంధనలకు, పరిమితులకు అనుగుణంగా పనిచేసే ప్రైవేటురంగాల మధ్య మాత్రమే పైన పేర్కొన్న సంబంధం వాంఛనీయం అవుతుంది.

**2002నుంచి అమలు జరిగిన విధానాలు, గుణపాఠాలు :-**

2002 నుంచీ అమలు జరిగిన విధానాలు చాలా వరకు విజయవంతమైనట్లుగా డి.ఎన్.హెచ్.పి. చెపుతున్నది. ప్రసూతి, శిశు సంరక్షణ విషయంలో అభివృద్ధి సాధించినట్లు చెపుతున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆరోగ్య బీమా బాగా విస్తరించింది. ప్రస్తుత ముసాయిదాలో ప్రధానమైన సిఫార్సు అయినటువంటి ఆరోగ్య సేవల వ్యూహాత్మక కొనుగోలుకు అనుకూల వాతావరణం ఏర్పడింది.

**సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలు :-**
**ప్రసూతి, శిశు సంరక్షణ చర్యలు**

ప్రభుత్వ కార్యక్రమాల వల్ల ప్రసూతి, శిశుమరణాలు తగ్గటం జరిగింది అని చెప్పటం సమంజసంగా లేదు. (అనుమానాస్పదంగా ఉంది). ఈ రెండింటికీ మధ్య ప్రత్యక్ష సంబంధమున్నట్లు నిర్ధారణ కావటం లేదు. ఉత్తర ప్రదేశ్‌లో ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య వేగంగా పెరిగింది. కానీ ప్రసూతి, శిశు మరణాల తగ్గుదల చాలా తక్కువగా ఉంది.

దేశ వ్యాపిత గ్రామీణ ప్రజల ఆరోగ్య సేవల అవసరాల కోసం ఉన్నటువంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రుల వ్యవస్థ చాలా పెద్దదే కాని ఈ సదుపాయాల సామర్థ్యము, సేవల నాణ్యత ప్రజలకు అవసరమైన దానికంటే దిగువ స్థాయిలో ఉన్నాయి.

సామాజిక ఆరోగ్య కేంద్రాల పరిస్థితి చూద్దాము. ఇవి ద్వితీయ స్థాయి వైద్య సేవల కోసం ఏర్పడ్డాయి. ఇక్కడ స్పెషలిస్టులు, వివిధ అత్యవసర సేవలు అందుబాటులో ఉండాలి. దేశం మొత్తం మీద నాలుగోవంతు సామాజిక ఆరోగ్య కేంద్రాలలో మాత్రమే ప్రసూతి వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారు. కాని 18 శాతం ఆసుపత్రులలో మాత్రమే సిజేరియన్ ఆపరేషన్లు చేసే సదుపాయాలున్నాయి. సిజేరియన్ ఆపరేషన్లు చేసే సామాజిక ఆరోగ్య కేంద్రాలలో సగంచోట్ల కూడా రక్తం ఎక్కించే సదుపాయాలు లేవు. ఈ సౌకర్యం లేకుండా సిజేరియన్ ఆపరేషన్లు నిర్వహించటం ఎంతో ప్రమాదకరం. ఈ విధంగా సౌకర్యాలున్నచోట డాక్టర్లు లేకపోవటం, డాక్టర్లున్నచోట సౌకర్యాలు లేకపోవడం, ఈ అవక తవకలతో వైద్యసేవలు దెబ్బతింటున్నాయి. ఇంకా కరెంట్ సరఫరాలో అంతరాయాలు లాంటి సమస్యలున్నాయి.. వీటన్నింటి వల్ల వ్యవస్థ కుంటినడక నడుస్తోంది.

**ఆరోగ్య బీమా - ప్రభుత్వ నిధులు - ప్రైవేటు సేవలు :**

ప్రజాధనంతో ఆరోగ్య బీమా పథకాలు నడుస్తున్నాయి. కార్పొరేటు ఆస్పత్రులు లాభాలార్జిస్తున్నాయి. ఇది ఆరోగ్యకరమైన పరిస్థితి కాదు. ఆంధ్రప్రదేశ్‌లో అమలైన రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకంగురించి మాజీ కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి తన పరిశీలనలో ఇలా చెప్పారు. ఈ పథకానికి ఆరోగ్య బడ్జెట్‌లో 23శాతం కేటాయించారు. దీని లబ్ధిదారులు ప్రజల్లో ఒక శాతం కంటే తక్కువ. వీరందరూ పేదలు కాదు అని చెప్పారు.


**5. ముగింపు :**

ముసాయిదా జాతీయ ఆరోగ్య విధాన పత్రం ప్రజారోగ్య వ్యవస్థకు చూపుతున్న దారి ప్రజా సంక్షేమానికి దూరంగాను, ప్రైవేటు లాభాలకు దగ్గరగాను ఉన్నది. ఈ వాస్తవాన్ని మరుగుపరచడం కోసం ప్రజారోగ్య రక్షణలో ప్రైవేటు రంగం బాధ్యతగా పనిచేస్తుందని నమ్మించడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. దేశంలో ప్రస్తుతం నెలకొని ఉన్న ఆర్థిక, రాజకీయ వాతావరణానికి అనుగుణంగా విధానాలు తయారవుతున్నాయి. సార్వత్రిక ఆరోగ్య రక్షణ అనే భావనను కలుషితం చేస్తున్నారు. ప్రస్తుతం అమలుజరుగుతున్న, రూపొందిస్తున్న విధానాలు వైద్యరంగంలో సేవను మాయం చేసి ప్రైవేటు లాభాల మయం చేసే లక్ష్యంతో ఉన్నాయి.

ప్రజానుకూల ఆరోగ్య నిపుణులు, మేధావులు, సామాజిక కార్యకర్తలు శక్తి వంచన లేకుండా ఈ ధోరణులను ఎదుర్కొవలసివుంది.

అనువాదం:
**డాక్టర్ పుతుంబాక విజయకుమార్**

# భారత ఆర్థిక వ్యవస్థలో ఆవు పాత్ర



ప్రభీర్ పురకాయస్థ
ప్రముఖ ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు



ఇంద్రజిత్ సింగ్
సిపిఎం పంజాబ్ రాష్ట్ర నాయకులు

**ప్రభీర్ పురకాయస్థ, ఇంద్రజిత్ సింగ్**

దాద్రిలో బిషాడా గ్రామంలో మహమ్మద్ అఖ్లాక్ హత్యానంతరం వెల్లువెత్తిన నిరసనల తర్వాత కూడా ఆవులను వధించారనో, తరలిస్తున్నారనే పేరుతో దాడులు కొనసాగాయి. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ బాకా పత్రిక అయిన పాంచజన్య వేదాలను వక్రీకరిస్తూ ఈ దాడులను, హత్యలను సమర్థిస్తూ వ్యాసం ప్రచురించింది. హర్యానా ముఖ్యమంత్రి ఖట్టర్ కూడా వీటిని సమర్థిస్తూ ప్రకటన చేశారు. మహేష్ శర్మ హర్యానా రాష్ట్ర సాంస్కృతిక శాఖా మంత్రి మరింత దూకుడుగా ముస్లిములు ఇక్కడ ఉండాలంటే, గొడ్డుమాంసం తినడం మానేయాలి అని ప్రకటించారు.

ప్రజల మనోభావాలు దెబ్బతినే విధంగా లేదా రెచ్చగొట్టే విధంగా ఎందుకు ఆవును ప్రచారసాధనంగా తీసుకున్నారో మనం పరిశీలించాలి. సమాధానం చాలా తేలికగా దొరుకుతుంది. హిందూత్వ ఎజెండా ప్రచారంలో ఎప్పుడూ "అవతలవారిని" శత్రువుగా చూపించడమే ప్రధానం. ఆవు మనకు పవిత్రమైనదా, కాదా అన్నది ప్రధానాంశం కాదు. దానిని ముస్లిములు తింటారు. కాబట్టి అది మనకు పవిత్రమైనది. అందువలన ఆవును తినేవారు ముస్లీంలు కాబట్టి వారు మనకు శత్రువులు. ముస్లీంలపై వ్యతిరేకభావంతో హిందువులందరినీ ఏకం చేయడమే ఆర్ఎస్ఎస్ ప్రధాన ఎజెండా. హిందువులలో ఉన్నటువంటి బహుళ సాంప్రదాయ, సంస్కృతులను ఏకతాటికి తేవడం అసలైన లక్ష్యం. శాకాహారులు, శాకాహారాన్ని అతిగా ప్రచారం చేయడం ద్వారా అసలు హిందువులంటేనే శాకాహారులు అనే భావాజాలాన్ని రుద్దుతున్నారు. అందువలనే ముస్లిములందరూ ఆవులను చంపాలని తహతహలాడుతుంటారని ఎందుకంటే అది హిందువులకు పవిత్రమైనదని ప్రచారం చేస్తుంటారు.

ఈ ప్రచారం వలన ఆర్ఎస్ఎస్ మరియు బిజెపి ఒక ఓరవడిని సమాజంలో సృష్టిస్తోంది. ఎవరికిష్టమైన ఆహారం తినడం వారి హక్కు అనే చర్చ జరగాల్సినచోట, ఆవును చంపిన వారిని చంపడం సరిఅయినదా కాదా అనే చర్చ ప్రధానాంశమైంది. తద్వారా హిందువులకు పవిత్రమైన ఆవు పాలు, ఆవు మూత్రం యొక్క ఔషద గుణాలు, ఆర్థిక వ్యవస్థలో దాని పాత్రపై ప్రచారం ఊపందుకుంది. అదనంగా శాకాహార సిద్ధాంతాన్ని శాస్త్రీయంగా ముందుకు తీసుకెళ్లడానికి ప్రచారం జరుగుతోంది.

వాస్తవానికి ఒక రోజు లేదా ఒక పూట ఆహారం కోసం ఆవులను, ఎద్దులను ఎవరూ చంపుకోరు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వీటి పాత్ర గణనీయం. కేవలం వయస్సు మళ్లినవి, పాలు ఇవ్వలేనివి, వ్యవసాయంలో, రవాణాకు ఉపయోగపడని వాటిని మాత్రమే వదిలించుకునే ప్రయత్నం చేస్తారు.

వాస్తవానికి వీటిని తినేవారు ఎవరు? ఎక్కువ శాతం పేద ప్రజానీకం ఉంటారు. వంశపారంపర్యంగా పశుమాంసం తినే కొన్ని వర్గాలు లేదా తరగతులు వారు తింటారు. చాలా సందర్భాలలో వీటి మాంసం తిన్న తర్వాత, వాటి చర్మాలను ఉపయోగిస్తారు. కొవ్వు పదార్థాలను వేరు చేస్తారు. మిగిలిన శేషాన్ని కోళ్లకు మేతగా వాడతారు. పశువు మరణించిన తర్వాత కూడా అది ఆర్థిక వ్యవస్థలో ఈ విధంగా ఉపయోగపడుతుంది.

ఓట్టిపోయిన పశువులను కూడా కబేళాలకు తరలిస్తుంటారు. ఇక్కడ పశుమాంసం అనేది ఉత్పత్తి చేయబడుతుంది. మనదేశంలో వీటిని ఎక్కువగా తినేవారు పేదవర్గాల వారే. వారిలో ముస్లిములు, క్రిస్టియన్లు, హిందువులు కూడా ఉన్నారు. ఎందుకంటే ఇది చికెన్, మటన్ కన్నా చవకగా దొరుకుతుంది కాబట్టి. అసలు కబేళాలో ఎక్కువ శాతం వధించబడేవి ఎద్దులు, దున్నపోతులు, గొర్రెలు. వీటి నిర్వాహకులు ఎక్కువ మంది ముస్లీంలు ఉన్నప్పటికీ, హిందువులు కూడా ఉన్నారు. అత్యంత పెద్ద కబేళాలు, వధశాలలు కొంతమంది హిందువుల చేతిలో ఉన్నాయి. కాబట్టి వాటి మీద దాడి అంటే ఒక వర్గం మీద దాడి వంటిదే. ప్రధానంగా ఒక వర్గం ముస్లీంల ప్రధాన ఆదాయ వనరుపై దాడి. పోనీ ఈ మాంసంపై నిషేధం విధిస్తే వీటిని ఎవరు కాపాడతారు. ఒకవైపు రైతులు వ్యవసాయం గిట్టుబాటు కాకుండా, ఆర్థికంగా నష్టపోయి ఉన్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్న తరుణంలో వారికి ఇవి అదనపు భారం కాదా? కొంతమంది ఎగువమధ్య తరగతి హిందువుల కోసం, కొన్ని వందల సంవత్సరాలుగా హిందువులు, ముస్లీంల మధ్య ఘర్షణ లేని సంస్కృతి నేడు ఎందుకు ఛిద్రమవ్వాలి?

పర్యావరణ పరంగా కూడా పశుమాంసం ప్రమాదకరం అని ప్రచారం చేసేవారికి ఒక మనవి. పశ్చిమాసియా దేశాలతో పోలిస్తే ఇండియాలో మాంసం వినియోగం చాలా తక్కువ. ప్రపంచవ్యాప్తంగా తలసరి 41.9 కిలోగ్రాముల వినియోగం ఉంటే, అమెరికాలో 120 కిలోగ్రాములు తింటుంటే మనదేశంలో కేవలం 4.4 కిలోగ్రాములు మాత్రమే సంవత్సర కాలపు తలసరి వినియోగం. అలాగే ఇక్కడ వధకోసం, మాంసం కోసం పశుపోషణ చేయటం లేదు. వ్యవసాయం కోసం ఇతర అవసరాల కోసం చేస్తారు. పశ్చిమదేశాలలో మాంసం కోసమే పోషిస్తారు.

అసలు భారతదేశం ఎంతవరకు శాకాహారి? 2006లో జరిపిన దేశవ్యాప్త సర్వేలో సిఎన్ఎన్, ఐబిఎన్ ఇచ్చిన లెక్కల ప్రకారం కేవలం 31 శాతం మంది మాత్రమే శాకాహారులు. మెజార్టీ తరగతి ప్రజానీకం మాంసాహారులే. బ్రాహ్మణులలో కూడా 55 శాతం మందే శాకాహారులు. అలాగే 12 శాతం మంది గిరిజనులు శాకాహారులు. సముద్ర జలాలు, లేదా నదీ జలాలు అందుబాటులో లేని ప్రాంతాల్లో శాకాహారులు ఎక్కువగా ఉన్నారు. అవి ఉన్నచోట మాంసాహారులు ఎక్కువ ఉ

**"ఇప్పటికీ ఉత్తర భారతదేశం లోని అన్ని రాష్ట్రాలలో ఆవు చాలా పవిత్రమై నదిగా చూడబడుతోంది. ప్రాంతాలు, కులాలు, మతాలకు కూడా సంబంధం లేకుండాగౌరవించ బడుతోంది. అందుకే బిజెపి దానినే అస్త్రంగా తీసుకుని ప్రజలను విడగొట్టే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా ముస్లిములను టార్గెట్ చేసుకుని ప్రచారం చేస్తోంది."**

న్నారు. ఆ అధ్యయనం వలన మరోసారి ప్రకటితమైనదేమిటంటే శాకాహారము అనేది సాంస్కృతిక, భౌగోళిక పరిస్థితుల వలన వచ్చినదే కాని, మతాల వలన కాదు అని.

మరొక కోణంలో పరిశీలిస్తే, బిజెపి పెద్దఎత్తున పార్లమెంటరీ సీట్లు వచ్చినప్పటికీ, దానికి వచ్చిన ఓట్ల శాతం 31 మాత్రమే. అంత తక్కువగా ఉన్న ఓట్ల శాతం కూడా క్రమంగా తరిగిపోవడం జరుగుతోంది. నయా ఉదారవాద విధానాలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లినందుకు, ప్రజలలో ఇప్పటికే అనేక వృత్తులవారు, కార్మికులు, వ్యవసాయదారులు తీవ్రంగా నష్టపోవడం పెరిగింది. ఈ నేపథ్యం లోనే గాలిబుడగలా పేలిపోతున్నామని గ్రహించిన బిజెపి, తన అనుబంధ సంస్థలు, సంఘాల ద్వారా సున్నితమైన అంశాలు, ప్రజల మనోభావాలను రెచ్చగొట్టే విధంగా మతపరమైన అంశాలు ముందుకు తీసుకొచ్చింది. అందులో ఆవు పాత్ర కీలకం. ఇప్పటికీ ఉత్తర భారతదేశం లోని అన్ని రాష్ట్రాలలో ఆవు చాలా పవిత్రమై నదిగా చూడబడుతోంది. ప్రాంతాలు, కులాలు, మతాలకు కూడా సంబంధం లేకుండాగౌరవించ బడుతోంది. అందుకే బిజెపి దానినే అస్త్రంగా తీసుకుని ప్రజలను విడగొట్టే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా ముస్లిములను టార్గెట్ చేసుకుని ప్రచారం చేస్తోంది. అంతేకాదు ఈ రోజు దేశంలో పెరుగుతున్న "అసహనం" "ద్వేషం" అనే అంశాలకు దీనికి పోలిక తప్పని సరిగా ఉందనేది మనం గ్రహించాలి. అందువల్ల ఇటువంటి పరిస్థితుల్లో ఆవు లేదా పశు సంపద యొక్క ప్రాధాన్యత నేటి వర్తమాన పరిస్థితులో ఎలా ఉందనేది మనం అవగాహన చేసుకోవాలి.

హిందీ భాష మాట్లాడే ప్రాంతం మొత్తం కూడా చాలా సందర్భాలల్లో "గోప్రాంతం"గా పిలవబడుతోంది. ఎందుకంటే అక్కడి ఆర్థిక వ్యవస్థలో దానికున్నటువంటి ప్రాధాన్యతనుబట్టి. దాదాపు మొత్తం వ్యవసాయ రంగం దాని అనుబంధ పాడి పరిశ్రమలు అంతా ఈ పశు సంతతి మీదే ఆధారపడింది. భూమి దున్నడం, రవాణా, పాడి పరిశ్రమలన్నిటిలో వీటిదే ప్రధాన పాత్ర. కాడి ఎద్దుల ఉత్పత్తిలోనూ వాటిదే ముఖ్యపాత్ర. అందువలన ఆవు ఎప్పుడూ వ్యవసాయం మీద ఆధారపడే రైతులందరికి ముఖ్యభూమిక అయ్యింది. పశు సంపద ఉత్పత్తి, పశుపోషణ (ఆవులు, ఎద్దులు) ఇప్పటికే మొత్తం గ్రామీణ ప్రాంతంలోనూ, పట్టణ ప్రాంతం లోని కొన్ని వర్గాలకు ప్రధాన ఆర్థిక వనరుగా ఉంది. అందువలన మొత్తం పశువులు, మరీ ముఖ్యంగా ఆవులు (జన్మనిచ్చేవి కనుక) పూజించే విధంగా గౌరవించబడుతున్నాయి. అందుకే 'గోమాతా'అనే సంస్కృతి మొదలయ్యింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ పిల్లలకు ఆకర్షణీయ వచనం "గోమాతాకీ జై". అదే సందర్భంలో ఆర్యసమాజం యొక్క ప్రచారం కూడా ప్రభావం చూపి ఉండవచ్చు. ఒక వ్యక్తి తన తల్లి మీద లేదా, గోవు మీద లేదా గో సంతతి మీద ప్రమాణం చేసి చేప్పే విషయాలు నిజంగా పరిగణించబడే స్థాయిదాకా ఆ భావాలు ఎదిగాయి. విచిత్రమేమిటంటే మగపిల్లాడు పుడితే అది అదృష్టమనీ, ఆడపిల్ల పుడితే దురదృష్టమనీ భావించే ఇదే సమాజంలో పశువులలో ఆడది, అదే ఆవు లేదా గేదే పుడితే అదృష్టంగా భావించటం. కానీ ఈ పరిస్థితి కొంతకాలం తర్వాత మారిపోయాయి. వ్యవసాయరంగంలో వచ్చిన ఆధునీకరణ వలన, హరిత విప్లవం ద్వారాను, ట్రాక్టర్లు, ఇతర సాధనాలు వ్యవసాయంలో పశువుల పాత్రను గణనీయంగా తగ్గించి వేశాయి. ఈ రోజు గ్రామీణప్రాంతంలో ఎద్దులను, ఆవులను పశుసంపదగా వ్యవసాయంలో వినియోగించడం దాదాపు కనుమరుగయ్యింది. ఆవుల స్థానంలో దున్నపోతులు వచ్చాయి. ఎద్దుల స్థానంలో ట్రాక్టర్లు వచ్చాయి. ఎద్దుల స్థానంలో దున్నపోతులు ఆ పాత్రని పోషిస్తున్నాయి. (భైన్సా లేదా జోతా)లను రవాణాలో, భూమి దున్నటంలో ఉపయోగిస్తున్నారు.

హర్యానాకు చెందిన ముర్రా సంతతి గేదెలు (బర్రెలు పాల ఉత్పత్తిలో ప్రధాన వనరుగా నిలిచాయి. ఈ సంతతి దక్షిణ భారతదేశానికి కూడా తీసుకు వెళ్ళటం ద్వారా గత నాలుగైదు దశాబ్దాలుగా అనేకమంది ప్రజానీకానికి ప్రధాన ఆదాయ వనరుగా మారిపోయాయి. వ్యవసాయం గిట్టుబాటుకాని నేపథ్యంలో వీటి వినియోగం మరింత పెరిగింది. కర్నాల్ జిల్లాలో (హర్యానా) ఇటీవలనే ముర్రా భైన్సాకి 6 కోట్లు రేటు పలికినా, ఆ యజమాని వదులుకోవటానికి అంగీకరించ లేదంటే, ఈ సంతతి ప్రాధాన్యత ఆవుకన్నా ఎంత పెరిగిందో తెలియచేస్తుంది.

గత నాలుగు దశాబ్దాలకాలంలో హర్యానాలో 1966లో మొత్తం పశు సంపదలో 40.9 శాతంగా ఉన్న ఆవులు 2007 వచ్చేసరికి 14 శాతానికి పడిపోయాయి. అదే సమయంలో 50.7 శాతంగా ఉన్న బర్రెల సంతతి 79 శాతానికి పెరిగింది. దీనికి ప్రధాన కారణం ఏమిటంటే, పాల ఉత్పత్తిలో బర్రెల ఆర్థిక ప్రయోజనాలు ఎక్కువగా ఉండటం. ఆవుయొక్క సగటు పాల ఉత్పత్తి కేవలం 2.9 కేజీలు. అదే గేదె 46 లీటర్లు పాలు ఇస్తుంది.

అదే సందర్భంలో ఎవైతే సాంప్రదాయంగా దేశీయ ఆవులను పశు సంపత్తిగా వచ్చాయో, వాటిని కూడా అనేకరకాల సంకర జాతి పశువులు ఆక్రమించాయి. పేరు గాంచిన "సహీవార్ లేదా జర్సీ లేదా హోలిస్ట యాన్ ఫ్రీజర్ వంటివి వ్యాపించాయి. అందు వలన మిగిలిపోయిన ఆవుల సంతతి మరింత నిరుపయోగంగా నెట్టివేయబడింది. దేశీయ ఎద్దులతో సంగమించి సంతానాన్ని ఉత్పత్తి చేస్తున్నాయి. వాస్తవానికి ఈ కోవకు చెందిన పశు సంతతే ఈ వీధుల్లో తిరుగుతూ జీవిస్తూ, చాలా సందర్భాలలో గ్రామాల్లో పంటలను నాశనం చేస్తూ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. నిజానికి అత్యంత నిర్లక్ష్యానికి గురి అవుతున్నది ఇవే, అలాగే పూజింపబడుతున్నవి కూడా ఇవే. ఈ గోవులే ఎక్కువశాతం గోశాలల్లో ఉంచబడుతున్నాయి. కొంతమందికి మంచి ఆదాయాన్ని సమకూరుస్తున్నాయి. ప్రజలు ఇటువంటి గోశాలలకి ఉదారంగా విరాళాలు అందిస్తున్నారు. ఇటీవల కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వీటిని నెలకొల్పిన రిజిస్టర్డ్ సొసైటీలకు ఆర్థిక సహకారాన్ని ప్రకటిస్తున్నాయి. వీటి నిర్వాహకులకు ఎవరైనా డబ్బులు ఇస్తే వీధి పశువులను ఉంచుకోవటానికి అంగీకరిస్తారు. అందులో పాలిచ్చే ఆవులయితే

ఉంచుకుంటారు. ఒట్టిపోయిన వాటిని ఏ అర్ధరాత్రో వీధుల్లో వదిలేస్తారు. ఇంత జరుగుతున్నప్పటికీ, ఆ ఆవులు, ఎద్దులు విచ్చలవిడిగా వీధుల్లో తిరుగుతూ ప్రజలకి కొన్ని సందర్భాలలో ప్రాణనష్టం, గాయాలు కలుగజేస్తున్నాయి. ఎద్దులు గ్రామీణ ప్రాంతాల్లో పంటలను నాశనం చేయడమే కాకుండా, గర్భం దాల్చిన గేదెలను గాయాలపాలు చేయటం వలన గర్భస్రావాలు కూడా జరుగుతున్నాయి. కొన్ని సందర్భాలలో ఒక గ్రామానికి మరొక గ్రామానికి మధ్య తగాదాలు జరిగిన సంఘటనలు వార్తలలోకి వచ్చాయి.

ఈ విధంగా లక్షలాది ఆవులు, గేదెలు నిర్లక్ష్యానికి గురవడం వలన ఈ ప్రమాదాలు మరింత పెరిగే అవకాశముంది. వీటి మరణాల సంఖ్య పెరుగుతుంది. ఆహారంలేక, వ్యాధుల వలన, చలి వలన, యాక్సిడెంట్స్‌తో అనేకం మరణిస్తున్నాయి. అటువంటి చనిపోయిన లేదా గాయాలపాలైన ఆవులే ఈ హిందుత్వ వాదులకు, ముస్లింల మీద దళితులమీద దాడిచేయటానికి అవకాశంగా ఉన్నాయి.

ఏ కారణం లేకుండానే పశువుల మేళాలు జరపకుండా ఆపివేశారు. దీనివలన ఎవరు, ఎందుకు పశువులను రవాణా చేసినా వారిమీద దాడిచేసే సంస్కృతిని వీరు అనుసరిస్తున్నారు. హర్యానాలోని జిజ్జార్ పట్టణ పరిసరాల్లో 2002ల్లో ఐదుగురు అమాయక దళితులను ఇదేవంకతో నరికివేసిన సంగతి మనకి మదిలో మెదులుతూనే ఉంది.

"ఆలిండియా కిసాన్ సభలాంటి సంస్థలు, ఇతరులు, రైతులు కోరేమిటంటే, బజారుపాలు చేసిన ఈ పశుసంపదని సరియైన పద్ధతిలో, వైద్యంతో సంపర్కం చేయించటం వలన ఉత్తమజాతి పశువులుగా వృద్ధి చేసుకోవచ్చని, పశుమేళాలు తిరిగి పునరుద్ధరించటం ద్వారా, మిగిలిన వీధి పశువులను గోశాలలకు మళ్ళించటం ద్వారా వాటిని కాపాడుకోవటమే కాక, ఇటువంటి మతతత్త్వ శక్తులకు ఊతం లేకుండా చేయవచ్చని డిమాండు చేస్తున్నారు."



ఆహారం దొరకక ప్లాస్టిక్ సంచులను తింటున్న వీధి ఆవులు

ఆలిండియా కిసాన్ సభలాంటి సంస్థలు, ఇతరులు, రైతులు కోరేమిటంటే, బజారుపాలు చేసిన ఈ పశుసంపదని సరియైన పద్ధతిలో, వైద్యంతో సంపర్కం చేయించటం వలన ఉత్తమజాతి పశువులుగా వృద్ధి చేసుకోవచ్చని, పశుమేళాలు తిరిగి పునరుద్ధరించటం ద్వారా, మిగిలిన వీధి పశువులను గోశాలలకు మళ్ళించటం ద్వారా వాటిని కాపాడుకోవటమే కాక, ఇటువంటి మతతత్త్వ శక్తులకు ఊతం లేకుండా చేయవచ్చని డిమాండు చేస్తున్నారు. కానిబి.జె.పి. అధికారంలోకి వచ్చిన తరువాత ఈ సమస్యని ఏవిధంగా వాడుకుంటుందో అందరికీ తెలుసు. హర్యానా ప్రభుత్వం గోవధ మీద చట్టం తేవటమే కాక, గోశాలలు నిర్మించి గోవులను కాపాడే వారికి గ్రామాల్లో ఉన్న ఉమ్మడి భూములను అప్పగిస్తామని ప్రకటించింది. దీనిని అడ్డం పెట్టుకొని, స్వచ్ఛంద సంస్థల ముసుగులో కొంత మంది ఆర్.ఎస్.ఎస్. సంబంధీకులు, భూకబ్జాదారులు ఇప్పటికే గ్రామాల్లో ఉమ్మడి భూముల్ని కాజేయటానికి సిద్ధమయ్యారు. మనం ఇక్కడ గుర్తు చేసుకోవాల్సిన అంశం ఏమిటంటే, గ్రామంలోని భూమిలేని నిరుపేదలైన షెడ్యూల్డ్ కులాల ప్రజలకి ఈ ఉమ్మడి భూమిలో మూడింట ఒక వంతు వాటా ఉంటుందని, వారు వ్యవసాయం నిమిత్తం లేదా గృహం నిమిత్తం వాటిని వాడుకోవచ్చన్న సంగతి. అంటే భూముల్లోంచి కూడా వారిని వెళ్ళగొట్టడమే చట్టం ప్రధాన లక్ష్యం.

ఎంతకాలమయితే ఈ నిర్భాగ్యులైన ఆవులు, ఎద్దులు పట్టణాల్లో, గ్రామాల్లో, వీధుల్లో తిరుగుతూ, నిర్లక్ష్యానికి గురవుతూ మనం పడవేసిన పాలిథిన్ కవర్లు, కుళ్ళగొట్టే వ్యర్థ పదార్థాలు తింటూ జీవిస్తుంటాయో, అంత కాలమూ ఈ హిందుత్వ శక్తులు వాటిని వాయిధాలుగా చేసుకొని విద్వేషాలు రగిలిస్తూనే ఉంటారు. ఒకసారి కనుక వాటి సంతాన ప్రగతిని శాస్త్రీయ పద్ధతులలో అరికట్టే ప్రయత్నం చేయటం ద్వారా, సంకరజాతిని పెంపొందించటం ద్వారా, మరిన్ని గోశాలలు నిర్మించటం ద్వారా, ఈ హిందుత్వ శక్తులకు అవకాశం లేకుండా చేయొచ్చు. సమాజ ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన పాత్ర పోషించిన ఆవులు, సంతానోత్పత్తి కూడా కలిగి ఉండటంతో గోమాతగా పూజింపబడింది. అందుచేత వేదాల కాలంలో చెప్పబడినట్లుగా పశుమాంసం, ముఖ్యంగా ఆవుమాంసం అందరూ తినేవారనే సంగతి ప్రస్తుతం ప్రక్కన పెట్టినా, ఆర్థిక వ్యవస్థలో తనవంతు పాత్ర పోషించిన పశుసంతతిని ఈ రోజు మత విద్వేషాలు రెచ్చగొట్టటానికి, ప్రజలను ముక్కలు చేయటానికి వినియోగించటం హిందుత్వ శక్తులకు తగని పని. నిజంగా వారికి గోమాత అంత పవిత్రమైనదైతే, వాటికి ఈ దుస్థితి రాకుండా ఉండేది. కేవలం తమ ఎజెండాను అమలు చేయటం కోసం, హిందువులను,ముస్లిములకు వ్యతిరేకంగా ఏకీకరణ చేయటం కోసం పావుగా వాడుకుంటున్నారు. అందుకేనేమో బీహార్ ప్రజానీకం అందరూ కలిసి (హిందువులు, ముస్లిములు, క్రిస్టియన్లు) వారిని చాపచుట్టి విసిరిపారేశారు.

అనువాదం-సంకలనం

**ఎల్.ఎస్. భారవి**

సామాజిక న్యాయం

# రిజర్వేషన్ల అమలులో మొండిచేయి

కంచల జయరాజ్



రచయిత 10 టీవీ విజయవాడ రీజనల్ కో–ఆర్డినేటర్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 125వ జయంతి అన్ని పార్టీలు ఘనంగా నిర్వహించే ప్రయత్నంలో ముందుకు వెళుతున్నాయి. దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు బలపడుతున్నాయి. అటు దేశం లోనూ, ఇటు ఆయా రాష్ట్రాల్లోనూ ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతోంది. కులాలు, మతాల వారీగా దేశం విడిపోయి అల్లకల్లోలమైన పరి పాలన సాగుతోంది. అంబేద్కర్ 125వ జయం తోత్సవాలను పురస్కరించుకొని రాజకీయపరమైన ప్రయోజనాలను పొందటానికి ఆయా పార్టీలు పోటీపడి పడుతున్నాయి. కానీ, ఆయన ప్రతి పాదించి రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వే షన్లు మాత్రం కాలరాసేందుకు కుటిలయత్నాలు సాగుతున్నాయి. వివిధ రంగాల్లో ఉన్న అట్టడుగు వర్గాల రిజర్వేషన్లు తొలగించాలనే బలమైన డిమాండ్ ను తెరమీదకు తీసుకొచ్చి వివాదం చేసి కులాల వైషమ్యాలను మరింతగా రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. రిజర్వేషన్లను తొలగిం చాలని, ఉద్యమాలను నిర్వహించే ముఠాలు సిద్ధమయ్యాయి. ఈ దేశంలో కులం ప్రాతిపది కనే అన్ని అంశాలు కొనసాగుతున్నాయి. ఆర్థిక అసమానతలకంటే కులసరమైన వివక్షే తీవ్రంగా ఉంది. ఈ పరిస్థితుల్లో రాజ్యాంగ నిపుణులు ముందుచూపుతో అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం పొందుపరిచిన రిజర్వేషన్లను రద్దు చేయా లనే ఉద్యమానికి తెరవెనుక కొన్ని రాజకీయ శక్తులు ప్రోత్సహకాలు అందిస్తూ బలపరుస్తు న్నాయి. ఈ పరిస్థితుల్లో మరో వైపు ప్రైవేట్ రంగలో రిజర్వేషన్లు కావాలనే ఉద్యమాలూ పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వరంగ సంస్థల్లో అరకొరగా అమలవుతున్న రిజర్వేషన్ల ప్రక్రియను సమీక్షించటంకాని, జరుగుతున్న అవకతవకలను నిరోధించటం కాని చేయటంలో మన పాలకులు తీవ్రంగా విఫలం చెందారనే చెప్పొచ్చు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం ఉద్యమం రోజు రోజుకూ బలం పుంజు కుంటోంది. ప్రభుత్వ రంగంలో ఉన్న అన్నివ్యవ స్థల్లో రాజ్యాంగం కల్పించిన నిర్దిష్ట రిజర్వేషన్లను పటిష్టంగా అమలు చేయటం, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల ప్రక్రియను ఆరంభించటం కోసం ఉద్యమాలు బలపడుతున్నాయి.

**శతాబ్ద కాలం నుంచే రిజర్వేషన్లు**


సామాజిక, ఆర్థిక, వెనుకబాటుతనాన్ని గుర్తించి రిజర్వేషన్ల విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. కులం, మతం ప్రాతిపదికన విద్యా, ఉపాధి, ఉద్యోగావకాశాలలో వెనుకబడి ఉన్న వర్గాలకు రిజర్వేన్లు కల్పించి ముందుకు తీసుకెళ్ళటం కోసం ఏర్పాటు చేసిందే రిజర్వేషన్ల ప్రక్రియ. బ్రిటీష్ పాలనా కాలం నుంచి విద్య, ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. స్వాతంత్ర్యానంతరం విద్య, ఉద్యోగావకాశాల్లో ఎస్సీ, ఎస్టీలతో సహా ఇతర వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లను అమలు పరిచారు. చట్ట సభల్లో ఎస్సీ, ఎస్టీలకు స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ లతో పాటు వెనుకబడిన వర్గాలు, మహిళలకు కొన్ని స్థానాలు ప్రత్యేకంగా కేటాయించారు. రాజ్యాంగంలోని 73,74 సవరణల తర్వాత పంచాయితీరాజ్, నగరపాలక సంస్థలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కేటాయించి సీట్ల పంపకం చేస్తున్నారు. స్వాతం త్ర్యం పూర్వం కూడా భారతదేశంలో వివిధ సామాజిక వర్గాలకు రిజర్వేన్లు కల్పించిన ఘనత ఉంది. మన దేశంలో రిజర్వేషన్ల ప్రక్రియకు శతాబ్దానికిపైగానే చరిత్ర ఉంది. దేశానికి స్వాతంత్ర్యం రాకముందునుంచే రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. 1882లో మహారాష్ట్రలో జ్యోతీరావుపూలే ప్రజలందరికీ ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యనం దించాలని, బలహీన వర్గాల జనాభా ప్రాతి పదికగా ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించాలని, వారి ప్రాతినిధ్యం పెంచాలనే డిమాండ్ చేశారు. ఈ మేరకు హంటర్ కమీషన్ కు విజ్ఞాపన కూడా చేశారు. రాజరికపు వ్యవస్థలోని పలు రాష్ట్రాలు వివిధ సామాజిక వర్గాలకు రిజర్వేషన్ల సదుపాయాలు స్వాతంత్ర్యా నికి పూర్వమే కల్పించాయి. మహారాష్ట్రంలోని కొల్హాపూర్‌లో స్థానిక పరిపాలనలో వెనుక బడిన తరగతుల ప్రాతినిధ్యాన్ని పెంచడానికి, వారిలో పేదరికాన్ని తొలగించేందుకు 1902లో రిజర్వేషన్లు కల్పించారు. కొల్హాపూర్ మహారాజు అప్పుడు విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం వెనుకబడిన వర్గాల ప్రజలకు స్థానిక ఉద్యోగా లలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించారు. దేశంలో బలహీన వర్గాల ప్రయోజనాల కోసం మొదటిసారిగా రిజర్వేషన్లు అమలు చేసిందే కొల్హాపూర్‌లోనే. తర్వాత బరోడా, మైసూర్ రాజ్యాలలో కూడా రిజర్వేన్లు అమల్లోకి వచ్చాయి. అయితే రిజర్వేషన్ల అనుకూల, వ్యతిరేక ఉద్యమాలు బలపడ్డాయి. 1891 నుంచి ఈ ఉద్యమాలు జరుగుతున్నాయి. అప్పట్లో ట్రావెన్ కోర్ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలు స్థానికులకే కల్పించాలని, అర్హులైన స్థానికులున్నప్పటికీ, స్థానికేతరులకు ఉద్యోగాన్ని కట్టబెట్టడాన్ని నిరసిస్తూ ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. 1908 లో పరిపాలనలో ప్రాతినిధ్యం తక్కువగా ఉన్న కులాలు, సమాజాలకు ప్రభుత్వ ఉద్యోగా లలో బ్రిటీష్ ప్రభుత్వం రిజర్వేషన్లను అమలు చేసింది. 1909 భారత ప్రభుత్వ చట్టం ప్రకా రం రిజర్వేషన్లు అమలు జరిగాయి. 1921 లో మద్రాసు ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లను కలిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది.

బ్రాహ్మణేతరులకు ఉద్యోగావకాశాలలో 44%, బ్రాహ్మణులకు 16 శాతం, ఆంగ్లో ఇండియన్లు, క్రిస్టియన్లకు కల్పించారు. బ్రిటిష్ ప్రభుత్వం 1925 లో ప్రభుత్వ ఉద్యోగాలలో మైనార్టీలకు కొంత శాతం ఉద్యోగాలను రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది. 1934 లో మరో ఉత్తర్వు జారీ చేస్తూ ప్రభుత్వం నేరుగా నియామకం చేసే ఉద్యోగాలలో 25 శాతం ముస్లింలకు, 8 1/3 శాతం ఇతర మైనార్టీలకు రిజర్వ్ చేసింది. అయితే, ప్రభుత్వం బలహీన వర్గాలకు కూడా రిజర్వేషన్ సూత్రాన్ని వర్తింపచేయాలన్న డిమాండ్‌ను అంగీకరించింది. కానీ అమలు చేయటానికి మాత్రం వెనుకాడింది. బలహీనవర్గాలకు రిజర్వేషన్ల వల్ల ఉపయోగం ఉందని అప్పటి ప్రభుత్వం భావించటమే దీనికి కారణం. రిజర్వేషన్లను మతం ప్రాతిపదికన మైనార్టీ వర్గానికే పరిమితం చేసింది. తర్వాత కాలంలో ప్రభుత్వ వైఖరిలో వచ్చిన మార్పు ఫలితంగా 1943 లో ప్రభుత్వం మరో ఉత్తర్వును జారీ చేసింది. దీని ప్రకారం నేరుగా నియమించే ఉద్యోగాలలో షెడ్యూల్ కులాల వారికి 8.5 శాతం రిజర్వేషన్ కల్పించింది. అయితే అప్పట్లో మొత్తం జనాభాలో షెడ్యూల్ కులాల జనాభా 12.75 శాతంగా ఉండేది. 1976 జూన్ నాటికి ఈ రిజర్వేషన్‌ను 12.5 శాతానికి ప్రభుత్వం పెంచింది. ఈ సమయంలో గిరిజనులకు మాత్రం రిజర్వేషన్లను ప్రకటించలేదు. స్వాతంత్ర్యానంతరం మన రాజ్యాంగ నిపుణులు రిజర్వేషన్ల ఆవశ్యాన్ని గుర్తించారు. ఆయా వర్గాలకు కల్పించే రిజర్వేషన్లను చట్టబద్ధం చేశారు. రాజ్యాంగాన్ని రచించటానికి ముందు రాజ్యంగ సభ కూడా రిజర్వేషన్లపై సుదీర్ఘంగా చర్చించింది. ఆంగ్లో ఇండియన్లకు తప్ప మరేయితర మైనార్టీలకు రిజర్వేషన్లు అవసరం లేదని రాజ్యంగ సభ అభిప్రాయ పడింది. అప్పట్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల అవసరమనే ప్రతిపాదన ఏకగ్రీవంగా ఆమోదిం చింది. వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పిం చాలనే విషయంలో వాదోపవాదాలు జరిగా యి. 1942 లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలిం డియా డిప్రెస్ట్ క్లాసెస్ ఫెడరేషన్ ను ఏర్పాటుచేసి షెడ్యూల్ కులాల వారికి ఉద్యోగ, విద్యావ కాశాలలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. 1946 లో కేబినేట్ మిషన్ వివిధ సిఫార్సులతో సహా నైష్పత్తిక ప్రాతినిధ్యం ప్రకారంరిజర్వేషన్లు కల్పించాలని సూచించింది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నూతన రాజ్యాంగంలోని సమానత్వ సూత్రాలకు ఆర్టికల్ 51(1) కుల ప్రాతిపదిక రిజర్వేషన్లు ఇవ్వటం వ్యతిరేకమని కొందరు కోర్టుకెళ్లారు. రిజర్వేషన్లు రాజ్యంగంలోని సమాన సూత్రాలకు వ్యతిరేకమని దొరై రాజన్ కేసులో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అప్పుడు పార్లమెంట్ మొదటి రాజ్యంగ సవరణ చేపట్టి 1951లో ఆర్టికల్ 15 కు క్లాజ్-4 ను చేర్చింది. ప్రభుత్వం సామాజి కంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించొచ్చని పేర్కొంది. ఆర్టికల్ 16(4) ప్రకారం ఉద్యోగాలు, పదవుల్లో తగిన ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పిస్తే దానికి రాజ్యాంగం ఆటంకం కాదని పేర్కింది. దీని ప్రకారం దేశంలో కేంద్ర స్థాయిలో విద్య, ఉద్యోగ రంగాల్లో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5శాతం, ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలవు తున్నాయి. రిజర్వేసన్ల అమలు ప్రక్రియ వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగాల్లో 80 శాతం రిజర్వేషన్లు అమలవుతోంది. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు 25 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6శాతం, ముస్లింలలో వెనుకబడిన తరగతులకు 4శాతం రిజర్వేషన్లు కల్పించారు. అయితే రిజర్వేషన్లు అమలు చేసే విషయంలో ఆయా రాష్ట్రాలు అనేక విధాల అవాంతరాలు కల్పిస్తున్నాయి. చట్టపరంగా ఉన్న అవకాశాలను అమలు చేసే విషయంలో అనేక రకాలుగా వివక్ష కొనసాగుతోంది. రాజ్యంగ కల్పించిన రిజర్వేషన్ హక్కును అనుభవించే విషయంలో ఇప్పటికీ పూర్తిస్థాయి పారదర్శకత లేకుండాపోతోంది. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఈ విధానం అస్త వ్యవస్తంగా తయారైంది. ప్రతిభ ఉన్న వ్యక్తులను కూడా రిజర్వేషన్ కేటగిరిలో కలిపి రిజర్వేషన్ కోటా పూర్తయిందని చూపుతూ అన్యాయం చేస్తున్న సంఘటనలే ఎక్కువగా ఉంటున్నాయి. దీన్ని ప్రశ్నించేవారు కాని, అమలు చేయమని ఒత్తిడి తెచ్చేవారు కాని కీలకమైన స్థానాల్లో లేకపోవటమే ప్రధానమైన ఆటంకం, ఫలితంగా శతాబ్దంకాలంగా రిజర్వేషన్ల అమలు జరుగుతున్నా ఇప్పటికీ ఆయా వర్గాల్లో వచ్చిన అభివృద్ధి, చైతన్యం నామమాత్రంగానే ఉంది.

రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమాలు బలపడుతున్న నేపథ్యంలో ప్రైవేట్ రంగాల్లో కూడా రిజర్వేషన్లు కావాలనే పోరాటాలు ఊపందుకుంటున్నాయి. కులం ప్రాతిపదికన జరుగుతున్న ఈ వ్యవహారం రాబోయే రోజుల్లో సామాజిక సమస్యగా మారే ప్రమాదం ఉంది. రిజర్వేషన్ల

**"1942 లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలిం డియా డిప్రెస్ట్ క్లాసెస్ ఫెడరేషన్ ను ఏర్పాటుచేసి షెడ్యూల్ కులాల వారికి ఉద్యోగ, విద్యావ కాశాలలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. 1946 లో కేబినేట్ మిషన్ వివిధ సిఫార్సులతో సహా నైష్పత్తిక ప్రాతినిధ్యం ప్రకారంరిజర్వేషన్లు కల్పించాలని సూచించింది."**


మొదటగా రిజర్వేషన్లను డిమాండ్ చేసిన
జ్యోతిరావు పూలే


రాజ్యాంగ నిర్మాత
డా॥ బి.ఆర్. అంబేడ్కర్

> **❝ దేశంలో 4.4 కోట్ల కుటుంబాలు దళితులున్నారు. వీరిలో ఇప్పటికీ 20 శాతం కుటుంబాలకు గృహ వసతిలేదు. 56 శాతం నాసిరకం ఇళ్లలోనే కాలం వెల్లదీస్తు న్నారు. 55 శాతం కుటుంబాలు ఒకే ఒక్క గదిలో జీవిస్తున్నారు. 70 శాతం కుటుంబాలకు నీటిసౌకర్యం లేకుండా పోయింది. 89.45 శాతం కుటుంబాలు మురికివాడల్లోనే జీవనం సాగిస్తున్నాయి. ❞**

ప్రక్రియను వ్యతిరేకించేవారు నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ గురించి అనాధిగా అణచివేతకు గురైన నిమ్న వర్గాల గురించి ఆలోచించాల్సిన అవ సరం ఉంది. పాలకులు, ప్రభుత్వాలు మారు తున్నా విధానాలు మాత్రం ఒకే విధంగా ఉ ంటున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల జీవన విధానంలో గాని, ఆర్థిక వెసులుబాటులో గాని ఏ మాత్రం పురోగతిలేదు. దీనికి ఆయా ప్రభు త్వాలు అమలు చేస్తున్న విధానాలే ప్రధానమైన కారణంగా పేర్కొనవచ్చు. దేశంలో 4.4 కోట్ల కుటుంబాలు దళితులున్నారు. వీరిలో ఇప్పటికీ 20 శాతం కుటుంబాలకు గృహ వసతిలేదు. 56 శాతం నాసిరకం ఇళ్లలోనే కాలం వెల్లదీస్తు న్నారు. 55 శాతం కుటుంబాలు ఒకే ఒక్క గదిలో జీవిస్తున్నారు. 70 శాతం కుటుంబాలకు నీటిసౌకర్యం లేకుండా పోయింది. 89.45 శాతం కుటుంబాలు మురికివాడల్లోనే జీవనం సాగిస్తున్నాయి. 60 శాతం కుటుంబాలకు సొంత భూమిలేదు. కార్పొరేట్ రంగంలో ఉన్న వెయ్యి కంపెనీల్లో 93 శాతం కంపెనీలు అగ్రకులాల చేతుల్లోనే ఉన్నాయి. 7శాతం కంపెనీలు మాత్రమే ఎస్సీ, ఎస్టీలు నిర్వహిస్తున్నారు. దేశ జనాభా లో 2.34 కోట్ల ఎస్టీ కుటుంబాలు ఉంటే వాటిల్లో మంచినీరు, విద్యుత్, మరుగుదొడ్లు ఉన్న కుటుంబాటు ఒక శాతం మాత్రమే 2.6 శాతం గ్రామీణ ఆదివాసీ కుటుంబాలకు ఇంట్లో ఒంటగది, కిరోసిన్, ఎల్పీజీ, బయోగ్యాస్ వం టివి మాత్రమే అందుబాటులో ఉన్నాయి. బీసీ కులాల్లో చేతి వృత్తులన్నీ దెబ్బతిన్నాయి. వారి జీవన విధానం పూర్తిగా పక్కదారి పట్టింది. సరళీకరణ ఆర్థిక విధానాల ఫలితంగా బీసీల జీవనాధారం లేకుండాపోయింది. ఎక్కువ మంది బీసీలు దారిద్ర్య రేఖకు దిగువగానే ఉన్నారు. జనాభాలో 62 శాతం కన్న ఎక్కువమంది దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నారనేది సర్వే. అందులో 70 శాతం మంది వ్యవసాయ రంగాన్ని ఆధారం చేసుకొని జీవిస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. మైనార్టీల విషయానికొస్తే వారి పరిస్థితి ఏ మాత్రం ఆశాజనకంగా లేదు. వారికి కేటాయించిన నామ మాత్రపు రిజర్వేషన్లకు కూడా అనేక అవాంత రాలు వచ్చిపడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను పటిష్టంగా అమలు చేయాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వే షన్లు కల్పించాలనే ఉద్యమం బలపడుతుంది.

**ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు ఎందుకు?**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలు, వ్యక్తులను ప్రోత్సహించటానికి అనేక రాయితీలను కల్పిస్తున్నాయి. విదేశీ కంపెనీలను సాదరంగా ఆహ్వానించి వారికి అడక్కుండానే అన్నీ కల్పించిపెడుతున్నాయి. స్వదేశంలో ఉ న్న కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్ వేసి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ధారాదత్తం చేస్తు న్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేట్ సంస్థలను, వ్యక్తుల్ని బలపరుస్తు న్నాయి. కోట్లాది రూపాయల భూముల్ని ధారా దత్తం చేస్తున్నాయి. రాజధాని నిర్మాణం నుంచి చిన్న పనుల వరకూ ప్రైవేట్ సంస్థలు, విదేశీ వ్యక్తులకే సంతర్పణం చేయటానికి ప్రభుత్వాలు పూనుకుంటున్నాయి. రాజ్యాంగం కల్పించిన హక్కులను, రిజర్వేషన్లకు తిలోదకాలు ఇవ్వ డంలో భాగంగానే ప్రభుత్వ రంగ సంస్థల్ని నిర్వీర్యం చేస్తున్నట్టుగా పేర్కొనవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రైవేట్ రంగం బలపడుతున్నది. వాటిల్లో రిజర్వేషన్ల కోసం ఉద్యమాలు ఆరంభ మయ్యాయి. ప్రైవేట్ రంగంలో పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు స్థాపించే సంస్థల్లో 90శాతం పెట్టుబడులు ప్రభుత్వరంగంలోని బ్యాంకులు, సంస్థల్లో 90 శాతం పెట్టుబడులు ప్రభుత్వ రంగంలోని బ్యాంకులు, సంస్థల నుంచే తీసుకుంటున్నాయి. గత ఐదేళ్లలో ప్రైవేట్ రంగంలోని వ్యాపారస్తులకు ఇచ్చిన రుణాలు 1.06 కోట్లు మొండిబకాయిలను ప్రభుత్వ రంగ బ్యాంకులు రద్దు చేశాయి. 2014 డిసెంబర్ 24 న ఆర్థికశాఖ సహాయ మంత్రి జయంత్ షా రాతపూర్వకంగా ఈ విషయాన్ని రాజ్యసభలో తెలిపారు. ఇవి కాకుండా 34 వేల కోట్ల రూపాయలు మొండి బకాయిలుగా పేరుకుపోయి ఉన్నాయి. ప్రభుత్వం నుంచి భూములు, రవాణా సదుపాయాలు, తంతి, తపాలా,విద్యుత్ శక్తి, నీరు, జాతీయ రహదారులు వంటి మౌలిక సదుపాయాలు వినియోగించే ప్రైవేట్ కంపెనీల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని పార్లమెంట్ నియమించిన అఖిలపక్ష కమిటీ 2012 నవం బర్ లోనే సిఫారుసు చేసింది. అయినా వీటిని ఆయా ప్రభుత్వాలు కాని, ప్రైవేట్ కంపెనీలు కాని ఏ మాత్రం పట్టించుకోలేదు. రిజర్వేషన్ల వల్ల ప్రతిభ, సామర్థ్యం లేనివారు విద్యా, ఉ ద్యోగ రంగాల్లో ప్రవేశిస్తారని, దీనివల్ల దేశం పురోగతి సాధించదనే వాదన తీసుకొస్తున్నారు. అయితే, దీన్ని ఖండించేవారు కూడా ఉన్నారు. రిజర్వేషన్లు కుల ప్రాతిపదికన కాకుండా ఆర్థిక అంశాలను ప్రామాణికంగా తీసుకొని అమలు చేయాలనే చర్చను కూడా లేవనెత్తుతున్నారు. అయితే కులంలో ఉన్నంత వివక్ష ఆర్థిక అంశాల్లో కన్పించదు. కులాన్ని నిర్మూలించడం అనేది సాధ్యమయ్యే పనికూడా కాదు. దీనికోసం ప్రభుత్వాలు చేసే ప్రకటనలు ఉన్న చట్టాలు కుల వివక్షత లేకుండా చేయడానికి ఏ మాత్రం ఉ పకరించడంలేదు. ఫలితంగానే ప్రభుత్వ రంగాల్లో ఉన్న రిజర్వేషన్లను న్యాయబద్ధంగా అమలు చేయటం, ప్రైవేట్ రంగాల్లో రిజ ర్వేషన్లను ప్రారంభించటం అనే డిమాండ్ బలపడుతోంది. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల డిమాండ్ ను అధ్య యనం చేసి నివేదిక ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్ మాధవ మీనన్ కమిటీని నియమిం చింది. ఈ కమిటీ నివేదికతో నమూనా చట్టాన్ని కూడా ప్రభుత్వానికి అందజేసింది. అయినా ప్రభుత్వం ఇంతవరకు ఈ మోడల్ చట్టాన్ని చర్చకు పెట్టలేదు. ఈ విషయం గురించి ఎక్కడా ప్రస్తావించట్లేదు. ప్రైవేట్ రంగంలో రిజర్వేసన్ల అమలు అనేది ఏ ప్రభుత్వానికి ఇష్టంలేదని దీన్ని బట్టి అర్థమవుతుంది. అయితే రాబోయే రోజుల్లో ఉద్యమాలు తీవ్రమవుతాయి. 2019 ఎన్నికల నాటికి ప్రైవేట్ రంగంలో రిజర్వేసన్లు అమలు చేసి తీరాల్సిన ఆవశ్యకత ఏర్పడే సూచనలే ఎక్కువగా ఉన్నాయి. పోరాడి సాధించుకోవ డానికే బడుగు, బలహీన వర్గాలు నిర్ణయించు కున్నారు. ఈ పోరాటాల క్రమంలో పాలకులు మెట్టు దిగిరాక తప్పదు. ❋

# మోడీ సిలికాన్ పర్యటన: డిజిటల్ ఇండియా

డిబెన్ దాస్

ప్రపంచ ప్రఖ్యాత శాస్త్ర సాంకేతిక కేంద్రమైన సిలికాన్ వ్యాలీలో మోడీ పర్యటన, ఆ సందర్భంగా ఆయన ఐటి దిగ్గజాలైన గుగుల్, మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్ కంపెనీల ప్రతినిధులను కలవడం లాంటి అంశాలకు మీడియా విపరీతమైన ప్రచారహోరును కల్పించింది. ఈ పర్యటనతోనే మోడీ భారతదేశ శాస్త్రసాంకేతిక పురోగతిని ఉన్నత సోపానాలనెక్కించినట్లు కార్పొరేట్ మీడియా చిత్రీకరించింది. భవిష్యత్తులో భారతీయులు మరిన్ని స్మార్ట్ ఫోన్లు, అత్యధిక సాంకేతిక పరిజ్ఞానం గల కార్లు, పరికరాలు వాడగలగడంలో సందేహం లేదు. దీనర్థం భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగంలో పురోగతిని సాధించినట్లు కాదు. ఈ అత్యాధునిక సాంకేతిక ఉత్పత్తులలో సాఫ్ట్‌వేర్ మరియు హార్డ్‌వేర్ రెండూ కలిపి భారత్‌లో తయారవుతున్న ఉత్పత్తులు ఎన్ని అన్నదే ఇక్కడ ప్రశ్న. అవి దాదాపుగా ఏమీ లేవన్నది తక్షణ సమాధానం. ఈ దిశలో మోడీ పర్యటన వల్ల కించిత్తు ప్రయోజనం కూడా కలగటం లేదు.

సిలికాన్ వ్యాలీగా పిలువబడే అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో దక్షిణ భాగం, ప్రపంచంలోనే అతిపెద్ద అత్యాధునిక సాంకేతిక కార్పొరేషన్లకు పుట్టినిల్లుగా ప్రసిద్ధి చెందింది. అత్యధిక సంఖ్యలో పేరుగాంచిన సిలికాన్ చిప్ ఆవిష్కర్తలు, తయారీదార్ల ప్రాముఖ్యతతోనే ఆ ప్రాంతం సిలికాన్ వ్యాలీగా పేరుగాంచింది. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల కృషితో ఆవిష్కృతమైన నూతన ఉత్పత్తులు, వెంచర్ పెట్టుబడులు, అమెరికా రక్షణశాఖ వ్యయాలు లాంటి అనేక అంశాలు కలగలిపి ఆ ప్రాంత ఉద్భావనకు కారణాలయ్యాయి. వేలాది శాస్త్ర, సాంకేతిక అంకుర పరిశ్రమలు ప్రపంచంలో నూతన ఆవిష్కరణలకు పురుడు పోసుకొని అక్కడి నుండే తమ ప్రయాణాన్ని మొదలెట్టాయి. ప్రపంచంలో అత్యాధునిక సాంకేతిక శ్రమజీవులు అత్యధికంగా కేంద్రీకరింపబడిన ప్రాంతం ఇదేనేమో! మోడీ తన ఉపన్యాసాన్ని శ్రోతలను దృష్టిలో ఉంచుకొని మాట్లాడతారన్న అంశం సిలికాన్ వ్యాలీలో ఆయన చేసిన ప్రసంగాన్ని బట్టి విదితమౌతుంది. సాంకేతిక మేధావులు హాజరైన ఆ సమావేశంలో ఆయన తనుగాని, తన పార్టీగాని, ఆర్‌ఎస్‌ఎస్‌గాని సామాన్యంగా బహిరంగ సభల్లో మాట్లాడుతున్నట్లు మాట్లాడలేకపోయారు. ఉదాహరణకు జనవరి 3, 2014లో తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అహమ్మదాబాద్‌లో జరిగిన గ్లోబల్ హెల్త్ కేర్ సమిట్ ప్రారంభోత్సవ సమయంలో ప్రస్తావించిన అంశాలను మోడీ ఇక్కడ ప్రస్తావించలేదు. ఆయన ఇక్కడ ఇలా చెప్పారు. “మనం వినాయకుడిని పూజిస్తుంటాం. వినాయకుడి కాలంలో మనిషి దేహానికి ఏనుగు తలను అతికించగల ప్లాస్టిక్ సర్జన్, తన వృత్తిని నిర్వహిస్తూ ఉండి తీరాలి. కర్ణుడు తన తల్లి ఉదరం నుండి జన్మించలేదని మహాభారతం చెబుతుంది. అంటే జన్యుశాస్త్రం ఆ కాలానికి అభివృద్ధి అయ్యిందని అర్థం.’ విశ్వవ్యాప్తంగా శాస్త్ర సాంకేతిక రంగాలు సాధించిన పురోగతిని అపహాస్యం చేస్తూ, మోడీ బృందం ఈ శాస్త్ర సాంకేతిక పురోగతి వేదకాలం నాడే ఉందని నమ్మబలుకుతున్నారు. అందుకోసమే తమ ప్రభుత్వం వేదశాస్త్రం, జ్యోతిష్య శాస్త్రాల అభివృద్ధికి నిధులను సమకూరుస్తుందని సమర్థించుకున్నారు.

కాని సిలికాన్ వ్యాలీలో చేసిన ప్రసంగంలో మోడీ ఈ అంశాలను ఏమీ ప్రస్తావించలేదు. వేదకాలంనాటి శాస్త్ర సాంకేతిక పురోగమనంతో పోల్చుకుంటే, ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగం సాధించలేని ఆవిష్కరణలుగా వీటిని ప్రస్తావించలేకపోయారు. దానికి బదులు ఆయన ఇలా అన్నారు. “నూతన ఆలోచనలు ఇక్కడే (సిలికాన్ వ్యాలీలో) తొలి వెలుగును చూడగలి గాయి.’’ ఒకపక్క, చరిత్రను వక్రీకరిస్తూ, పుక్కిటి పురాణాలను వాస్తవాలుగా చిత్రీకరిస్తూ, ప్రజల్లో మత ఛాందసాలను రెచ్చగొడుతూ, వేద కాలాన్ని కీర్తిస్తూ మోడీ తన దేశ ప్రజల చైతన్యస్థాయిని పురాతన కాలానికి చేర్చదలిచారు. మరోప్రక్క, అత్యాధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రజా సమూహాల్ని సులువుగాచేరుకోగలగ డంలో దాని ప్రాధాన్యతను గూర్చి ఆయన ప్రస్తుతిస్తారు.

**మౌలికరంగ ఆవశ్యకత**

మోడీ తన ప్రసంగంలో భారతదేశాన్ని డిజిటలైజ్ చేయడంలో తన దార్శనికతను వ్యక్తపరిచారు. “123 కోట్ల నా దేశ పౌరులు డిజిటల్‌గా అనుసంధించబడాలని నేను కోరుతున్నాను” భారతదేశంలో 25 కోట్ల మంది ప్రజలు ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్నారు. భారత జనాభాతో పోల్చుకుంటే దేశంలో ఇంటర్నెట్ వినియోగం తక్కువైనప్పటికీ (10 శాతం) సంఖ్యాపరంగా చూసే అది అత్యధికంగా ఉంది. ప్రపంచ దేశాల ఇంటర్నెట్ వినియోగంలో చైనా, అమెరికా తర్వాత భారతదేశం మూడవ స్థానంలో ఉంది. చైనాలో 64 కోట్ల ప్రజలు ఇంటర్నెట్ వినియోగిస్తూ, వాళ్ళ జనాభాలో 46 శాతంగా ఉన్నారు. ప్రపంచ దేశాల మొబైల్ ఫోన్ల వినియోగంలో భారతదేశం, చైనా తర్వాత రెండవ స్థానంలో ఉంది. 125 కోట్ల భారతీయులలో 96 కోట్ల మంది పిడికిళ్ళలో మొబైల్ ఫోన్లు ఉండగా, 137 కోట్ల చైనీయులలో 127 కోట్ల మంది పిడికిళ్ళలో మొబైల్ ఫోన్లు ఉన్నాయి. భారతదేశంలో ప్రతివారికి మొబైల్ ఫోన్, ఇంటర్నెట్ కనెక్షన్ అందుబాటులోకి తేవాలంటే, మొదటగా మనకు దేశవ్యాప్తంగా విస్తరింపబడ్డ ఫైబర్ ఆప్టిక్ సమాహారం, ఫోన్లను అనుసరించడానికి కొన్ని టవర్లు లాంటి మౌలిక సదుపాయాలు కావాలి. ఈ సమాహారం సాధారణ రవాణా వ్యవస్థను పోలి ఉంటుంది. మన దేశంలో హైవేలు, రోడ్లు, రైల్వే లైన్లు లాంటి వాటిద్వారా బస్సులు, కార్లు, ట్రక్కులు, రైళ్ళు, వాహనాలుగా ఉపయోగపడుతూ ప్రజలను ఒకచోటి నుండి మరోచోటికి చేరుస్తున్నాయి. అదే రకంగా గూగుల్, మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్‌లు డేటాను, సమాచారాన్ని ఒకచోట నుండి మరో చోటకు చేర్చగలిగే వాహనాలుగా ఉన్నాయి. హైవేలను నిర్మించితే, వాహనాలు వాటంతటవే తప్పనిసరిగా వస్తాయి. గూగుల్, ఫేస్‌బుక్, మైక్రోసాఫ్ట్, యాపిల్ లాంటి కంపెనీలు ఖచ్చితంగా బ్రాడ్‌బ్యాండ్ హైవేలను నిర్మించవు. అదేకాకుండా మౌలిక సదుపాయాల నిర్మాణం వాళ్ళ వృత్తి కాదు. టాటా మోటార్స్, మారుతీ కంపెనీలు రోడ్లను నిర్మిస్తాయా? ఈ మౌలిక

**“గూగుల్, ఫేస్‌బుక్, మైక్రోసాఫ్ట్ సేవలను పొందుతున్న ప్రజానీకంపై నిఘా ఉంచేందుకు, వారి సమాచారం మొత్తాన్ని అమెరికా జాతీయ సెక్యూరిటీ ఏజెన్సీకి అందించేందుకు ఆయా కంపెనీలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. గూగుల్, ఫేస్‌బుక్, యుట్యూబ్, ట్విట్టర్‌లను వినియోగించకుండా డిజిటల్ ప్రపంచంలో చైనా ఎలా నెగ్గుకు రాగలుగుతుందన్నది అందరి ముందున్న పెద్ద ప్రశ్న.”**

సదుపాయాలను భారతదేశం దానంతటదే నిర్మించుకోవాలి. మరెవ్వరూ చెయ్యరు.

జపాన్, జర్మనీ దేశాల్లో 86 శాతం మంది ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్నారు. అలాగని ఆ దేశాధినేతలందరూ ఈ కంపెనీలను కలవలేరు. మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ వినియోగదారులలో ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉన్న చైనా, తమ దేశాన్ని డిజిటల్ చైనాగా మార్చటంకోసం గూగుల్, ఫేస్‌బుక్, మైక్రోసాఫ్ కంపెనీలను ఆశ్రయించలేదు. గూగుల్, ఫేస్‌బుక్, యుట్యూబ్, ట్విట్టర్ లాంటి కంపెనీలను తమ దేశంలోకి అనుమతించక పోవడమే కాకుండా, గూగుల్‌కు బదులుగా ఇతర సెర్చ్ ఇంజన్‌లను చైనీయులు వాడుతున్నారు. చైనా ప్రజలు వినియోగిస్తున్న ఇంటర్నెట్, ఇ-మెయిళ్ళ సమాచారాన్ని చైనాయేతర ప్రపపంచానికి గూగుల్ అందజేస్తుంది. చైనా లేవనెత్తుతున్న ప్రధాన అభ్యంతరం స్నోడెన్ అమెరికా సమాచార వ్యవస్థ బండారాన్ని బయటపెట్టిన తర్వాత వాస్తవమని రుజువైంది. గూగుల్, ఫేస్‌బుక్, మైక్రోసాఫ్ట్ సేవలను పొందుతున్న ప్రజానీకంపై నిఘా ఉంచేందుకు, వారి సమాచారం మొత్తాన్ని అమెరికా జాతీయ సెక్యూరిటీ ఏజెన్సీకి అందించేందుకు ఆయా కంపెనీలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. గూగుల్, ఫేస్‌బుక్, యుట్యూబ్, ట్విట్టర్‌లను వినియోగించకుండా డిజిటల్ ప్రపంచంలో చైనా ఎలా నెగ్గుకు రాగలుగుతుందన్నది అందరి ముందున్న పెద్ద ప్రశ్న. గణాంకాల రీత్యా ఈ రంగంలో చైనా పనితీరు చాలా బాగున్నది. సామాజిక మాధ్యమాల వినియోగదారులలో అమెరికా ఉత్పత్తి అయిన ఫేస్‌బుక్ 118 కోట్ల మంది వినియోగదారులు కలిగి మొదటి స్థానంలో ఉన్నది. క్యూక్యూ 83 కోట్ల వినియోగదారులు కలిగి రెండవస్థానంలో, క్యూజోన్ 63 కోట్ల వినియోగదారులు కలిగి మూడవస్థానంలో ఉన్నాయి. ఈ రెండు సంస్థలు చైనాలో ఉత్పత్తి చేయబడి ప్రధానంగా చైనా ప్రజలచే వినియోగింపబడుతున్నాయి. చైనా ఇంటర్నెట్ వినియోగదారులు సగటున రోజుకు 2.7 గంటలు ఆన్‌లైన్‌లో ఉంటారని, ఈ సంఖ్య అమెరికాయేతర అభివృద్ధి చెందుతున్న దేశాలకంటే ఎక్కువగాను, అమెరికా, జపాన్‌లతో సమానంగానో లేదా ఎక్కువగానో ఉన్నట్లు ఒక బోస్టన్ కన్సల్టెన్సీ బృందం అధ్యయనంలో తేలింది. మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్‌లకు మౌలిక సదుపాయాల కల్పనకు ఈ కంపెనీలతో అవసరం లేదన్న విషయం మోడీకి బాగా తెలుసు. కానీ ఆయన కార్యాన్ని ఆయన సాధించుకున్నారు. ఆయన మీడియా ప్రచారాన్ని చేజిక్కించుకొని, ఆ ప్రఖ్యాత కంపెనీల సాయంతో తాను ప్రఖ్యాత భారతదేశాన్ని నిర్మిస్తున్నాని కొందరితో నమ్మబలుకుతున్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో కొంత భాగాన్ని అందిస్తామని ఆ కంపెనీల ద్వారా చెప్పిస్తున్నారు. మొత్తం దేశానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఈ కంపెనీలు చివరి అంచున కల్పించే మౌలిక సదుపాయాల కల్పన అరకొరలాంటిది. ఈ కంపెనీలు వాగ్దానం చేసిన అంశాన్ని రేఖా మాత్రంగా చూద్దాము. వాళ్ళు చేస్తున్నది వాగ్దానం మాత్రమే. అది కూడా ఖచ్చితంగా ఖరీదు కట్టే ఉంటుంది.

సిలికాన్ వ్యాలిలో ఆయన పర్యటన సందర్భంగా భారతదేశంలో 500 రైల్వే స్టేషన్లను దత్తత తీసుకొని వైఫై సౌకర్యాన్ని కల్పిస్తానని, ఇందుకోసం కొంత మౌలిక సదుపాయాల కల్పన చేస్తామని గూగుల్ ప్రకటించింది. దీన్ని గూగుల్ ఎలా చేస్తుంది? అని పరిశీలిస్తే, రైల్వేలలో ఇప్పటికీ అందుబాటులో ఉన్న “రైల్‌టెల్” ఆప్టిక్ ఫైబర్ సమాహారాన్ని తప్పనిసరిగా వినియోగించుకుంటుంది. పెద్ద హైవేల సమీపంలో ఉండే ఇళ్ళకు చేరటానికి కలిపే చిన్న రోడ్లతో ఈ పరిస్థితిని పోల్చవచ్చును. అదేకాకుండా గూగుల్ వైఫై పరిజ్ఞానంలో నిష్ణాతులేమీ కాదు. వైఫై పరిజ్ఞానంలో నిపుణులైన ఇతర కంపెనీలు చాలా ఉన్నాయి. మన దేశంలోని కొన్ని విమానాశ్రయాలలో ఉచితంగా వైఫై సదుపాయాన్ని అందిస్తున్నారు. అవి చాలా బాగా పనిచేస్తున్నాయి. భారతదేశంలో వైఫై కల్పించే కంపెనీలు చాలా ఉన్నాయి. సాధారణంగా వైఫై కల్పనకు ఎవ్వరూ గూగుల్ని పిలవరు. ఎందుకంటే అది వాళ్ళ పనికాదు కాబట్టి. భారతదేశ గ్రామాలన్నింటికీ టెలివిజన్ ప్రసారమయ్యేటట్లు వీలు కల్పించటానికి, మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు మైక్రోసాఫ్ట్ ఉత్పత్తుల విక్రయాల వ్యాపారం చేయటమని అర్థం. మైక్రోసాఫ్ట్ యాజమాన్య సాఫ్ట్‌వేర్ మరింతగా వాడటం మూలంగా మనం లెక్కకు మించి ఖర్చు పెట్టాల్సిన విష వలయంలో పడతాము. మైక్రోసాఫ్ట్ కూడా మన దేశంలో డేటా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నది. అది అమెరికా జాతీయ సెక్యూరిటీ ఏజెన్సీతో ఒప్పందం కలిగివున్నందున, ఈ డేటా సెంటర్లలో పోగుపడిన సమాచారాన్ని అనివార్యంగా అమెరికా జాతీయ సెక్యూరిటీ ఏజెన్సీకి తెలియచేస్తుంది. ఫేస్‌బుక్ కూడా తన ఇంటర్నెట్‌ను మనకు అందించటానికి తన సంసిద్ధతను వ్యక్తపరిచింది. దాని ఇంటర్నెట్ పరిమితమైన ఇంటర్నెట్‌గానే గుర్తించాలి. ఇంటర్నెట్‌లో మనం ఏమి చూడాలో ఫేస్‌బుక్ నిర్ణయిస్తుంది. “తటస్థ విధానానికి ఇది వ్యతిరేకం. ఈ కంపెనీలేమీ మనదేశంలో చెప్పుకోదగ్గ ఉద్యోగాల్ని కల్పించలేవు. కల్పించగలమని వాళ్ళూ చెప్పడం లేదు.

**డిజిటల్ ప్రపంచంపై గుత్తాధిపత్యం**

సిలికాన్ వ్యాలీకి మోడీ సందర్శనను ఇన్ఫోసిస్ మాజీ డైరెక్టర్ టివి మోహన్ దాస్ సాయ్ ప్రస్తుతిస్తూ, “మొత్తం ప్రపంచాన్ని డిజిటల్‌గా సొంతం చేసుకోవటం కోసం మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్, గూగుల్ మరియు యాపిల్‌లు కన్న కలలకు మోడీలో సమాధానం దొరికింది. అని ఆయన సరిగ్గానే చెప్పారు. ఆయన మాటల్లో రెండు సత్యాలున్నాయి. ఒకటి, ఈ కంపెనీలన్నీ డిజిటల్ ప్రపంచం మొత్తాన్ని తమ గుత్తాధిపత్యంలోకి తెచ్చుకోవాలని కోరుకుంటున్నాయి. ఇందుకోసం వాళ్ళు ఇతరులెవరినీ ఈ రంగంలోకి అడుగుపెట్టనివ్వరు. కానీ ఈ స్వప్నాన్ని నిజం చేసుకోవటానికి వాళ్ళు ఎన్నో అవరోధాలను ఎదుర్కోవలసి ఉంది. ప్రపం చంలో అతిపెద్ద మార్కెట్ కలిగిన చైనా, ఇతరులను తమ దేశంలోకి అడుగు పెట్టనీయటం లేదు. కొన్ని దేశాల్లో యాజమాన్య సాఫ్ట్‌వేర్ వినియోగానికి నిధులూ, ఫ్రీ సాఫ్ట్‌వేర్ వినియోగం పెరిగింది. చైనా తర్వాత భారతదేశం రెండవ అతిపెద్ద మార్కెట్‌గా ఉన్నది. అందువల్ల బహుళజాతి కంపెనీలు ఈ మార్కెట్‌పై ఆసక్తిగా ఉన్నాయి. బహుళజాతి ఐటి కంపెనీలు మన దేశంలో వ్యాపారం చేయటం వల్ల అనేక ప్రయోజనాలు పొందగలుగుతున్నాయి. మొదటగా భారతదేశం యాజమాన్య సాఫ్ట్‌వేర్ వినియోగంలో ఆధిపత్యం కలిగి ఉంది. ఆచరణలో

ప్రభుత్వం, ఐటి దిగ్గజాలు యాజమాన్య సాఫ్ట్‌వేర్‌కు ఇచ్చినంత ప్రాధాన్యతను స్వేచ్ఛా, ఫ్రీ సాఫ్ట్‌వేర్‌లకు ఇవ్వటం లేదు. రెండవ అంశం, భారతదేశం రెండవ అతిపెద్ద మార్కెట్‌గా ఉన్నది. అందువల్ల బహుళజాతి కంపెనీలు ఈ మార్కెట్‌పై ఆసక్తిగా ఉంటాయి. అయినప్పటికీ అవుట్‌సోర్సింగ్‌కు వినియోగించే సాఫ్ట్‌వేర్ నిర్మాణం అనేక సందర్భాలలో అంత తేలికైన పనికాదు. భారతీయ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకే ఆ నైపుణ్యం ఉంది. కాని మనదేశంలో నూతన ఉత్పత్తుల స్థానంలో భారతదేశ సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులకు స్థానం కల్పించాలన్న సంకల్పం భారత ప్రభుత్వానికి లేదు. అవుట్ సోర్సింగ్ ద్వారా పొందగలిగే సత్వర ఆదాయాన్ని ప్రైవేట్ ఐటి కంపెనీలు నూతన ఉత్పత్తుల ద్వారా పొందలేకపోవటం మూలంగా వాటి ఉత్పత్తిలో ఆసక్తి కనబరచడం లేదు. మూడవ అంశం ఇతర దేశాలలాగా కాకుండా, బహుళజాతి సాఫ్ట్‌వేర్ దిగ్గజాల సహకారంతో అమెరికా సాగిస్తున్న నిఘా చర్యల్ని స్నోడెన్ బట్టబయలు చేసినప్పటికీ, భారత దేశం, వాటినేమీ పట్టించుకోవడం లేదు. చివరి అంశం పర్యవసానాలేమైనా భారత మార్కెట్‌ను సాధ్యమైనంత త్వరగా బహుళజాతి సంస్థలకు అప్పచెప్పటానికి ప్రస్తుత ప్రధానమంత్రి, సిద్ధమయ్యారు. బహుళజాతి ఐటి కంపెనీలకు భారత మార్కెట్, భారత ప్రధానమంత్రి ప్రీతిపాత్రమయ్యాయి. అమెరికన్ బహుళజాతి ఐటి కంపెనీల కలలకు మోడీతో సమాధానం చూడగలిగారన్న మోహన్‌దాస్ సాయ్ ప్రకటనలో రెండవ సత్యం ఇక్కడ దొరుకుతుంది. అమెరికన్ కంపెనీల ప్రయోజనాలకు కొమ్ముగాస్తున్న మోడీని అమెరికన్ మీడియా ఆనందంతో కీర్తించడం సర్వసాధారణమైనదే. మోడీ సిలికాన్ వ్యాలీ పర్యటనలో అదే జరిగింది. కానీ మోడీ తన పర్యటనలో ఏమి చేసి ఉండాల్సింది? దానికి బదులు ఆయన అనంతమైన విజ్ఞానాన్ని అందించకలిగే విద్యాసంస్థలు, అపార సంపదను పెట్టుబడిగా పెట్టగలిగే వెంచర్ పెట్టుబడిసంస్థలు, కేంద్రీకరింపబడ్డ నైపుణ్య సమూహాలన్నింటి పరస్పర సమన్వయంతో అంకుర పరిశ్రమలు వారి ఆవిష్కరణలతో సిలికాన్ వ్యాలీలో ఎలా వృద్ధి కాగలిగాయో అధ్యయనం చేసి ఉండాల్సింది. ఆయన సిలికాన్ వ్యాలీ చరిత్రను పరిశీలించి ఉంటే, ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయటంలో అమెరికా ప్రభుత్వం నిర్వహించిన పాత్ర తెలిసి ఉండేది. సాధారణంగా భారత కంపెనీలు నూతన ఆవిష్కరణలకు విముఖంగా ఉన్న ప్రాంతంలో నూతన ఉత్పత్తుల నిర్మాణంలో ప్రభుత్వం నిర్వహించాల్సిన అదనపు పాత్రకు తగిన ప్రణాళికను మోడీ రచించగలిగేవారు.

“చివరి అంశం పర్యవసానాలేమైనా భారత మార్కెట్‌ను సాధ్యమైనంత త్వరగా బహుళజాతి సంస్థలకు అప్పచెప్పటానికి ప్రస్తుత ప్రధానమంత్రి, సిద్ధమయ్యారు. బహుళజాతి ఐటి కంపెనీలకు భారత మార్కెట్, భారత ప్రధానమంత్రి ప్రీతిపాత్రమయ్యాయి. అమెరికన్ బహుళజాతి ఐటి కంపెనీల కలలకు మోడీతో సమాధానం చూడగలిగారన్న మోహన్‌దాస్ సాయ్ ప్రకటనలో రెండవ సత్యం ఇక్కడ దొరుకుతుంది.”




**సిలికాన్ వ్యాలీలో మోడీ, జుకెర్ బెర్గ్**

ఆ దిశలో మోడీ ఏమీ చేయటం లేదు. అనేక సందర్భాలలో మోడీ “భారత్‌లో తయారీ”పై ప్రసంగిస్తుండేవారు. అనేక ఆవిష్కరణలు సిలికాన్ వ్యాలీలో చిన్న చిన్న అంకుర పరిశ్రమల ద్వారానే సాధ్యమైందన్న వాస్తవాన్ని ఆయన అధ్యయనం చేస్తే అర్థమయ్యేది. “భారత్‌లో తయారీ” ప్రణాళిక విజయసాధనకు అటువంటి అకుంర పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వవలసి ఉంది. ఆ రకమైన ప్రోత్సాహాన్ని అందించటానికి తగిన ప్రభుత్వం విధానాలను ఆయన రూపొందించవలసి ఉంది. భారతదేశ ఐటి పరిశ్రమలలో మనం చూస్తున్న అభివృద్ధి, సాఫ్ట్‌వేర్ పార్క్ ఆఫ్ ఇండియా ద్వారా ఉద్భవించిన ఐటి పరిశ్రమ అనుకూల భారత ప్రభుత్వ పన్నుల విధానం ద్వారానే సంభవించింది. సాఫ్ట్‌వేర్ పార్క్ ఆఫ్ ఇండియా క్రింద నమోదైన ఐటి కంపెనీ, అది చిన్నదైనా, పెద్దదైనా, భారత్‌లో ఉన్నా లేకపోయినా, అది ఎగుమతులు చేయగలిగితే పన్ను రాయితీలకు అర్హమై ఉంటుంది. ఈ విధానం ద్వారా ప్రయోజనం పొందిన అనేక చిన్న కంపెనీలు భారతీయ కంపెనీలుగా పరిణామం చెందాయి. (ఉదాహరణకు టిసిఎస్, విప్రో, ఇన్ఫోసిస్ మొదలైనవి). గత యుపియే ప్రభుత్వం పన్ను రాయితీలను ఉపసంహరించుకుంది. ఈ పరిణామం చిన్న ఐటి కంపెనీలపై అధిక పన్ను భారాన్ని మోపుతూ అసమాన పోటీకి దారితీస్తుండగా, పెద్ద ఐటి కంపెనీలు అధిక పన్ను మినహాయింపులు, అనేక ఇతర రాయితీలను అందిస్తున్న “ప్రత్యేక ఆర్థిక మండళ్ళకు” తరలిపోయి అధిక ప్రయోజనాలు పొందగలుతున్నాయి. ఒక చిన్న కంపెనీ కూడా ప్రత్యేక ఆర్థిక మండలిలో 25 ఎకరాల కనిష్ట భూమిని కొనగలిగే స్థితిలో లేదు. డిఎల్ఎఫ్, షాపూర్జి సల్లోంజీ లాంటి పెద్ద రియల్ ఎస్టేట్ కంపెనీలు ప్రత్యేక ఆర్థిక మండళ్ళలో కొంత స్థలం అద్దెకు ఇస్తున్నా, వారు డిమాండు చేస్తున్న అత్యధిక అద్దెలు భరించే స్థితిలో చిన్న కంపెనీలు లేవు. ఈ నేపథ్యంలో మోడీ ప్రభుత్వం గత యుపియే ప్రభుత్వం తీసుకున్న చర్యలను రద్దు చేసి అంతకు ముందున్న స్థితిని పునరుద్ధరిస్తుందా? లేక భారీ, చిన్న కంపెనీలు ఒకేరకమైన ప్రభుత్వ రాయితీలను పొందేటట్లు విధాన నిర్ణయాన్ని ప్రకటిస్తుందా? లేదు. ఆయన అలా చేయరు. కాంగ్రెస్, బిజెపిలది ఒకే రకమైన ఆర్థిక విధానం. బిజెపికి ఎన్నికల నిధి ఇవ్వగలిగే స్తోమత చిన్న కంపెనీలకు లేదు. అందువల్ల బిజెపి చిన్న కంపెనీలను ప్రోత్సహించే ప్రశ్నే ఉదయించదు. మోడీ ప్రకటించిన “భారత్‌లో తయారీ” నినాదం ఆయన ప్రసంగాలలో తప్ప ఆచరణలో లేదు. మోడీ సిలికాన్ వ్యాలి పర్యటన ఒక ఇచ్చి పుచ్చుకునే ప్రణాళిక. ప్రభుత్వ మద్దతుతో భారతదేశంలో తమ వ్యాపారాన్ని

(మిగతా 35వ పేజీలో)

**సామాజిక సమస్యలు**

# అంటరానితనం: వివక్ష-దోపిడీ

**ఎ. కోటిరెడ్డి**



రచయిత మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

**భా**రత సమాజంలో కొనసాగుతున్న అంటరానితనం, కులవివక్ష, మహిళల పట్ల వివక్ష దోపిడీదారులకు వరప్రదాయినిగా ఉన్నాయి. కార్మికవర్గం, పేదలు, మహిళలు, దోపిడీకి గురౌతున్నవారు ఐక్యం కాకుండా నిరోధించటంలో అంటరానితనం, కుల వివక్ష, మహిళల పట్ల వివక్ష అత్యంత శక్తివంతమైన సాధనాలుగా పని చేస్తున్నాయి. సమాజంలో ఉన్న అంటరాని కులాలు అంటరానితనం, వివక్షకు గురవు తుండగా, అంటులేని వాటిలో కొన్ని కులాల పట్ల కూడా వివక్ష కొనసాగుతున్నది. అంటరాని కులాలలో మాల, మాదిగలు ప్రధానంగా ఉన్నారు. అంటులేకపోయినా వివక్షకు గురవుతున్న వాటిలో వెనుకబడిన కులాలు ఉన్నాయి. అగ్రకులాల మధ్య అంటరానితనం, వివక్ష లేవు. ఏ కులంలో ఉన్నా, ఏ మతంలో ఉన్నా మహిళలందరూ వివక్ష, అణచివేతలకు గురవుతున్నారు.

సమాజంలో వివిధ రూపాలలో అంటరానితనం, కులవివక్ష కొనసాగుతున్నా, కష్టజీవులందరూ కలిసి, ఐక్యంగా పనిచేస్తేనే ఉత్పత్తి జరుగుతుంది. వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాలలో పనిచేసే శ్రామికులందరూ కలిసి శ్రమిస్తారు. పారిశ్రామికరంగంలో అన్ని కులాలలోని వారు, మహిళలు, కార్మికులుగా, ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. సామాజిక జీవితంలో అంటరాని, అంటులేని కులాలుగా ఉన్నవారు, మహిళలు వివిధ రకాలైన వివక్షలకు గురౌతున్నారు. వివక్షకు గురౌతున్న కులాలలోని పేదలు, వివక్షలేని అగ్రకులాలలోని పేదలు కూడా ఆర్థిక జీవితంలో ఒకే విధంగా దోపిడీ చేయబడుతున్నారు.

పారిశ్రామికోత్పత్తిలోకార్మికవర్గం ప్రధాన పాత్ర పోషిస్తున్నది. కార్మికవర్గంలో దళితులు, వెనుకబడిన తరగతులు, అగ్రకులాలకు చెందిన పేదలు, గిరిజనులు, మైనారిటీలు ఉన్నారు. అందరూ కలిసి ఐక్యంగా ఉత్పత్తి చేస్తారు. కార్మికులతో పాటు ఉద్యోగులుగా కూడా అన్ని కులాలకు చెందినవారు, మహిళలు వివిధ పరిశ్రమలలో పని చేస్తున్నారు. ఆధునికంగా వస్తున్న పరిశ్రమలలోనూ, ఐటి రంగంలో కూడా అందరూ కలిసి పనిచేస్తున్నారు. దేశీయంగా ఉన్న చిన్న, మధ్యతరహా, బడా పరిశ్రమల లోనూ, బహుళజాతి సంస్థలలో కూడా అందరూ పని చేస్తున్నారు. వ్యవసాయరంగంలో కూడా కలిసే ఉత్పత్తి చేస్తున్నారు. బహుళజాతి సంస్థలు, బడా పెట్టుబడిదారులు, చిన్న, మధ్య తరహా పెట్టుబడిదారులు, భూస్వాములు తక్కువ జీతాలు ఇస్తూ, కార్మికులను, ఉద్యోగులను, వ్యవసాయ కార్మికులను దోపిడీ చేస్తున్నారు. కొన్ని కులాల నుండి ఎక్కువ శాతం,కొన్ని కులాల నుండి తక్కువ శాతం ఉన్నా, దోపిడీకి గురౌతున్న వారిలో అన్ని కులాలకు చెందిన పేదలు ఉన్నారు. దోపిడీ చేసేవారిలో కూడా అన్ని కులాల కు చెందిన పెట్టుబడిదారులు, భూస్వాములు ఉన్నారు.

కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగులు, మహిళలు పని చేస్తున్న ప్రతిచోటా దోపిడీకి గురౌతున్నారు. ఈ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికులందరూ కలిసి పోరాటం చేయటానికి అంటరానితనం, కులవివక్ష, మహిళల పట్ల ఆటంకంగా ఉంటున్నాయి. ఒకేవిధమైన పనిచేస్తూ, ఒకే స్థాయి ఆర్థిక జీవితం గడుపుతున్న వారిమధ్య కూడా వివక్ష బలంగానే ఉంటున్నది. కార్మికులు, ఉద్యోగులు, వ్యవసాయ కార్మికుల మధ్య అంట రానితనం, కుల వివక్ష కొనసాగుతున్నాయి. ఒకేచోట సంవత్సరాల తరబడి పనిచేస్తున్న వారిమధ్య, ఒకేవిధంగా దోపిడీకి గురౌతున్న వారిమధ్య కూడా అంటరానితనం, కులవివక్ష మాత్రం అంతం కావటం లేదు. కార్మికులు, వ్యవసాయ కార్మికుల కుటుంబాలలో కూడా మహిళల పట్ల వివక్ష కొనసాగుతున్నది. నిరక్షరాస్యుల నుండి, అత్యున్నత విద్యావంతుల వరకు మహిళల పట్ల వివక్ష చూయిస్తున్నారు. అంట రానితనం, కులవివక్ష మహిళల పట్ల కొనసాగు తుండటం వలన యజమానులకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటాలు చేయటం, తమ వేతనా లను పెంచుకోవటం, హక్కులను సాధించుకో వటంలో కష్టజీవులు వెనుకబడుతున్నారు. ఫలి తంగా దోపిడీ పెరుగుతున్నది. కార్మికుల, కష్ట జీవుల ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటాలు చేయటంలో కూడా అంటరానితనం, కులవివక్ష ఆటంకంగా ఉన్నాయి.

అంటరానితనం, వివక్ష కొనసాగుతున్నంత కాలం వాటికి గురవుతున్న కార్మికులు అందుకు వ్యతిరేకంగా పోరాటం చేస్తారు. తోటి కార్మికులే అంటరానితనం పాటిస్తూ, వివక్ష చూపుతున్నపుడు అంటరానితనం, వివక్షలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో వారితో కూడా పోరాటం చేయాల్సివుంటుంది మహిళలు కూడా తమపై జరుగుతున్న వివక్ష, అణచివేతలకు వ్యతిరేకంగా తాము చేసే పోరాటంలో ఇతరులతో పాటు వివక్ష, అణచివేతలకు పాల్పడుతున్న తోటి కార్మికులు, ఉద్యోగులకు వ్యతిరేకంగా కూడా పోరాటం చేస్తారు. తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవటానికి తోటి కార్మికులు, కార్మికులతో పోరాటం చేయాల్సిన స్థితిలో ఉన్న కార్మికులు దోపిడీ దారులకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలలో మన స్ఫూర్తిగా, సమాన స్థాయిలో పాల్గొనగలరా? భుజంభుజం కలిపి సమైక్యంగా పోరాటాలలో నిలబడగలరా? కాబట్టి అంటరానితనం, వివక్ష కొనసాగుతున్నంత కాలం కార్మికవర్గం, దోపిడీకి గురౌతున్నవారి మధ్య సంపూర్ణ ఐక్యత

నెలకొనటం సాధ్యం కాదు.

అంటరానితనం, వివక్ష కొనసాగటం దోపిడీదారులకు అవసరం. దోపిడీదారులు తమ దోపిడీని యధేచ్ఛగా కొనసాగించుకోవాలంటే అంటరానితనం, వివక్షలను కొనసాగిస్తూ ప్రజలను చీల్చి ఉంచాలి. శ్రామికవర్గానికి తమ కోర్కెలు సాధించుకొవాలంటే ఐక్యం కావాలి. ఆర్థికసమస్యలపైనా, దోపిడీకి, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, యజమానులతో, ప్రభుత్వంతో కార్మికులు, ఉద్యోగులందరూ కలిసి పోరాడాలి. అంటరా నితనం, వివక్షకు గురౌతున్నవారు తమ ఆత్మ గౌరవం కోసం సాటి కార్మికులతో పోరాడాల్సి వస్తున్నది. ఈ స్థితి కార్మికుల మధ్య సంపూర్ణ ఐక్యత నెలకొనకుండా చేస్తున్నది.

**సరళీకరణ విధానాలు-పెరుగుతున్న దోపిడి**

సరళీకరణ విధానాలు ప్రారంభమైన తర్వాత దోపిడీ మరింత తీవ్రమౌతున్నది. దేశంలోకి వస్తున్న ద్రవ్యపెట్టుబడులు అత్యధిక లాభాల కోసం వెంపర్లాడుతున్నాయి. పాలక వర్గాలు వాటిని సంతృప్తి పరచటానికి కార్మికవర్గం గతం నుండి పోరాడి సాధించుకున్న హక్కులన్నింటినీ వమ్ము చేయటానికి పూనుకున్నాయి. ఎనిమిది గంటల పనిదినం, చట్టబద్ధమైన వేతనం, ఇతర సదుపాయాలన్నింటినీ క్రమంగా రద్దు చేస్తున్నారు. గత ప్రభుత్వాలు పరోక్షంగా వీటిని వమ్ము చేయటానికి పూనుకోగా, ప్రస్తుత బిజెపి ప్రభుత్వం కార్మికులు, ఉద్యోగులకు చట్టపరంగా ఉన్న హక్కులన్నింటినీ రద్దుచేయటానికి పూనుకుంటున్నది. ఈ చర్యలు అన్ని రంగాలలోని శ్రామికుల హక్కులను హరిస్తాయి. వీటికి వ్యతిరేకంగా కార్మికవర్గం అంతా సమైక్యంగా ఉద్యమించాల్సి ఉంది. కాని శ్రామికుల మధ్య ఉన్న సామాజిక విభజన బలమైన ఐక్య ఉద్యమాలు జరగటానికి ఆటంకంగా ఉన్నది.

ఈ సామాజిక విభజనను, దోపిడీని నయా ఉదారవాద విధానాలు మరింత తీవ్రం చేస్తున్నాయి. దోపిడీ పెరిగితే దానికి ప్రతిఘటన కూడా పెరుగుతుంది. ప్రతిఘటన తీవ్రమై, కార్మికవర్గమంతా ఐక్యంగా పోరాటాల్లోకి వస్తే, తమ దోపిడికి కాలం తీరుతుందని దోపిడీదారులకు తెలుసు. కాబట్టి కార్మికవర్గాన్ని, ఉద్యోగులను, పేదలను ఐక్యం కాకుండా చీల్చి ఉంచటానికి, పోరాటాలను నీరుగార్చటానికి నయా ఉదారవాద విధానాలను అమలు జరిపే వారు పూనుకుంటున్నారు. ఆ విధంగా పేదల మధ్య గతంలో ఉన్న సామాజిక వైరుధ్యాలను మరింత తీవ్రం చేసేలా అస్థిత్వవాద ఉద్యమాలను పెంపొందిస్తున్నారు. ఫలితంగా

> **"అస్థిత్వవాద భావజాలం తీవ్రంగా వ్యాపించి, ఉద్యమరూపం తీసుకున్న తర్వాత ఘర్షణలు రెచ్చగొట్టి, వివిధ కులాలు, మతాలు, జాతుల మధ్య దూరం పెంచుతున్నారు. దోపిడీకి గురౌతున్న వారు ఐక్యంగా పోరాటాలలోకి రాకుండా చేయటానికి వివిధ రకాలైన కుతంత్రా లకు పాల్పడుతూ, శ్రామికుల మధ్య దూరాన్ని పెంచుతున్నారు."**



రెగ్యులరైజ్ చేయాలని వరంగల్‌లో పోరాటం చేస్తున్న ఉద్యోగులు

గతంలో ఉన్న వైరుధ్యాలు తీవ్రమై, ఐక్య ఉద్యమాల నిర్మాణం మరింత కష్టమౌతున్నది. కులాల పేరుతో, మతాల పేరుతో, ప్రాంతాల పేరుతో, జాతులు, భాషలు తదితరాల పేర్లతో పేదల మధ్య విభజనను తీవ్రం చేస్తున్నారు. అస్థిత్వవాద భావజాలం తీవ్రంగా వ్యాపించి, ఉద్యమరూపం తీసుకున్న తర్వాత ఘర్షణలు రెచ్చగొట్టి, వివిధ కులాలు, మతాలు, జాతుల మధ్య దూరం పెంచుతున్నారు. దోపిడీకి గురౌతున్న వారు ఐక్యంగా పోరాటాలలోకి రాకుండా చేయటానికి వివిధ రకాలైన కుతంత్రాలకు పాల్పడుతూ, శ్రామికుల మధ్య దూరాన్ని పెంచుతున్నారు.

**సామ్రాజ్యవాదుల కుతంత్రాలు**

ద్రవ్యపెట్టుబడిదారులు, సామ్రాజ్యవాద దేశాలు ఏదో ఒక దేశంలోనో, ఒకప్రాంతంలోనో కాకుండా ప్రపంచమంతా, అన్ని దేశాలలోనూ ఇదే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. సామ్రాజ్యవాదులు, ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదులు తమ చెప్పుచేతల్లో లేని దేశాధినేతలను లొంగదీసుకోవటానికి అన్నిరకాలైన ప్రయత్నాలు చేస్తున్నారు. తమ ప్రయోజనాలను వ్యతిరేకించే వారు ఆయా దేశాల పాలకులుగా ఎన్నికైనపుడు వారిని అధికారం నుండి తొలగించి, తమ తొత్తులను అధికారంలో ప్రతిష్టించటానికి తీవ్రవాదాన్ని ఒకసాధనంగా చేసుకుంటున్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లోని ప్రభుత్వాన్ని కూలదోయటానికి ముస్లీం తీవ్రవాదులకు అమెరికాలో శిక్షణ ఇచ్చి, ఆయుధాలు, ఆర్థిక సహాయాన్ని అందజేసి అక్కడ తీవ్రవాదాన్ని రెచ్చగొట్టారు. ఆ తర్వాత వారే తాలిబన్‌లుగా, ఆల్‌ఖైదాగా మారి అమెరికా దళాలపైనే దాడులు చేయటం ప్రారంభించారు. ఇరాక్‌లో నాడు పాలకుడుగా ఉన్న సద్దాం హుస్సేన్ అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించక పోవటంతో అక్కడ అణ్వాయుధాలున్నాయనే సాకుతో ఆదేశంపై దాడిచేసి, ధ్వంసం చేశారు. తర్వాత లిబియాపై దాడిచేసి, అక్కడి ప్రభుత్వాన్ని కూలద్రోశారు. ప్రస్తుతం సిరియాలో అస్సాద్ ప్రభుత్వాన్ని పడగొట్టి, తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని గద్దెపై కూర్చుండబెట్టటం కోసం అక్కడ సాయుధ పోరాటాన్ని రెచ్చగొట్టి, తిరుగుబాటు దారులకు

**“దళితులు, ఇతర వెనుకబడిన కులాలలోని ఉద్యోగులను చూయించి నిరుద్యోగులను, భూమి, ఇతర ఆస్తులను సంపాదించుకున్న వారిని చూపి అగ్రకులాలలోని పేదలను రెచ్చగొడుతున్నారు. వారిని ప్రజాతంత్ర ఉద్యమం నుండి దూరం చేసి, తమ గుప్పిట్లో పెట్టుకుంటున్నారు.”**

అన్ని విధాలుగా మద్దత్తును అందజేస్తున్నారు. ఆ దేశాలలో షియా- సున్నీ తెగల మధ్య, పాలకుల మధ్య ఉన్న విభేదాలను వినియోగించు కొని, వారిమధ్య ఘర్షణలను పెంచి, ఆ ప్రాంతాన్నంతా తమగుప్పెట్లో పెట్టుకొని దోపిడీ చేయటానికి ప్రయత్నం చేస్తున్నారు. ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో కూడా ఇదేవిధంగా వ్యవహరిస్తున్నారు. ఇటువంటి చర్యల ద్వారానే అల్‌ఖైదా, ఐసిస్ లాంటి సంస్థలు పుట్టుకువచ్చి, ప్రజాస్వామ్యం, మానవహక్కులను హరించ టంతో పాటు, తమ సృష్టికర్తలైన సామ్రాజ్యవాద దేశాలపై దాడులు చేస్తున్నాయి. ఒకవైపు అన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలలోని పాలక వర్గాలను సరళీకరణ విధానాలకు మద్దత్తుదారు లుగా, తమ దోపిడీని బలపరచేలా తయారు చేసుకోవటం, తమకు లొంగని ప్రజాస్వామిక ప్రభుత్వాలను కూలద్రోసి నిరంకుశ ప్రభుత్వా లను ఏర్పాటు చేయటం, మరోవైపు పోరాడే పేదల మధ్య విభేదాలను, ఘర్షణలను పెంచ టం, కార్మికవర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేయటం లక్ష్యంగా సామ్రాజ్యవాదులు ఈ విధానాలను అమలు జరుపుతున్నారు.

మనదేశంలో కూడా సామ్రాజ్యవాదులు ఇదే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. మనదేశం సోవియట్ యూనియన్‌తో స్నేహ, సహకార ఒప్పందం చేసుకొని స్వతంత్రంగా వ్యవహరిస్తు న్నపుడు, అమెరికా మనదేశంలో వేర్పాటువాద, విచ్ఛిన్నకర ఆందోళనలను రెచ్చగొట్టింది. 1980వ దశాబ్దంలో పంజాబ్‌లో ఖలిస్థాన్ ఉద్యమం, అస్సాంలో వేర్పాటువాద ఆందోళన లకు అమెరికా మద్దత్తునిచ్చింది. తర్వాతి కాలంలో సరళీకరణ విధానాలు ప్రారంభమైన తర్వాత అస్థిత్వవాద ఉద్యమాలకు ఊతం ఇస్తూ, కులాలు, మతాలు, జాతులు, ప్రాంతాల మధ్య వైరుధ్యాలు పెంచటానికి పూనుకున్నది. ఫలితంగా దేశంలో మతాల మధ్య, కులాల మధ్య వైరుధ్యాలు, ఘర్షణలు పెరుగుతున్నాయి. ప్రాంతీయ విభేదాలు పెరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయింది. అనేక రాష్ట్రాలలో వేర్పాటువాద ఆందోళనలు పెరుగుతున్నాయి. దేశంలో ద్రవ్యపెట్టుబడుల దోపిడీ నుండి ఇటువంటి ఘటనలు ప్రజల దృష్టిని మళ్ళిస్తున్నాయి. శ్రామికవర్గ ఐక్యతను విచ్ఛిన్నంచేస్తున్నాయి. దోపిడీకి గురౌతున్న ప్రజలు ఐక్యం కాకుండా, ఏకోన్ముఖంగా ఈ దోపిడీని ప్రతిఘటించకుండా ఆటంకం కలిగిస్తున్నాయి.

సామాజిక విభజనకు సమాజంలోని ఆయా కులాలలో ఉన్న ఉన్నత తరగతులలోని వారు నాయకత్వం వహిస్తున్నారు. దళిత, వెనుకబడిన కులాలలోని ఉన్నత తరగతుల వారు కూడా సామాజిక వివక్షకు గురవుతు న్నారు. వివక్షకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాన్ని ఆయా కులాలలోని పైతరగతులు తమ రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలను సాధించుకోవటానికివినియోగించు కొంటున్నారు. వివక్ష అంతం కోసం పోరాడటం కాకుండా, కొద్ది మందికి మాత్రమే ఉపయోగపడే ఆర్థిక, రాజకీయాంశాలను ముందుకుతెస్తూ, పోరాటాన్ని అంతవరకే పరిమితం చేస్తున్నారు. అంటరాని తనం, వివక్షకు కారణమైన ఆర్థిక పునాదిని ధ్వంసం చేయటం ద్వారా వీటిని సంపూర్ణంగా నిర్మూలించాలనే అవగాహనను వీరు తమ కులాలలోని శ్రామికులలో కలిగించటం లేదు. అందుకు బదులుగా తమ ఆర్థిక, రాజకీయ లక్ష్యాలను ముందుకు తీసుకు పోవటంలో వీరిని సాధనాలుగా వినియోగించు కొంటున్నారు. వెనుకబడిన తరగతులకు రాజకీయ, ఆర్థికరంగా లలో, అన్యాయం జరుగుతుంటే అందుకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిందే. దానితో పాటు మొత్తం వివక్షకు వ్యతిరేకంగా కూడా పోరాటం చేయాలి. మరొక అంశం ఈ ఆందో ళనలలో ఏ కులాని కాకులం తమ సమస్యలపై తామే పోరాటం చేస్తామని, ఇతరులు తమ సమస్యలను అర్థం చేసుకోలేరని ప్రచారం చేస్తూ, ఆయా కులాల లోని కష్టజీవుల్ని మొత్తం ప్రజాతంత్ర ఉద్యమం నుండి దూరంగా ఉ ంచుతున్నారు. మహిళలను కూడా ప్రజాతంత్ర ఉద్యమం నుండి దూరంగా ఉంచటానికి కొన్ని సంస్థలు ప్రయత్నం చేస్తున్నాయి.

అగ్రకులాలలోని పెత్తందారులు కూడా తమ కులాలలోని పేదలు ఇతర కులాలలోని పేదలతో కలవకుండా దూరంగా ఉంచే ప్రయ త్నం చేస్తున్నారు. ఇందుకోసం కుల దురహం కారాన్ని పెంచిపోషించే చర్యలు తీసుకుంటు న్నారు. దళితులు, వెనుకబడిన తరగతులలోని పేదలకు వ్యతిరేకంగా రెచ్చగొడుతున్నారు. దళితులు, ఇతర వెనుకబడిన కులాలలోని ఉ ద్యోగులను చూయించి నిరుద్యోగులను, భూమి, ఇతర ఆస్తులను సంపాదించుకున్న వారిని చూపి అగ్రకులాలలోని పేదలను రెచ్చగొడుతున్నారు. వారిని ప్రజాతంత్ర ఉద్యమం నుండి దూరం చేసి, తమ గుప్పిట్లో పెట్టుకుంటున్నారు. చిన్న సంఘటనలు జరిగి, అగ్రకులాలలోని వారికి, ఇతర కులాలలోని వారికి మధ్య వైరుధ్యాలు పెరిగిన సందర్భాలలో వాటిని సక్రమమైన పద్ధతిలో పరిష్కారం చేయటం కాకుండా కుల ఘర్షణల వరకు తీసుకుపోయి, దళితులు, వెనుక

## ‘మార్క్సిస్టు’ పై మీ అభిప్రాయాలు తెలపండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తు న్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**

**‘మార్క్సిస్టు’** సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

బడిన కులాల వారిపై దాడులు చేయిస్తున్నారు. ఈ దాడుల్లో పథకం ప్రకారం అగ్రకులాలలోని పేదలను ముందుభాగంలో ఉంచుతున్నారు. వెనుకబడిన తరగతులను రెచ్చగొట్టి, వారిని ముందుపెట్టి, దళితులపై దాడులు చేయిస్తున్నారు. ఈ విధంగా దళితులు వెనుకబడిన తరగతుల మధ్య, దళితులు వెనుకబడిన తరగతులు, అగ్రకులాలలోని పేదల మధ్య ఐక్యత పెరగకుండా నిరంతరం వైరుధ్యాలను, ఘర్షణలను పెంచుతున్నారు. ఆ విధంగా గ్రామీణ ప్రాంతంలో భూస్వాముల పెత్తనానికి, అగ్ర కులాల ఆధిపత్యానికి విఘాతం కలగకుండా జాగ్రత్త పడుతున్నారు.

“ఈ విధంగా దళితులు వెనుకబడిన తరగతుల మధ్య, దళితులు వెనుకబడిన తరగ తులు, అగ్రకులాలలోని పేదల మధ్య ఐక్యత పెరగకుండా నిరంతరం వైరుధ్యాలను, ఘర్షణ లను పెంచుతున్నారు. ఆ విధంగా గ్రామీణ ప్రాంతంలో భూస్వాముల పెత్తనానికి, అగ్ర కులాల ఆధిపత్యానికి విఘాతం కలగకుండా జాగ్రత్త పడుతున్నారు.”

ఆ విధంగా తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటం చేయాల్సిన శ్రామిక ప్రజానీకాన్ని చీల్చి ఉంచటంలో అగ్రకుల పెత్తందారులు వ్యూహం ప్రకారం వ్యవహరిస్తున్నారు. దళితులు, వెనుకబడిన కులాలను దూరంగా ఉంచుతూ,వివక్షను కొనసాగిస్తున్నారు. దీన్ని ఎదుర్కోవటంలో వెనుకబడిన కులాలు, దళితులలోని అభివృద్ధి చెందినవారు మరో కొసకు లాగుతూ, తమ కులాలలోని పేదలను ప్రజాతంత్ర ఉద్యమం నుండి దూరంగా ఉంచే ప్రయత్నం చేస్తున్నారు. దోపిడీకి, వివక్షకు గురౌతున్న పేదలు ఐక్యం కాకుండా నిరోధించి, వారిమధ్య చీలికలను మరింత తీవ్రం చేయటానికి ఈ విధమైన ప్రయత్నాలు దోహదంచేస్తాయి.

**ఐక్యంగా పోరాడితేనే సమాజాన్ని మార్చగలం**

సమాజాన్ని మార్చటంద్వారానే అంటరానితనాన్ని, కులవివక్షను, మహిళలపట్ల వివక్షను, దోపిడీని అంతంచేయగలం. సమాజంలో దోపిడి, అంటరాని తనం, కులవివక్ష, కష్టపడేవారికి భూమిలేక పోవటం, దరిద్రం పెరగటం, విద్య, వైద్యం అందుబాటులో లేకపోవటం తదితర సమస్యలున్నాయి. ఈసమస్యలన్నీ పరిష్కారం కావాలంటే దోపిడీ వ్యవస్థను కూల్చివేసి, సోషలిస్టు సమాజాన్ని నిర్మించుకోవాలి. అందుకు కార్మిక వర్గం నాయకత్వం వహించి, ఇతర పీడితవర్గా లన్నింటినీ కలుపుకొని పోరాడాలి. అయితే కార్మికవర్గంలో అంతర్గతంగా ఉన్న సామాజిక అసమానతలు అటువంటి పోరాటానికి పరిమితు లను ఏర్పరుస్తున్నాయి. రెండు మార్గాల ద్వారా సామాజిక అసమానతలను అధిగమించ వచ్చు. ఒకటి. కార్మికవర్గం పోరాటాల ద్వారా దోపిడీ వ్యవస్థను కూల్చివేసి, తాను అధికారాన్ని సాధించాలి. అపుడు ఫ్యూడల్ అవశేషాలను నిర్మూలించి, భూపంపకం ద్వారా వివక్షకు కారణమైన భౌతిక పునాదిని ధ్వంసం చేస్తుంది.




అంటరానితనానికి వ్యతిరేకంగా కెవిపిఎస్ సైకిల్ ర్యాలీ

ప్రజలందరినీ ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములుగా చేస్తుంది. అధికారం చేతిలో ఉన్న స్థితిలో ప్రభుత్వ సంస్థలను, సమాజంలోని ప్రచార యంత్రాంగాన్నంతా వినియోగించి, అంటరానితనానికి, వివక్షకు వ్యతిరేకంగా భావజాల రంగంలో పోరాటం చేయటం ద్వారా అంటరానితనాన్ని, వివక్షను అంతం చేస్తుంది. ఈ విధంగా ఆర్థికరంగంలో పోరాటాలను తీవ్రం చేయటం ద్వారా దోపిడీ వ్యవస్థను కూల్చివేసి, అధికారాన్ని స్వాధీనం చేసుకొని, అంటరానితనాన్ని, కులవివక్షను అంతం చేయటానికి ప్రస్తుత పరిస్థితులలో అవకాశాలు తక్కువగా ఉన్నాయి.

రెండవది. కార్మికవర్గంలోనూ, సమాజంలోనూ ఉన్న అంటరానితనానికి, వివక్షకు వ్యతిరేకంగా పోరాటాలను తీవ్రం చేసి, వివక్షను నిర్మూలించటం ద్వారా, కార్మికవర్గాన్ని ఐక్యం చేసి, కార్మిక, కర్షకవర్గాల సమైక్య పోరాటాల ద్వారా దోపిడీ వ్యవస్థను కూలద్రోయవచ్చు. అంటరానితనాన్ని, వివక్షను నిర్మూలించటం వలన ఆ వర్గం బలీయమైనశక్తిగా రూపొందుతుంది. ఇందుకోసం సామాజిక సమానత్వం కోసం కార్మికవర్గంలో అంతర్గత పోరాటం జరగాలి. కార్మికులు కులాల పేరుతో కార్మిక సంఘాలను ఏర్పాటు చేసుకొంటున్నారు. యస్సి, యస్టి, బిసి సంక్షేమ సంఘాలు, కార్మిక, ఉద్యోగ సంఘాల పేరుతో కార్మికరంగంలో కులసంఘాలు ఏర్పడుతున్నాయి. మహిళా కార్మికులను, మొత్తంగా మహిళలను ప్రజాతంత్ర

(మిగతా 34వ పేజీలో)

# మతోన్మాద, నియంతృత్వ పోకడలకు ప్రతిఘటన

**నాగరాజు**

**భా**రతీయ భాషల రచయితలు సుమారు ఏభైమంది తమ కేంద్రసాహిత్య అకాడెమీ అవార్డుల్నీ, పద్మశ్రీ లాంటి బిరుదుల్నీ, అకాడెమీ పదవుల్నీ విసిరికొట్టి, రోజూ పత్రికల్లో నిరసన ప్రకటనలు చేయగా చేయగా, ప్రపంచ రచయితలు, మేధావులూ ముక్తకంఠంతో దుమ్మెత్తిపోయగా పోయగా, సాహితీ సంస్థలు కరపత్రాలూ, సమావేశాలూ వేసి గగ్గోలుగా ఘోష పెట్టగా పెట్టగా – అంతవరకు నిమ్మకు నీరెత్తిన కేంద్ర సాహిత్య అకాడెమీ 55 రోజుల తరువాత ఎట్టకేలకు కపట నిద్రలోంచి మేలుకొని ఆవులించి, పెదవి విప్పింది. దొంగపడిన ఆర్నెల్లకు ఏదో జరిగినట్లుంది! స్వయంప్రతిపత్తికి ఈ తీరులో కొత్త అర్థాన్ని ఇచ్చిన ఘనత కేంద్ర సాహిత్య అకాడెమీకే చెల్లుతుంది. ఎం.ఎం. కల్బుర్గీని – కేంద్ర సాహిత్య అకాడమీ కార్య నిర్వాహక సభ్యుణ్ని – మతోన్మాద మూకలు పొట్టన పెట్టుకుంటే – అతను అకాడెమీ అవార్డు గ్రహీత అయినాసరే **'స్వతంత్ర ప్రతిపత్తి'** కల్గినది అని చెప్పుకొంటున్న కేంద్ర సాహిత్య అకాడెమీ ఈ హత్యనీ, హేతువాదులపై హత్యల్నీ, గొడ్డు మాంసం వదంతుల దాద్రీ దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక ఇఖ్లాక్ హత్యనీ, ఉదాసీనంగా పెడచెవిని పెట్టి – ఇన్నాళ్ళూ భావప్రకటనా స్వేచ్ఛకు, ధిక్కార స్వరానికి గల హక్కుకు, జీవించే హక్కుకు సంబంధించిన మద్దతు ప్రకటన, సంతాప ప్రకటన విడుదల చేయలేకపోయిందంటే – కల్బుర్గీ లాంటివారి భిన్న భావజాలాల్ని గౌరవించలేని ఏకపక్ష ధోరణి ఏదో కేంద్ర సాహిత్య అకాడమీని పట్టి ఉందన్నది చెప్పక తప్పదు. కానీ ఇంత పెద్దఎత్తున పెల్లుబికిన రచయితల, మేధావుల ధిక్కార స్వరాల్ని గడ్డి పరకలా తీసేస్తూ – ఇదంతా కృతకంగా తయారుచేయబడిన నిరసన అనీ, దీనికేమీ విలువలేదనీ కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ కొట్టిపార వేయ చూడటమంటే – ఈ ప్రభుత్వం బాధితుల పక్షం కాదన్నది తేటతెల్లమవుతోంది.

కాగా, నిన్నగాక మొన్ననే – 22 అక్టోబరు 2015న హిందూత్వ మతోన్మాద దళాలు బేరల్ తుపాకులతో కత్తులతో విద్వేషాల్ని రెచ్చగొట్టే నినాదాలతో జమ్మూ వీధుల్లో వీరంగం వేయడం, దానికి అక్కడి పోలీసులు, అధికారులు, పారా మిలటరీ మద్ధతు తెల్పడం – ఆగస్టు 1947 నాటి మత ఘర్షణల ఉద్రిక్త పరిస్థితిని గుర్తుకు తెస్తోందని స్థానిక ముస్లింలే కాదు, హిందువులు కూడా హడలిపోతూ చెప్తున్నారు.

నిజానికి హిందూత్వ పేరిట ఉన్మాదాన్ని భుజాన వేసుకు తిరిగే ఈ శక్తులు కోరుకొనేది హిందూమతస్తుల ప్రయోజనాలు ఎంతమాత్రం కాదు. కేవలం అధికార, ఆధిపత్య, పదవీ రాజకీయ ప్రయోజనాలని మనం గుర్తించాల్సి ఉంది – తద్వారా స్థానిక భూస్వామ్య, ధనస్వామ్య పెత్తందారీవర్గాలకు, సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు దేశ సంపదల్ని కారుచౌకగా ధారపోయడమే వీరి లక్ష్యం అన్నది మోడీ ప్రభుత్వ పాలక విధానాలు ఋజువు చేస్తున్నాయి.

పదమూడేళ్ళ క్రితం గుజరాత్‌లో జరిగిన మత మారణకాండ ఆనాటి ముఖ్యమంత్రి మోడీ కనుసన్నల్లోనే జరిగినట్టు ఇటీవల భర్తరఫ్ అయిన ఐఏఎస్ అధికారి సంజీవ్‌భట్ స్వయంగా ఎప్పుడో ప్రకటించారు. దాన్ని శివసేన ఇటీవల రూఢిపరిచి, ఆ బాటలోనే తాము నడుస్తున్నామని బోర విరుచుకుని ముందుకు దూకుతున్నది. దేశ ప్రధాని కాగలిగే అర్హతకు గుజరాత్ దురంతం తనకు భుజకీర్తులుగా మురిసిపోతున్నవైనాన్ని అతని మౌనంలో మనం దర్శించవచ్చు! అలాగే మరలా – ఎన్నికల ప్రయోజనాల కోసమే ముజఫర్‌నగర్‌లో మతవిద్వేషపు ఊచకోతలు 2014లో జరిగాయన్నది బహిరంగ రహస్యం.

ఇప్పుడు బీహార్ ఎన్నికల నేపథ్యంలో బీఫ్ రాజకీయాలతో దాద్రి సంఘటనలోనూ సంగీత్‌సోమ్‌లాంటి బి.జె.పి. నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలుచేసి – మత రాజకీయాల్తో ఓటు బ్యాంకును కొల్లగొట్టే ప్రయత్నం జరిగింది. ఇదే మీడియా అంతా మారుమోగుతోంది. సంగీత్‌సోమ్‌కి బీఫ్ వ్యాపారంలో వాటాలున్నాయన్నది కాదనలేని నిజమే అయినా అదో కొత్త వివాదంగా మారింది. బీఫ్ అమ్మితే తప్పు కానిది, తింటేనే నేరం అనే ఏకపక్ష ధోరణి ఇది.

నిజానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఎన్నికల హామీలను, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైపోయాయి. దాన్ని కప్పిపుచ్చడానికే ప్రజల్లో రకరకాల సామూహిక ఉన్మాదాల్ని (Mass Hysteria) రెచ్చగొట్టడం చూస్తూనే వున్నాం. మొదట **స్వచ్ఛభారత్** అనీ, తరువాత **'యోగా'** అనీ, అటుమీదట తెలుగు రాష్ట్రాల్లో – మరో సామూహిక ఉన్మాదంగా **గోదావరి పుష్కరాలనీ, బోనాల పండగ** అనీ, **'మన నీరు – మన మట్టి'** అని అమరావతి రాజధాని కోసం మరో సామూహిక ఉన్మాదాన్ని పనిగట్టుకొని రెచ్చగొట్టడం లాంటివి చూస్తుంటే రాచరిక యుగపు చాణక్య నీతి గుర్తుకు వస్తోంది. దాని ప్రకారం ప్రజల్ని ఎప్పుడూ ఏదో ఒక పట్టరాని ఆనందంలోనో, లేదా ఓపలేని విషాదంలోనో ముంచి ఉంచాలిట. లేకపోతే పాలకుల ఆటలు సాగవట. ఈ మోడీ– చంద్రబాబు– చంద్రశేఖర్రావు మొ॥ పాలకుల వైఖరి రెండింటినీ అంటే పట్టరాని ఆనందాన్నీ, ఓపలేని విషాదాన్నీ రెండు చెంపలా సాగేలా చూడడంలో తలమునకలై ఉన్నారు.

ఎన్నికల హామీగా నల్లడబ్బు వెనక్కి తెస్తానన్నారు. కానీ విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్, రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధరా రాజే, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌లపై వచ్చిన అవినీతి ఆరోపణలను ఎదుర్కోడానికే చట్టసభల సమయం చాలటం లేదు.

నిత్యావసర సరుకుల ధరల్నీ, నిరుద్యోగాన్నీ అరికట్టలేని మోడీ ప్రభుత్వం ఆ లోపాల్ని కప్పిపుచ్చుకోడానికి గొడ్డు మాంసం వివాదాన్ని ముందుకు తీసుకు వస్తోంది – ప్రజల అనునిత్య

సమస్యల్ని మభ్యపెట్టి – కృత్రిమ సమస్యల్ని ప్రధాన సమస్యలుగా ప్రజల నెత్తిన రుద్దడం ద్వారా – ఎన్నికల హామీల్ని పక్కన పెట్టడం – కొత్త ఎన్నికల్లో మత రాజకీయాలతో పేలాలు ఏరుకోవడం – ఎత్తుగడలుగా సాగిస్తోంది.

ముడిచమురు ధరలు పడిపోయినా సరే – మార్కెట్ ధరలు మాత్రం నేలకు దిగనివ్వనంటున్నారు. 'అచ్ఛే దిన్' అంటే కొత్త అర్థం చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మతోన్మాదం – ముస్లిం వ్యతిరేకత – అగ్రకుల దురహంకార దాడులు – పురుషాధిక్యతా పైశాచికాలూ – మహిళలపై లైంగిక దాడుల పరంపర– వెరసి– రచయితల్ని, హేతువాదుల్ని చంపి, భావప్రకటనా స్వేచ్ఛనీ, ప్రశ్నించే, ధిక్కరించే గొంతుల్నీ, భిన్నాభిప్రాయాన్ని గౌరవించలేని సంకుచితత్వాన్నీ–మొత్తంగా ప్రజాస్వామిక వాతావరణాన్ని – మానవ విలువలన్నింటినీ గొయ్యితీసి పాతేస్తున్న దుస్థితి!

బిసాదా లాంటి గ్రామాల్లో సామాన్యుల ఆకలి బతుకుల్లో దూరి – ఆహార, విహారాలపై వదంతుల్నిరేపి, నిషేధాల్ని విధించి, అమానుష దాడులకు దిగడం, హర్యానాలో సన్‌పెడ్ గ్రామంలో ఇద్దరు దళిత శిశువుల్ని సజీవ దహనం చేయడం, వెనువెంటనే – సోనిపల్ జిల్లాలో 15 ఏళ్ళ దళిత బాలుడు గోవిందుడు పోలీసుల నిర్బంధ హింసకు గురై మృతి చెందడం–పసితనపు ఆడపిల్లలపై కూడా ఢిల్లీలాంటి మహానగరాల్లో విచ్చలవిడిగా నిరంతరం పైశాచిక హత్యాచారాలు రేగడం–ఇవన్నీ ఏ సాంస్కృతిక విలువల్ని సూచిస్తాయి? ఏ సామాజిక సహజీవన సూత్రానికి మూలాలని నిర్వచిద్దాం? ఇవన్నీ 'అచ్ఛే దిన్' అని నమ్మించాలని, నమ్మకపోతే భయానక పరిస్థితుల మధ్య జనం బిక్కుబిక్కుమని పడుండేలా ఎందుకూ కొరగాని మత విద్వేషాల్ని రెచ్చగొట్టడమే పరిపాలనగా సాగుతున్న ఈ నరహంతక విధానాల మధ్య సుధీంద్ర కులకర్ణి లాంటి బిజెపి విధానకర్తలకు కూడా ఉనికిలేదని మనం అర్థం చేసుకోవాలి. ప్రశ్నించేవారు తలెత్తకుండా, ప్రజలకు నిజమైన నాయకత్వం అందకుండా – ఒక సాంస్కృతిక ఉక్కబోత వాతావరణాన్ని కల్పిస్తున్న, అరాచకత్వంలో భాగంగానే – కేంద్ర సాహిత్య అకాడెమీ నిర్లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలి. ఇంతకాలానికి అది ప్రకటించిన ఖండన, సంతాప ప్రకటనల్లో చిత్తశుద్ధి పాత్ర ఎంత? అది గత్యంతరం లేక వేసిన వెనకడుగు కాదా? రచయితలకే పరిమితం చేసి సామాజిక, సాంస్కృతిక వాతావరణానికి కారకులైన మతోన్మాదశక్తులను, వారిని కాపాడుతున్న ప్రభుత్వాన్నీ ఖండించకుండా మిన్నకున్నదేమి?

**❝ నెత్తురు మరకల చేతు లతో కరచాలనం చేసిన అకాడెమీ అదే చేతు లతో భావప్రకటనా స్వేచ్ఛకై ఆగ్రహించిన కంటి నిప్పకణాల్ని తుడవాలని చూస్తున్నట్లుంది. దారుణ హత్యానేరాల్ని ఖండించటంలో జరిగిన ఈ ఆలస్యానికి అకాడెమీ ఛైర్మన్ తన పదవికి రాజీనామా చేయడం ఒక్కటే కనీస నిజాయితీ, నిబద్ధత గల ప్రాయశ్చిత్తం! ❞**



హిందూత్వ వాదుల చేతుల్లో
హత్యకు గురైన ప్రొఫెసర్ కల్బుర్గి



కేంద్ర సాహిత్య అకాడమీ వైఖరికి
నిరసనగా గొంతెత్తిన నయనతార సెహగల్

– ఇక్కడే ప్రముఖ హిందీ రచయిత ఉదయ్ ప్రకాశ్ మాటల్ని గుర్తుచేసుకుందాం.

– **"....సాహిత్య అకాడమీ ఏవో తమాషాలు చేస్తూ ఉంటుంది. నిన్నూ, నీ ప్రతిభనీ గుర్తించినట్లుగా పిలిచి అవార్డు ఇస్తుంది. తర్వాత నిన్ను నీ ఖర్మానికి వదిలేస్తుంది. ఇటువంటి సంక్షోభ సమయాల్లో నోరు విప్పదు. నీకు అండగా నిలవదు. రచయితలంతా తనవారనీ, వారిని కాపాడుకోవాలనీ దానికి ఇప్పుడేం లేదు. అందుకే రచయితలంతా ఏకం కావాల్సిన తరుణం ఇది!"**

కల్బుర్గీ హత్యకి ఇప్పటికైనా సంతాపం తెలిపాం కదా – మీ అవార్డులు వెనక్కి పుచ్చుకోండి అని యాంత్రికంగా, నిర్జీవంగా ప్రతిపాదన పెడుతున్న కేంద్ర సాహిత్య అకాడెమీ అధ్యక్షుడు – విశ్వనాథ్ ప్రసాద్ తివారీ ధోరణి ఎలా ఉందంటే–జరిగిన తీవ్రహత్యల్నీ, పరిణామాల్నీ, అకాడెమీ హాలు తివాచీ కిందికి ఊడ్చి దాచిపెట్టాలన్నట్లుంది. నెత్తురు మరకల చేతులతో కరచాలనం చేసిన అకాడెమీ అదే చేతులతో భావప్రకటనా స్వేచ్ఛకై ఆగ్రహించిన కంటి నిప్పుకణాల్ని తుడవాలని చూస్తున్నట్లుంది. దారుణ హత్యానేరాల్ని ఖండించటంలో జరిగిన ఈ ఆలస్యానికి అకాడెమీ ఛైర్మన్ తన పదవికి రాజీనామా చేయడం ఒక్కటే కనీస నిజాయితీ, నిబద్ధత గల ప్రాయశ్చిత్తం!

ఈ నేపథ్యంలో భారతదేశ రచయితలు నిర్వహించిన పాత్ర గణనీయమైనది. ఈ సందర్భంగా నయనతార సెహ్‌గల్ చేసిన ప్రకటన గమనించదగినది –

**"పాలకుల భావజాలం ఇవాళ నియంతృత్వ పోకడలు పోతోంది. అది నన్ను కలతపెడుతోంది".**

ఈ నేపథ్యంలోనే ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీకి వెళ్ళబోతున్న మోడీని ఆ విశ్వవిద్యాలయంలో అడుగుపెట్టనివ్వ వద్దని అక్కడ ఒక విద్యార్థివర్గం గట్టిగా పట్టుబడుతోంది. దాద్రీ సంఘటన నేపథ్యంలో గొడ్డుమాంసం వదంతితో సాటి మనిషిని పశువుకన్నా హీనంగా చంపడాన్ని మౌనంగా అంగీకరిస్తున్న మోడీ, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో అడుగు పెట్టడం అపకీర్తి అని వారు వాదిస్తున్నారు. ఈ సంఘటన సామాజిక మాధ్యమాల్లో గుప్పుమని ప్రచారం అవుతోంది. అంతకుముందే కెనడాలో జరిగిన పెన్ (PEN)

ఇంటర్నేషనల్ వారి 150 దేశాల రచయితల సమావేశం మోడీని అభిశంసించడం – కేంద్ర సాహిత్య అకాడెమీ మౌనాన్ని ఎద్దేవా చేయడం చిన్న విషయమేమీ కాదు.

ఈ నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి భారత దేశంలో భావప్రకటనా స్వేచ్ఛపై పడుతున్న ఉక్కుపాదాన్నీ, జీవించే హక్కుపై వేళ్ళాడుతున్న మతోన్మాద కత్తిని ఖండిస్తూ ప్రకటన చేసింది.

వీటన్నిటి మధ్యన కూడా – 21 అక్టోబరు 2015న కర్నాటక – దావణగేరెలోని దళిత కార్యకర్త–రచయిత–జర్నలిస్టు విద్యార్థి హుచంగి ప్రసాద్‌పై మత విద్వేష మూకలు దాడిచేసి, దుర్భాషలాడి, కులం గురించి, హిందూమతం గురించి ఇకముందు ఏం రాసినాసరే–వేళ్ళు తెగనరుకుతాం అని ముఖంపై కుంకుమ జల్లి హింసించారు. నీ దళితకులం నీ పూర్వజన్మ ఫలం. తెల్సుకో అని హెచ్చరించారు. హుచంగి ప్రసాద్ "వడల కిచ్చు" (వంటిమంట) అనే రచన చేసిన 23 ఏళ్ళ యువకుడు. దీని వెనుకనే – మళ్ళీ కన్నడ రచయిత కె.ఎస్. భగవాన్‌కు బెదిరింపులు వచ్చాయి. కల్బుర్గీ తరువాత నీవంతే అని హెచ్చరించారు.

ఈ దేశంలో సామాజిక బాధ్యత గల ప్రగతిశీల భావాలు గల రచయితల వర్తమాన పరిస్థితికి ఈ సంఘటనలు అద్దం పడుతున్నాయి. పెరుమాళ్ మురుగన్ అనే తమిళ రచయిత చేత – "నేను రచయితగా ఆత్మహత్య చేసుకుంటున్నాను. కేవలం ఉపాధ్యాయుడిగా బతికుంటాను" అని ప్రకటన చేయించే వరకు మత దురహంకారం కళ్ళు చల్లబడలేదు. ఆర్‌డీఓ రూపంలో ఈ ఘనకార్యాన్ని మతం – రాజ్యం చేత చేయించింది – ఈ భరతఖండం మీదే.

ప్రసిద్ధ కన్నడ రచయిత, కేంద్ర సాహిత్య అకాడెమీ మాజీ అధ్యక్షుడు యు.ఆర్. అనంతమూర్తిని మానసికంగా వేధించి పాకిస్తాన్ పొమ్మన్న మత దురహంకారం ఇంకా గుర్తొస్తూనే ఉంది! భిన్నాభిప్రాయ ప్రకటనను, భావప్రకటనా స్వేచ్ఛను, ధిక్కార స్వరాల్ని జీవించే హక్కునీ పూడ్చిపెట్టే మత ఫాసిస్టు పోకడలు పెచ్చుమీరుతున్నాయన్నది కళ్ళెదుట వాస్తవం. రాజ్యాంగం సాక్షిగా జరుగుతున్న ఈ అరాచకత్వానికి జవాబుదారీ ఎవరు? ఈ నేపథ్యంలో – అకాడెమీ బహుమతులు పొందిన రచయితలే కాకుండా – సామాజిక స్పృహకల్గిన ప్రతి రచయితా ఈ నిరసన స్వరంలో గళం కలపాల్సిన అవసరాన్ని గుర్తించాల్సి ఉంది.

వాస్తవ పరిస్థితుల నుంచి ఉత్పన్నమై, తిరిగి వాస్తవ పరిస్థితుల పరీక్షకు నిలబడేదే నిజమైన సైద్ధాంతిక జ్ఞానం! అది కల్గిననాడే – రచయితలు ప్రజల నుండి ప్రజలకు అన్నట్లు సామాజిక నిబద్ధతతో ఈ మత ఫాసిస్టు దుందుడుకు చర్యల్ని నిర్మాణాత్మకంగా తిప్పికొట్టగల్గుతారు!!

❁

# స్వీయ మానసిక ధోరణిపై పోరాడుదాం

(9వ పేజీ తరువాయి)

శ్రేయోభిలాషుల నుండి మాత్రమే సేకరించిన అభిప్రాయాల ఆధారంగా రూపొందించినవి కూడా అయిఉండవచ్చు. వారు మనలను మధ్యలో వదిలేసి వెళ్లి ఉండవచ్చు. అలా వెళ్తా రన్న అంచనా కూడా మనకు ఉండకపోవచ్చు. పై పరిణామాలకు ఇక్కడ ప్రస్తావించిన అన్ని కారణాలు దోహదం చేసి ఉండవచ్చు. లేదా ఏవో కొన్ని కారణాలు దోహదం చేసి ఉండవచ్చు.

పార్టీ నిర్మాణంలో స్వీయమానసిక ధోరణి పార్టీ కామ్రేడ్స్ మధ్య ఉండాల్సిన సరైన సంబంధాలు లేకపోవటానికి దారితీస్తుంది. వ్యక్తివాదానికి, అనారోగ్యకరమైన పోటీతత్వానికి, నేను గొప్ప అంటే నేనే గొప్ప అన్న పంతానికి పోయే ధోరణులకు దారి తీయవచ్చు. అటు వంటి పర్యవసానాలు నిర్దిష్టపరిస్థితి పట్ల నిర్దిష్ట అంచనాలు రూపొందించుకోకుండా అవాంత రాలు కలుగచేస్తాయి. ప్రజలతో పార్టీ సంబంధా లను మరింత బలహీనపరుస్తాయి.

ఇటువంటి పరిస్థితుల్లో మనం తక్షణం చేపట్టాల్సిన కర్తవ్యం ఉంది. అది పార్టీలో అన్ని స్థాయిల్లోనూ స్వీయమానసిక ధోరణిపై పోరాడటమే ఈ తక్షణ కర్తవ్యం. నిర్దిష్ట పరిస్థితుల్లో పార్టీ ఎదుర్కొంటున్న నిర్దిష్ట సవాళ్లు గురించిన నిర్దిష్ట అంచనాలు, అవగాహనలు రూపొందించు కునే క్రమంలో ఈ స్వీయమానసికధోరణిపై పోరాటం కొనసాగించాలి. నిర్దిష్ట పరిస్థితులను శాస్త్రీయ విశ్లేషణద్వారా మదింపు చేయటానికి, తద్వారా సరైన మార్క్సిస్టు లెనినిస్టు విశ్లేషణ సాధించటానికి, తదనుగుణంగా పార్టీ నిర్మాణా న్ని రూపొందించుకునేందుకు కూడా ఈ స్వీయ మానసిక ధోరణిపై పోరాటం అవసరం. అందువల్ల పార్టీ రాజకీయ ఎత్తుగడల పంథాను రూపొందించు కోవటం దీనికి ముఖ్యమైన ప్రాతిపదిక. ఈ క్రమంలో జరిగే ఏ రకమైన పొరపాట్లు అయినా తప్పుడు రాజకీయ ఎత్తుగడల పంథాకు దారితీయవచ్చు. మరోమారు పార్టీని మితవాదంవైపుకో వామపక్ష దుస్సాహసికవాదం వైపుకో నెట్టవచ్చు.

అందువల్ల భారతదేశంలో జనతా ప్రజా తంత్రవిప్లవాన్ని జయప్రదంగా ముగించటం ద్వారా దేశాన్ని సామ్యవాద భారతదేశంగా మార్చే లక్ష్యానికి కట్టుబడి పని చేస్తున్న మనం అందరం సమకాలీన పరిణామాలను మార్క్సిస్టు లెనినిస్టు పద్ధతుల్లో విశ్లేషించాలి. ముఖ్యంగా అటువంటి విశ్లేషణ ప్రయత్నం చేసేటపుడు అన్ని స్థాయిలో స్వీయమానసిక ధోరణిపై పోరాడాలి. అప్పుడు మాత్రమే దేశంలో వర్గశక్తుల బలా బలాల్లో మార్పులు తీసుకురాగలుగుతాము. విముక్తి పోరాటానికి అనుకూలంగా ఈ శక్తుల పొందికను మార్చగలుగుతాము. మన దేశంలో విప్లవాత్మకవ్యూహాన్ని సాధించేందుకు ఈ కర్తవ్యసాధన అవసరం.

సిపిఐ(ఎం) 21వ మహాసభలో సుదీర్ఘ చర్చల తర్వాత తాజా రాజకీయ ఎత్తుగడల పంథాను ఆమోదించింది. ఈ రాజకీయ ఎత్తుగడలపంథా అమలు తీరుతెన్నులు నిర్మాణ ప్లీనంలో పార్టీ సంతరించుకునే శక్తి సామర్థ్యాల పైనే, నిర్మాణ దక్షతపైనే ఆధారపడి ఉంటుంది. తద్వారా పార్టీకి ప్రజా శ్రేణులకు మధ్య ఉన్న సంబంధాలను తిరిగి బలోపేతం చేయటానికి కృషి చేయటమే మనముందున్న కర్తవ్యం.

అందువల్ల, మూడు దశల్లోనూ – నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అంచనా వేయటం లోనూ, నిర్దిష్ట విశ్లేషణకు అవసరమైన శాస్త్రీయ ప్రాతిపదికను పాటించటం ద్వారానూ, సరైన నిర్మాణ పద్ధతుల ద్వారానూ, భారతదేశపు ప్రజ లతో పార్టీ శ్రేణులకు బలమైన సంబంధాలు ఏర్పాటు చేయటంలోనూ – వివిధ దశల్లో వివిధ రూపాల్లో చొరబడే స్వీయమానసిక ధోరణులకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం సాగించటం పార్టీ యావత్తూ చేపట్టాల్సిన తక్షణ కర్తవ్యం.

**(అనువాదం : కొండూరి వీరయ్య)**

# ప్రత్యామ్నాయ విధానాలను బలపరిచేవారికి ఎల్‌డిఎఫ్‌లో స్థానముంటుంది

## సందేహాలు సమాధానాలు



**- బి.వి.రాఘవులు**

**ప్రశ్న : కమ్యూనిస్టులు దేశ స్వాతంత్ర్యం కోసం అనేక త్యాగాలు, బలిదానాలు చేశారు. కార్మిక, ప్రజా ఉద్యమాలు నిర్మించారు. మొదట సంపూర్ణ స్వాతంత్ర్యం నినాదాన్నిచ్చింది కూడా కమ్యూనిస్టులే. 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని కమ్యూనిస్టులు ఉత్సవంగా జరుపుకొన్నారు. ఎ.కె.జి. జైల్లో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. సిపిఎం తన కార్యక్రమంలో ఆగస్టు 15ను దేశ స్వాతంత్ర్యంగా పేర్కొంది. ఇన్ని త్యాగాలు స్వాతంత్ర్యం కోసం చేసిన కమ్యూనిస్టులు స్వాతంత్ర్యం దినోత్సవాన్ని ఎందుకు జరపడం లేదు. జాతీయ పతాకాన్ని ఎందుకు ఎగురవేయడం లేదు?**

**– బి.టి. రావు**, విజయవాడ.

1947 ఆగస్టు 15న భారతదేశం స్వతంత్రదేశంగా అవిర్భవించింది బ్రిటీష్ పాలకులను పంపించి, దేశీయుల పాలనకిందకు మన దేశం వచ్చింది. సుదీర్ఘ కాలంలో పాటు దేశ ప్రజలకు ప్రాతి నిధ్యం వహించి పార్టీలు సంస్థలు విప్లవకారులు నిర్వహించడం ప్రజా ఉద్యమం పరకాష్ఠగా ప్రజా పోరాటాలతో స్వాతంత్రం సిద్ధించింది. అందువల్ల మనకు ఆగస్టు 15 గర్వకారణం. జాతీయ జెండా ఎగురవేసే సందర్భంలో స్వాతంత్రదినోత్స వేడుకల్లో కమ్యూనిస్టులు కూడా పాల్గొంటున్నారు. అయితే ఆగస్టు 15 స్వాతంత్రంతోటే భారత ప్రజల సమస్యలు పరిష్కారమయ్యాయని సిపిఎం భావించటం లేదు. స్వాతంత్రం తరువాత దేశంలో అధికారం దేశీయ దోపిడి వర్గాల చేతుల్లోకి వచ్చింది తప్ప కమ్యూనిస్టులు కోరుకుంటున్న దోపిడి రహిత సోషలిస్టు వ్యవస్థను ఇంకా సాధించాల్సి ఉంది. ప్రస్తుతానికి దేశాన్ని పాలిస్తున్న పెట్టుబడి దారి భూస్వామ్య పాలకుల స్థానంలోకార్మిక కర్షక పాలనను స్థాపించుకోవాల్సిఉంది. అందువలన 1947లో స్వాతంత్ర్యాన్ని సాధించడం దేశ చరిత్రలో గొప్ప మూల మలుపు అయినప్పటికీ పీడిత ప్రజల పార్టీగా కమ్యూనిస్టు పార్టీ ఇంకా భవిష్యత్‌లో సాధించాల్సినదానిమీద కేంద్రీకరించాల్సి ఉంది. అందువలన బూర్జువా పార్టీల మాదిరిగా 1947 ఆగష్టు 15తోనే దేశ భవిష్యత్ అంతా సంపూర్ణమై పోయినట్టుగా వ్యవహరించకుండా ఇంకా సాధించాల్సిందానిమీద దృష్టి పెడుతున్నది. స్వాతంత్ర దినోత్సవాన్ని గౌరవిస్తూనే ఇంకా సాధించాల్సినదానిపై కేంద్రీకరిస్తున్నది.

### యువ కార్యకర్తల స్టడీ సర్కిల్‌లో వచ్చిన ప్రశ్నలు

**ప్రశ్న : మనం ఎల్‌డిఎఫ్‌కి పెట్టిన ప్రాతి పదిక ప్రకారం సరళీకరణ విధానాల్ని, మతోన్మాదాన్ని, సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తా నని వైసిపి చెబితే మనం ఎన్నికల పొత్తు పెట్టుకుంటామా?**

పార్టీ 21వ మహాసభలో వామపక్ష ప్రజాతంత్ర్య సంఘటన నిర్మాణం కీలక కర్తవ్యంగా నిర్ణయించబడింది. అందుకు పనికి వచ్చే శక్తులను కూడగడతామని ప్రకటించింది. సరళీకరణ విధానాలను, మతోన్మాదాన్ని, సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే శక్తులన్నీ ఎల్‌డిఎఫ్‌లో భాగస్వాములు అయ్యేట్లుగా కృషి చేయాల్సి ఉంది. వామపక్ష పార్టీలు, వర్గ ప్రజా సంఘాలు, సామాజిక శక్తులు, అభ్యుదయ శక్తులు, ఇతర పార్టీల్లో కూడా పై మూడు లక్ష్యాలకు కట్టుబడిన వ్యక్తులుంటే అటువంటి వారు ఎల్‌డిఎఫ్ నిర్మాణానికి తోడ్పడతారు. దేశంలో బూర్జువా, భూస్వామ్య పార్టీలు ఎల్‌డిఎఫ్‌లో భాగస్వాములు కాజాలవు. వాటి విధానాలు ఇందుకు అనుగుణంగా లేవు. వైఎస్ఆర్ పార్టీ ఇప్పటి వరకు ప్రకటించిన విధానాలు కూడా అందుకు అనుగుణంగా లేవు. అది కూడా ఒక ప్రాంతీయ బూర్జువా భూస్వామ్య పార్టీయే. అయితే ఏదైనా ఒక పార్టీ తన ప్రస్తుత స్వభావాన్ని మార్చుకుని ప్రజా స్వామిక స్వభావాన్ని సంతరించుకుంటే అటువంటి శక్తులను కలుపుకురావడానికి మార్క్సిస్టు పార్టీ వెనకాడదు. వైఎస్ఆర్ పార్టీ అటువంటి పద్ధతుల్లో మార్పు చెందుతుందా? లేదా? అనే ఊహాగానాలు చేసి దాని ప్రాతి పదికగా సమాధానాలు చెప్పుకోవడం సరికాదు. ప్రస్తుతం ఆ పార్టీకి ఎల్‌డిఎఫ్‌లో భాగస్వామి కాగల విధానాలు లేవు. భవిష్యత్ గురించి భవిష్యత్‌లోనే పరిశీలించాలి.

**ప్రశ్న : ఎల్‌డిఎఫ్ ఏర్పాటు చేయ్యటంలో మనం కీలక పాత్ర వహిస్తాం వాటి విధి విధానాలను కుడా రూపొందిస్తాం. కాని బీహార్, పాండిచ్చేరి మొదలగు రాష్ట్రాల్లో మనకంటే సిపిఐ బలంగా ఉంది కదా అక్కడ వారు ఎల్‌డిఎఫ్‌లో కీలక పాత్ర వహిస్తారు కదా. మరి వారు మన అభిప్రాయాలకు భిన్నమైన అభిప్రాయలను తీసుకుంటే అప్పుడు మనమేమి చేస్తాం?**

వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణంలో వామపక్షాల ఐక్యత కీలకమైనది. ఇందులో వామపక్షాల్లో పెద్ద పార్టీలుగా ఉన్న సిపిఎం, సిపిఐ మధ్య ఏకీభావానికి మరింత ప్రాధాన్యత ఉంటుంది. రెండు పార్టీల మధ్య అభిప్రాయ విభేదాలు ఉంటే వాటిని పరిష్కరించుకుని ముందుకు పోవాల్సి ఉంటుంది. పాండిచేరిలో గాని, బీహార్‌లో గాని, మరే ఇతర రాష్ట్రంలో గాని సిపిఐ బలంగా ఉంటే వామపక్ష ఐక్యతను బలపర్చడంలో ఆ పార్టీ ఎక్కువ బాధ్యతను నిర్వహించాలి. సిపిఎం, ఇతర వామపక్ష పార్టీలు ఎక్కడ బలంగా ఉంటే అక్కడ ఆ పార్టీలు ఐక్యతను నిర్మించడానికి ముందు పీఠిన ఉండాలి. ఈ క్రమంలో భిన్నాభిప్రాయాలు వస్తే వాటిని పరిష్క రించుకుని ముందుకు పోవడం తప్ప, మరో గత్యంతరం లేదు. ఏదైనా ఒక వామపక్ష పార్టీ ఐక్యతకు తోడ్పడకుండా తీవ్రమైన ఆటంకాలు కల్పిస్తుంటే మిగతా వామపక్షాలైనా ఐక్యతను ముందుకు తీసుకునిపోవాల్సి ఉంటుంది.

**ప్రశ్న : పార్టీ జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి కమిటీల్లో పార్టీ క్యాడర్ హోదాను పార్టీ పూర్తికాలం కార్యకర్తలకేనా? పార్టీ సాధారణ సభ్యుడికి అవకాశం ఉంటుందా?**

కమ్యూనిస్టు పార్టీకి సహకరించేవారు అనేక రకాలుగా ఉంటారు. పార్టీ అభిప్రాయాలతో ఏకీభవిస్తూ అవకాశం ఉన్నమేరకు పార్టీకి సహకరించే సానుభూతిపరులుంటారు. తమ వృత్తులను తాము చేసుకుంటూనే పార్టీ చేసే నిర్ణయాలను అమలు జరుపుతూ, పార్టీ నిబంధనావళికి లోబడి పనిచేసే పార్టీ సభ్యులు ఉంటారు. పార్టీ సభ్యులకు కొన్ని బాధ్యతలు, కొన్ని హక్కులు ఉంటాయి. అలాగే మరో వృత్తి చేసుకోకుండా ప్రజా కార్యక్రమాలే నిత్యం చేస్తూ, పూర్తి సమయాన్ని వెచ్చించడానికి కొంత మంది పార్టీ సభ్యులు ముందుకొస్తారు. అటువంటి వారిలో సైద్ధాంతిక అవగాహన, తగినంత నైపుణ్యం ఉ

న్నవారిని గుర్తించి పార్టీ పూర్తికాలం కార్యకర్తలుగా అంగీకరిస్తుంది. అటువంటి వారిని హోల్‌టైమర్స్ అంటారు. వేరే వృత్తి లేకుండా పూర్తికాలం పార్టీ వెచ్చించనివారిని హోల్ టైమర్స్ అనము. క్యాడర్ అనే పదానికి, హోల్‌టైమర్ అనే భావానికి కొంత వ్యత్యాసం ఉన్నది. పూర్తికాలం కార్యకర్తలుగా పార్టీ గుర్తించకపోయినా, ఆ స్థాయిలో పనిచేస్తూ పార్టీ కమిటీల్లో నాయకత్వ బాధ్యతలు నిర్వహించే వారు కొందరుంటారు. పూర్తికాలం కార్యకర్తలతో పాటు, ఇటువంటి వారిని కూడా కలిపి కేడర్ అంటుంటాము. సాధారణమైన పార్టీ సభ్యులు పార్టీ కేడర్‌గా, హోల్‌టైమర్స్‌గా ఎదగడానికి అనర్హులేమీ కాదు. కానీ అటువంటి బాధ్యతను నిర్వహిస్తేనే ఆ హోదా లభిస్తుంది.

**ప్రశ్న : సిపిఐ నుండి 1964లో సిపిఐ (ఎం)గా బలపడినప్పుడు జరిపి మొదటి మహాసభను - మొదటిదిగా కాకుండా 7వ మహాసభగా ఎందుకు జరిపారు?**

1964లో కమ్యూనిస్టు పార్టీ విడిపోయినప్పుడు రెండు పార్టీలు కమ్యూనిస్టు పార్టీలుగానే ప్రకటించుకున్నాయి. ఎన్నికల్లో పోటీ చేయాల్సి వచ్చేప్పటికీ రెంటికీ మధ్య తేడాను వ్యక్తం చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఎన్నికల కమిషన్ ముందు అటువంటి పద్ధతుల్లో గుర్తింపు పొందడానికి మనం పార్టీ పేరు ప్రక్కన మార్క్సిస్టు చేర్చుకున్నాము. ఎన్నికల సుత్తీ కొడవలి నక్షత్రం ఉన్న కొత్త ఎన్నికల గుర్తును పెట్టుకున్నాము.

ఉమ్మడి పార్టీకి నిజమైన వారసులం మనమే అన్న భావాన్ని వ్యక్తం చేయడానికి సంకేతంగానే మహాసభను 7వ మహాసభగా ప్రకటించడం జరిగింది.

**ప్రశ్న : పార్టీ సాధారణ కార్యకర్త పొరపాటు చేస్తే పెద్దఎత్తున చర్యలుంటాయి. కేంద్ర కమిటీ ఆమోదించిన ఎత్తుగడలు పార్టీ బలాన్ని పెంచకపోగా పార్టీ బలహీనపడింది. దీనికి పార్టీ కేంద్ర కమిటీ "సమిష్టి బాధ్యత" వహిస్తుందా? వారిపై చర్యలు చేపడతారా? లేదా మరలా మహాసభలో ఎత్తుగడలు రూపొందించుకుంటారా?**

ప్రపంచంలోనూ, దేశంలోనూ వామపక్ష ఉద్యమం, కమ్యూనిస్టు ఉద్యమం బలహీనం కావడానికి అనేక కారణాలు ఉన్నాయి. మార్క్సిస్టు పార్టీ ప్రజా పునాది బలహీనపడడానికి వాటన్నింటి ప్రభావం ఉన్నది. వాటితో పాటు, పార్టీ అనుసరించిన రాజకీయ విధానంలో దొర్లిన కొన్ని పొరపాట్లు, నిర్మాణ అంశాలను అమలు జరపడంలో జరిగిన కొన్ని లోపాలు కూడా పార్టీ పురోగమనానికి ఆటంకం కలిగించాయి. వాటన్నింటినీ పరిశీలించి పరిష్కరించుకునేందుకే డిశంబర్ 26-31 వరకు కలకత్తాలో పార్టీ అఖిల భారత ప్లీనం జరుగుతున్నది. ఈ ప్లీనంకు కేంద్ర కమిటీ, పోలిట్ బ్యూరో ఒక ఆత్మ విమర్శనాత్మకమైన ముసాయిదా నివేదికను ప్రవేశపెట్టబోతున్నది. పార్టీ అఖిల భారత నాయకత్వం వైపు నుండి జరిగిన లోపాలను వాటిని నిర్మొహమాటంగా వెల్లడించబోతున్నది. లోపాలను అధిగమించే పరిష్కారాలు కూడా ప్లీనంలో తప్పకుండా రూపొందించబడతాయి.

# అంటరానితనం వివక్ష-దోపిడీ

(29వ పేజీ తరువాయి)

ఉద్యమం నుండి దూరంగా ఉంచటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇటువంటి స్థితిలో కార్మికవర్గాన్ని పెట్టుబడిదారీ విధానాన్ని కూల్చే పోరాటానికి ఏకోన్ముఖంగా నడపటం సాధ్యమౌతుందా? అందువలన కార్మికవర్గంలో ఉన్న అంటరానితనం, కుల వివక్షలకు వ్యతిరేకంగా, శక్తివంతమైన సామాజిక పోరాటాలు జరగాలి. కార్మికవర్గంలో అంటరానితనం, వివక్ష నిర్మూలింపబడితేనే ఆ వర్గం బలమైనశక్తిగా రూపొందుతుంది. కార్మిక వర్గంపై దాడులు చేస్తున్న ద్రవ్యపెట్టుబడులపైనా, పాలకవర్గాల పైనా శక్తివంతంగా పోరాడగలుగుతుంది. కార్మిక వర్గంలో వివక్షకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు కార్మిక సంఘాలు నాయకత్వం వహించాలి. తన పరిధిలో ఉన్న కార్మికులతో పాటు మొత్తం కార్మికవర్గాన్ని ప్రభావితం చేసే విధంగా ప్రచారం నిర్వహించాలి. ఆచరణలో కార్మికుల మధ్య వివక్షను నిర్మూలించే కార్యక్రమాలను రూపొందించి, అమలు చేయాలి. ఈ పోరాటాలు ఎంత తీవ్రంగా జరిగితే కార్మికవర్గంలో ఉన్న అంటరానితనాన్ని, అంతర్గత వివక్షను నిర్మూలించేందుకు అంత త్వరగా మార్గం సుగమం అవుతుంది. అంతర్గత వివక్ష బలహీనపడుతున్న మేరకు ఐక్యత బలపడి, ద్రవ్య పెట్టుబడులకు, పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలు బలపడతాయి. సమాజంలో ఉన్న అంటరానితనం, వివక్షకు వ్యతిరేకంగా కూడా పోరాటాలు జరగాలి. వివక్షకు వ్యతిరేకంగా సామాజిక ఉద్యమాలు జరగాలి. గ్రామీణ ప్రాంతంలో జరిగే ఉద్యమాలకు వ్యవసాయ కార్మిక, రైతు ఉద్యమాలు నాయకత్వం వహించాలి. పట్టణాలు, నగరాలలో జరిగే పోరాటాలకు కార్మిక సంఘాలతో పాటు వివిధ ప్రజాసంఘాలు నాయకత్వం వహించాలి. కార్మికవర్గంలోనూ, సమాజంలోనూ అంటరానితనానికి, వివక్షకు వ్యతిరేకంగా జరిగే మొత్తం ఉద్యమానికి వామపక్షాలు, అభ్యుదయ శక్తులు నాయకత్వం వహించాలి. అంటరానితనం, వివక్షకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి కార్మికరంగంలోనూ, సమాజంలోనూ ఉన్న అభ్యుదయశక్తుల మద్దత్తు సంపాదించటానికి, శక్తివంతమైన ఉద్యమాన్ని నిర్వహించటానికి ఈ శక్తులు కృషి చేయాలి. ఈవిధమైన పోరాటాలద్వారా అంటరానితనాన్ని, వివక్షను నిర్మూలించటానికి మార్గం సుగమమౌతుంది.

కార్మికవర్గ ఐక్యత బలపడి, ద్రవ్య పెట్టుబడుల దాడికి వ్యతిరేకంగా బలమైన పోరాటాలు చేయలేకపోతే కార్మికవర్గానికి ఉన్న హక్కులన్నింటినీ హరించివేస్తారు. కార్మికవర్గాన్ని చీలికలుపేలికలు చేస్తారు. కార్మికవర్గంలో అంతర్గత ఘర్షణలు పెంచి, ఆత్మహత్యా సదృశ్యమైన పోరాటాలలో మునిగిపోయేలా చేస్తారు. ద్రవ్య పెట్టుబడులు, ఫ్యూడల్ అవశేషాలు బలం పుంజుకుని, అంటరానితనాన్ని, వివక్షను మరింత తీవ్రం చేస్తాయి. కార్మికవర్గాన్ని, శ్రామిక ప్రజలను మరింత బలహీనపరుస్తాయి. అందువలన కార్మికవర్గం తనలో అంతర్గతంగా ఉన్న అంటరానితనం,వివక్షలను నిర్మూలించి, సమాజంలో అంటరానితనం, వివక్షలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు నాయకత్వం వహించాలి. శ్రమ జీవుల మధ్య సంపూర్ణ సామాజిక ఐక్యత సాధించి, ఏకోన్ముఖంగా ద్రవ్య పెట్టుబడులపై పోరాటానికి సిద్ధం అయితే, ద్రవ్యపెట్టుబడుల దాడిని తిప్పి కొట్టటం సాధ్యం అవుతుంది. ఆ పోరాటాలను ముందుకు తీసుకుపోవటం ద్వారా పెట్టుబడిదారీ వర్గపాలనను అంతం చేయటానికి అనుకూలమైన పరిస్థితులు ఏర్పడతాయి.

అందువలన ప్రస్తుత దశలో కార్మికవర్గం ద్రవ్యపెట్టుబడులు, పెట్టుబడిదారుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తూనే, సామాజికంగా అంటరానితనం, కులవివక్షలకు వ్యతిరేకంగా పోరాటాలను తీవ్రం చేయాలి. ఈ విధమైన పోరాటాలు జరిగితేనే దోపిడీ వ్యవస్థను కూల్చి వేయగలశక్తిగా కార్మికవర్గం రూపొందుతుంది.

# కోదండ రామిరెడ్డి

(2వ పేజీ తరువాయి)

పల్లి రజాకారుల క్యాంపు వల్ల ఈ ప్రాంతం ప్రజలు దౌర్జన్యాలకు, దోపిడీలకు, గృహ దహనాలకు గురవుతుండడంతో స్థానిక దళాలు క్యాంపును ఎత్తివేయడం కోసం పథకం పన్నాయి. కోదండ రామిరెడ్డి నాయకత్వంలో రాత్రి 12 గంటల సమయంలో 150 మంది దళసభ్యులు, 1000 మంది ప్రజల సహకారంతో దాడికి పూనుకున్నారు. రెండు ఆధునిక రైఫిల్స్ ఉండగా, 100 బర్మార్లు, కత్తులు, గొడ్డండ్లు, బల్లేలు, కర్రలతో మాత్రమే రజాకారులపై దాడిచేసి విజయం సాధించారు. దీంతో క్యాంపు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది.

1948 జులై నెలలో ఖాసీం రజ్వీ తమ్ముడు తయ్యబ్ రజ్వి బ్రాహ్మణపల్లిపై 150–200 మంది పోలీసు రజాకారులు దాడిచేసి కోదండ రామిరెడ్డి ఇంటిని పూర్తిగా కాల్చివేశారు. పాలేర్లను పొలిమేరల్లో కాల్చిచంపారు. అదే సమయంలో రామిరెడ్డి అనుచరులు కందాడి బాల్‌రెడ్డి, మడేల్ రాజయ్య, కందాడి వెంకట్ రెడ్డిలను పట్టుకొని కాల్చివేశారు. బొల్లేపల్లిలోని రావి నారాయణరెడ్డి పాలేర్లు ముగ్గురిని హత్యచేశారు. 1949 జూన్ 6న కోదండ రామిరెడ్డి తన అనుచరులతో బ్రాహ్మణపల్లి పొలిమేరలోని మంగలోని బావివద్దకు చేరుకోగా రైతులు భోజనం పెట్టారు. అదేరోజు సాయంకాలం సురుకంటి పెంటారెడ్డి ఇంటినుంచి భోజనం తీసుకురమ్మని కొరియర్ కొలను శివారెడ్డిని గ్రామానికి పంపించారు. భోజనాలు తీసుకువస్తున్న కొరియర్‌ను అనుసరిస్తూ శివారెడ్డిగూడెం గ్రామానికి చెందిన గుంటయ్య తన వెంట తీసుకువచ్చిన సైనికులు దొంగచాటున రామిరెడ్డిపై కాల్పులు జరిపారు. ఇంతకాలం ప్రజలకు అండగా పెద్దన్నగా ఉన్న కోదండ రామిరెడ్డి వటవృక్షం కూలిపోయింది. అలుపెరగని గెరిల్లా పోరాటాలు సాగించి రజాకారుల గుండెల్లో సింహస్వప్నమైన కోదండ రామిరెడ్డి 27 ఏళ్ళ చిరుప్రాయంలోనే కన్నుమూశారు. రాంరెడ్డి మృతదేహాన్ని తన తల్లి రుక్కమ్మ సహకారంతో కలిసి ప్రజల దర్శనార్థం ఉంచగా సైనికులు బలవంతంగా భువనగిరికి తీసుకువెళ్ళారు. ప్రజలు కన్నీరుపెట్టినా, తల్లి రోదిస్తూ అధికారుల కాళ్ళావేళ్ళాపడినా శవాన్ని దహన సంస్కారానికి ఇవ్వలేదు. సైనికులే స్వయంగా భువనగిరి, నల్లగొండ రోడ్డుపై పూడ్చివేశారు. ఆప్తుణ్ణి, ప్రియతమ నాయకుణ్ణి కోల్పోయిన ఈ ప్రాంత ప్రజలు కన్నీటితో గడపలు కడుక్కున్నారు. పెద్దన్నకు నీరాజనాలు అర్పించారు. కథలు, పాటలు పాడారు.

**మరికొన్ని దాడులు**

తెలంగాణ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవడానికి నిజాం నిరంకుశ పాలనపై సాగించిన పోరులో అసువులు బాసిన తెలంగాణ పోరాట యోధులందరిని స్మరించడం మనందరి బాధ్యత. దొడ్డి కొమరయ్య వీర మరణం తర్వాత ఉద్యమం మరింత ఊపందుకుంది. నలువైపులా విస్తరిస్తున్న ఉద్యమాన్ని చూసి ఉవ్వెత్తున కదులుతున్న జనాన్ని చూసి గడగడలాడిన జమిందారు, నైజాం ప్రభుత్వం మార్షల్‌లా ప్రకటించి గ్రామాలపై సాయుధ దాడులను పూనుకుంది. అర్ధరాత్రుల్లో గ్రామాలను చుట్టివేసి ప్రజలను చిత్రహింసలు పెట్టి మానభంగాలు, లూటీలు విచ్చలవిడిగా సాగిస్తూ భయానక వాతావరణాన్ని సృష్టించింది. ఈ దాడుల నుంచి ప్రజలను, ఉద్యమాన్ని కాపాడుకోవటానికి కార్యకర్తలంతా అజ్ఞాతవాసంలోకి వెళ్ళి, తమ కార్యకలాపాలను రహస్యంగా కొనసాగించారు. అడ్డగూడూరులో రజాకారు క్యాంపు పెట్టడానికి వచ్చిన నిజాం పోలీసు అడ్డం అమీనును తరిమివేయడానికి గెరిల్లాలతో పాటు వందలాదిమంది వాలంటీర్లు తోడై బాజాభజంత్రీలతో ఎర్ర జెండాలు పట్టుకొని కదలివచ్చారు. దళం, జనం, కమ్మగూడెం వచ్చేసరికి చీకటిపడింది. ఆ రాత్రి అక్కడే ఆగి, తెల్లవారి దాడికి వెళ్దామని ఉండగా తెల్లవారకముందే పోలీసు, రజాకారు బలగాలు మూలరేగడిపై దాడిచేశాయి. గెరిల్లాలు మేల్కొనకముందే వచ్చిన పోలీసు, రజాకార్లపై ప్రజలు లాఠీలు వొడిసెలలతో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంలో పోలీసు, రజాకారు ముష్కరులు నిరాయుధ ప్రజలపై కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో కన్నెబోయిన సాయన్న, పొడిచేడు లింగయ్య ప్రాణాలను కోల్పోయారు. ఇద్దరు నేలకొరగడంతో జనం చెదిరిపోగా గెరిల్లాలు, దళ నాయకులు ముందుకు వచ్చారు. విచ్చలవిడిగా పోలీసు, రజాకారు మూకల నుంచి నలుగురు నేలకొరగడం, మరికొందరు గాయపడి పారిపోయారు. గెరిల్లాలు ఉన్న కొద్దిమంది జనాలు తోడుచేసుకొని కొనప్రాణంలో ఉన్న కన్నెబోయిన సాయన్నకు పాలు తాపుతుండగా పూర్తిగా తెల్లవారింది. తర్వాత పోలీసు, రజాకారు మూక మళ్ళీ దాడికి వచ్చింది. వారు ఊరులోకి రాకుండా వాళ్ళను రెండు, మూడు గంటలు నిలేశారు. శతృవు అత్యాధునిక ఆయుధాలతో ఉండగా మామూలు బర్మార్ తుపాకులు, టూ వెల్ బోర్‌లాంటి చిన్న ఆయుధాలతో పోరాడడం సాధ్యపడదని గుర్తించి గెరిల్లాలు తప్పుకున్నారు. గెరిల్లాలు తప్పుకున్న ఎంతోసేపు తర్వాత కూడా కమ్మగూడెంలోకి అడుగుపెట్టడానికి వారు సాహసించలేదు. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో పోలీసు రజాకారు మూకలపై ప్రజలు, దళాలు దాడులకు దిగాయి. ఈ దాడుల్లో అనేకమంది దళ నాయకులు, ప్రజలు నేలకొరిగారు. ఫ్యూడల్, జమిందారీ, రాచరిక వ్యవస్థను నరకకూపంలాంటి ఆ బందిఖానా రాజ్యాన్ని కూకటివ్రేళ్ళతో పెకలించివేసిన ఆ మహత్తర పోరాటంలో స్మృతి చిహ్నాలుగా, ప్రత్యక్ష సాక్ష్యాలుగా పోరాటంలో బలైన అమరవీరుల స్థూపాలు నిలిచి ఉన్నాయి.

**(ఈ వ్యాసం 'సై.. సై... ఓ నల్లగొండ వీరుండా' పుస్తకం నుండి గ్రహించబడినది)**

---

# మోడీ సిలికాన్ పర్యటన

(25వ పేజీ తరువాయి)

చేసుకోమని బహుళజాతి ఐటి కంపెనీలను మోడీ ఆహ్వానిం చారు. వాళ్ళు ఆయనకు అత్యధిక ప్రచార హోదాను కల్పిస్తున్నారు. ఈ కంపెనీలన్నీ తమ దగ్గరున్న డేటాను, సమాచారాన్ని అమెరికా జాతీయ నిఘా సంస్థకు ఎప్పటికప్పుడు అంద జేస్తున్నారు. దానికి ప్రతిఫలంగా మోడీకి ఇంటర్నెట్‌లో, సామాజిక మాధ్యమంలో అత్యధిక ప్రచారాన్ని ఇస్తున్నారు. ఆయనకు వ్యతిరేకంగా జరిగే ప్రచారాన్ని అడ్డుకోవటం లేదా ఆలస్యం చేయటం చేస్తున్నారు (తమకు కావలసింది 8 సెకండ్లలో రాకపోతే వినియోగదారులు మరో సైట్‌కు మరలిపోతారు). భారతదేశ భారీ ఐటి కంపెనీలు భారత్ మార్కెట్‌కంటే అవుట్ సోర్సింగ్‌పై ఆసక్తితో ఉన్నందున, వాళ్ళు విదేశీ కంపెనీలతో సంబంధ బాంధవ్యాలను పెంచు కొని మనదేశం వెలుపల వారి మార్కెట్‌ను విస్తరించుకుంటున్నారు. తమకు సంబంధ బాంధవ్యాలున్న బహుళజాతి కంపెనీలను మోడీ భారత మార్కెట్‌కు ఆహ్వానించటం సహజంగా భారతదేశ భారీ ఐటి కంపెనీలకు ఆనందంగా ఉంటుంది. ఇందుకోసం భారతదేశంలో కార్పొరేట్లు, కార్పొరేట్ మీడియాల మద్దతు పొందటంలో మోడీకి ఎటువంటి సమస్యా లేదు. నరేంద్ర మోడీకి సొంత ప్రచారానికి మించి, మనదేశం యొక్క నిజమైన అభివృద్ధి సాధన ఆయన ఎజెండాలో ఉండే ప్రశ్నే లేదు.

**(స్వేచ్ఛానువాదం : కొండముది లక్ష్మీప్రసాద్)**



# కామ్రేడ్స్, గుడ్డిగా వ్యవహరించకండి! యజమానులు వేసే ఎరలకు మోసపోకండి!!

"నవంబరు 6, 7 తారీఖులు మనందరికీ గుర్తుంచుకోదగినవిగా ఉన్నాయి. యజమానుల వత్తిడిని దృఢంగా ఎదుర్కొని, కష్టసమయాలలో అందరి ప్రయోజనాల పరిరక్షణ కోసం నిలబడే వారున్నారని నేతకార్మికులు రుజువు చేశారు. యజమానులు అంతంలేని తమ కోర్కెలను నెరవేర్చుకోవటం, అడుగులేని తమ పర్సులను నింపుకోవటం కోసం అన్ని సమయాలలోనూ మనల్ని బానిసలుగా మార్చుకోవటంలో విజయం సాధించలేరని కార్మికులు రుజువు చేశారు. మన కోర్కెలను నెరవేర్చుకోవటానికి దృఢంగా నిలబడి చివరి వరకు పోరాడాలి. మనందరం ఐక్యంగా కృషి చేయటం ద్వారా మాత్రమే మన పరిస్థితులను మెరుగుచేసుకోగలం. కామ్రేడ్స్, అదే సమయంలో థోర్న్టన్ మనకోసం చాలా తెలివిగా, మోసపూరితంగా రూపొందించిన ఉచ్చులో మనం పడకూడదు. వారి వాదన ఈ విధంగా ఉంటుంది." మన సరుకులను అమ్ముకోవటంలో ఆటంకాలు ఎదురౌతున్నాయి. మనం కార్మికుల పని పరిస్థితులను గతంలోలాగే ఉంచితే గతంలో పొందిన లాభాలను పొందలేము. అప్పటికన్నా తక్కువ లాభాలను తీసుకోవటానికి మనం సిద్ధంగాలేం. కాబట్టి మార్కెట్‌లో ఉన్న తక్కువ ధరల భారాన్ని కార్మికులు భరించేలా వారిపై మన దోపిడీని పెంచాలి. దీనిని పాత పద్ధతిలో కాకుండా చాలా తెలివిగా, వాళ్ళకోసం మనం ఎటువంటి ఉచ్చును తయారు చేస్తున్నామో కార్మికుల అమాయకపు బుర్రలకు అర్థంకాని విధంగా చేయాలి. వారందరిపైనా మనం ఒక్కసారిగా భారాల్ని మోపటానికి ప్రయత్నం చేస్తే వారందరూ ఉమ్మడిగా ప్రతిఘటిస్తారు. వారిని మనం అదుపుచేయలేం. మొదటగా మనం తీవ్రదుస్థితిలో ఉన్న కార్మికులను మోసం చేసి, మన అదుపులోకి తెచ్చుకోవాలి. తర్వాత మిగతా వాళ్ళు దారిలోకి వస్తారు". అని చెపుతారు.

"కార్మికుల సంక్షేమాన్ని గురించి తీవ్రంగా ఆందోళన చెందుతున్నట్లు నటించే యజమానులు గతంలోనే వివిధ డిపార్ట్‌మెంట్లలో కార్మికులపై మోపిన భారాల్ని ఇపుడు నిశ్శబ్దంగా నేతకార్మికులపై మోపటానికి దృఢంగా ప్రయత్నిస్తున్నారు. నేత షెడ్లలోని పరిస్థితుల పట్ల మనం పట్టనట్లుగా వ్యవహరిస్తే మన గొయ్యిని మనమే తవ్వుకున్నట్లు అవుతుంది. తర్వాత ఆ గోతిలోకి మనల్ని తోసివేస్తారు. నేతకార్మికులు 15 రోజులకు 3 రూబుళ్ళ 50 కోపెక్కులు సంపాదిస్తున్నారు ఏడుగురున్న కార్మికుల కుటుంబం.వారు అతి దుర్భరమైన శ్రమతో సంపాదించుకున్న బట్టలన్నింటనీ అమ్ముకొని, అత్యంత హీనమైన వాటితో జీవిస్తున్నారు. ఇదే సమయంలో వారికి సహాయం చేస్తున్నామని చెప్పుకుంటున్న థోర్న్టన్‌లు ముందే సంపాదించుకున్న లక్షలాది రూపాయలకు అదనంగా లక్షల రూపాయల లాభాలను తోడుచేసుకున్నారు.

"వారు మననేత కార్మికులను అణచివేయటానికి ప్రయత్నిస్తున్నారు. నేత కార్మికులకు 15 రోజులకు ఒక రూబుల్ 62 కోపెక్కులు చెల్లించటం కొన్ని నేతషెడ్లలోని వేతనాల పుస్తకాలో ఇప్పటికే కనిపిస్తున్నది. కొన్నిరోజుల తర్వాత నేతషెడ్లలోని కార్మికులందరికీ ఇదే మొత్తం చెల్లించటం సర్వసాధారణంగా మారవచ్చు. కామ్రేడ్స్, యజమానుల నుండి ఇదే విధమైన దయాగుణాన్ని మీరుకూడా కోరుకుంటున్నారా? అలాకానట్లయితే, మీలాంటి పేదప్రజలు అనుభవిస్తున్న కష్టాల పట్ల మీహృదయాలు పూర్తిగా రాయిగా మారకపోతే మననేత కార్మికుల చుట్టూ సమీకృతం కండి. మనం మన ఉమ్మడి డిమాండ్లను ముందు పెడదాం. అనుకూలమైన ప్రతి సమయంలోనూ మన పీడకుల నుండి మరింత మంచి పని పరిస్థితులను సంపాదించుకోవటానికి ప్రయత్నం చేద్దాం. స్పిన్నింగ్ షెడ్లలోని కార్మికులు తమ వేతనాలలో వచ్చిన కొద్దిపాటి మెరుగుదల, స్థిరత్వాలను గురించి భ్రమలకు లోనుకావద్దు. మీలో పనుల నుండి తొలగించబడిన మూడింట రెండువంతుల మంది కార్మికులు పస్తులకు గురవుతుంటే, వారి పస్తుల కారణంగా మీ వేతనాలు పెరిగాయి. ఇది కూడా యజమానులు పన్నిన ఒక మోసపుటెత్తుగడ. మీరు గాని మూల్ స్పిన్నింగ్ డిపార్ట్‌మెంట్ మొత్తంగా గతంలో ఎంత సంసాదించింది, ఇపుడెంత సంపాదిస్తున్నదనే అంశాలను పరిశీలిస్తే ఈ మోసం మీకు అర్థం అవుతుంది. కొత్త డైయింగ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న కార్మికులారా! మీకు నెలకు 12 రూబుళ్ళు చెల్లిస్తామని వాగ్దానం చేశారు. ప్రాణాలను హరించివేసే రంగుల వాసనలో రోజుకు 14 గంటల 15 నిముషాలు పనిచేస్తూ మీరెంత సంపాదిస్తున్నారు! మన ఉమ్మడి డిమాండ్లపై శ్రద్ధ పెట్టండి. నైపుణ్యం గల నేతకార్మికులు రోజుకు 20 కోపెక్కులు మాత్రమే సంపాదిస్తుంటే, మీరు రోజుకు 60 కోపెక్కుల వేతనాన్ని నిలబెట్టుకోవటం సాధ్యమని భావిస్తున్నారా? కామ్రేడ్స్, గుడ్డిగా వ్యవహరించకండి. యజమానులు వేసే ఎరలకు మోసపోకండి. ఒకరితో మరొకరు కలిసి కార్మికులందరూ దృఢంగా నిలబడకపోతే ఈ చలికాలం మనకు కష్టకాలంగా పరిణమిస్తుంది. యజమానులు మన వేతనాలను తగ్గించటానికి అనుసరిస్తున్న కుతంత్రాలను అందరం జాగ్రత్తగా గమనిస్తూ, మన జీవితాలను మరింత దుర్భరం చేసే ఈ ప్రయత్నాలను ప్రతిఘటించాలి."

**(1895లో థోర్న్టన్ మిల్లు నేతకార్మికుల గురించి లెనిన్ రాసిన**
**"థోర్న్టన్ మిల్లులోని స్త్రీ, పురుష కార్మికులకు" వ్యాసం నుండి ఈ భాగం (గ్రహించబడింది)**

Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.10, No.7. Published on December 1, 2015